జులై
2023

207

సంపుటి :19 సంచిక : 2

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

మార్క్సిజం ప్రాసంగికతకు కారణమేమిటి?
ప్రమాణాలు, విలువలే కమ్యూనిస్టులకు ఆయుధాలు
తెలంగాణ పాలన: తులనాత్మక పరిశీలన
మౌర్యుల అనంతర కాలంలో సమాజం - సంస్కృతి
భారత స్వాతంత్ర్యం కోసం సావర్కర్ చేసిందేమీ లేదు
అటవీ సంరక్షణ చట్ట సవరణ: గిరిజనులపై మరో దాడి
మణిపూర్ మారణకాండకు కారకులెవరు?
హద్దులేని ప్రైవేటు టెలికాం సంస్థల అక్రమాలు
యజుర్వేద, అధర్వ వేద కాలానికి మారిన
సామాజిక స్థితిగతులు

వేద వాఙ్మయం

# యజుర్వేద, అధర్వ వేద కాలానికి మారిన సామాజిక స్థితిగతులు



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

**పిబి చారి**

**ఋ**గ్వేదం లాగానే యజుర్వేదం, అధర్వవేదం కూడా ప్రధానంగా కర్మకాండకు సంబంధించిన మంత్రాల సంకలనాలే. కొత్తగా మంత్రాలు అవసరం అయ్యాయి అంటేనే సమాజం మారిందని అర్థం. సమాజంలో మార్పు లేకపోతే ఋగ్వేదమే సరిపోయేది. కాబట్టి ఋగ్వేదం లోని విషయాలను యజుర్వేదం తో పోలిస్తే క్రీస్తుకు పూర్వం 1000 సంవత్సరాల ముందు కాలానికి, తరువాతి కాలానికి వచ్చిన మార్పు అర్థం అవుతుంది.

క్రీస్తు పూర్వం 1000 నుండి ఆర్యులు సింధు నదీ పరీవాహక ప్రదేశం నుండి తూర్పుకు విస్తరించారు. ఈ విస్తరణ క్రమం సింధూ లోయలకు, గంగా - యమునా లోయలకు మధ్యనున్న ప్రాంతాన్ని, గంగా యమునా లోయల పైభాగానికి విస్తరించ బడినది. అది ఇప్పటి హర్యానా, ఢిల్లీ, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, మద్ర రాజ్యమైన పంజాబ్ సరిహద్దుల్లోను, మత్స్య రాజ్యమైన రాజస్థాన్ భూభాగం అన్నమాట.

ఆర్యులు గణవ్యవస్థను ఛేదించుకొని మెల్లమెల్లగా రాచరికాలను ఏర్పరుచుకున్నారు. ఋగ్వేద కాలంలో రాజ్యాలు లేవు. భరత, పురు అన్న ప్రధాన తెగలకు చెందిన ప్రజలు కలిసి “కురు” అన్న తెగ గా మారారు. రుగ్వేదంలో పురూరవుడు పురు కుత్సుడు అన్న వారు మనకు కనిపిస్తారు. వారిలోని పురుకుత్సుని కొడుకు “త్రసదస్యుడు”. ఈ త్రసదశ్యుని కొడుకు “కురుశ్రవణుడు”. ఇతని పేరు మీదుగానే కురువంశం మొదలైంది. మొదట రాచరికం ఏర్పరుచుకున్న గణాలలో కురు గణం ఒకటి.

కురు మహారాజు తన తపస్సు ఫలితంగా కురు జంగలాన్ని కురుక్షేత్రం గా మార్చాడని మహాభారతంలోని ఆది పర్వంలో ఉంది. అడవులను (జంగలం) వ్యవసాయ క్షేత్రంగా మార్చడానికి అవసరమయ్యే భౌతిక శ్రమ యొక్క అద్భుత బ్రాహ్మణీ కృతరూపం, ఈ తపస్సు అనుకుంటే అది గొప్ప చారిత్రక పరిణామ ఫలితమే. త్వరలోనే ఈ కురు తెగ వారు గంగా సింధు మైదానం లోని ఉత్తర భాగంలో ఉన్న ఢిల్లీ, కురుక్షేత్రం వరకు (కురు తెగ వారి నివాసం) విస్తరించారు. క్రమంగా వారు గంగా యమునా ప్రాంతాలలో నివసించే''పాంచాల'' ప్రజలతో చేయి కలిపారు. అలా కురుపాంచాల తెగల ఆధిపత్యం ఢిల్లీకి, గంగా –యమునా మైదానం పశ్చిమ, మధ్య ప్రాంతాలకు వ్యాపించింది. వారు మీరట్ జిల్లాలో ఉన్న “హస్తినాపూర్ “ను రాజధానిగా చేసుకున్నారు. (శతపథ బ్రాహ్మణం 3-2-3-15) లోనూ అలాగే కడపటి వైదిక రచనలలోనూ ఉన్నది.

మహాభారతంలో ప్రధానమైన కురుక్షేత్ర సంగ్రామానికి కురు తెగ వారి చరిత్ర ముఖ్యమైనది. ఈ యుద్ధం కౌరవులకు ,పాండవులకు మధ్య (వీరిద్దరూ కురు తెగకు చెందిన వారే). క్రీస్తుపూర్వం 950లో జరిగినట్లుగా చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ యుద్ధంలో కురు తెగ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

రుగ్వేదంలో రాజులు రాచరికాలు రాజ్యాలు లేవని తెలుసుకున్నాం కదా. కానీ యజుర్వేద కాలానికి రాజులు, రాజ్యాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ రాజు పట్టాభిషిక్తుడు అవుతాడు. ఈ రాచరికం చుట్టూ బలమైన, సంక్లిష్టమైన, కర్మకాండ అల్లుకుని ఉన్నది. రాజుగారు సింహాసనాన్ని అధిష్టించే సమయంలో ప్రత్యేకమైన, పవిత్రమైన క్రతువులను పురోహిత వర్గం నిర్వహించేది. దీనిని రాజసూయ యాగం అని అధర్వవేదం (4-8-1) పేర్కొంటుంది. ఈ క్రతువుకు సంబంధించిన వివరాలను వెల్లడించే మంత్రాలు యజుర్వేద సంహిత లోను, బ్రాహ్మణా లలోనూ ఉన్నాయి. ఈ కర్మ కాండ నిర్వహించిన బ్రాహ్మణులకు పెద్ద మొత్తంలో దక్షిణలు ఇవ్వడం జరిగింది. ఈ విధంగా క్షత్రియుల, బ్రాహ్మణుల తమ ప్రాబల్యాన్ని పరస్పరం పెంపొందించుకున్నారు. దీనితోపాటు అశ్వమేధ యాగానికి ఆనాటికే అంతకంతకూ ప్రాధాన్యత పెరిగిపోయింది. యజ్ఞాశ్వం తిరిగిన ప్రాంతమంతటా పాలకుడు లేదా రాజు తన ఆధిపత్యాన్ని ప్రకటించడానికి ఈ యాగాన్ని చిహ్నంగా మార్చారు. యజ్ఞాశ్వం తిరిగి వచ్చిన తర్వాత యజ్ఞాఅశ్వంకి, పట్టపురాణి సౌభాగ్యానికి సంబంధించిన క్రతుభాగంకొన సాగించబడు తుంది. (ఈ క్రతువులో భాగంగా రాజుగారి పట్టపురాణి గుర్రంతో రాత్రంతా గడపవలసి ఉంటుంది. ఇది కొంత అశ్లీల భాగం). కురువంశ మహారాజు పరీక్షిత్తు వారసుడైన జనమేజయుడు అశ్వమేధ యాగాన్ని జరిపినట్లు ఐతరేయ, శతపథ బ్రాహ్మణాలు రెండూ చెబుతున్నాయి.

రాజు యొక్క అధికార ప్రభావం పెరగటంతో రాజాస్తానికులు, ఉద్యోగులు రాజుకు సేవలందించడానికి ఒక సాంప్రదాయ కూటమి ఏర్పడింది. ఇలాంటి వారిని రాజస్థానములో ఉన్న రత్నాలు గా పేర్కొన్నారు. శతపథ బ్రాహ్మణం 5-3-1,1-11 లో ఈ రత్నాలను పేర్కొన్నది. 1. సేనాని (సైన్యాధిపతి) 2. పురోహితుడు 3. రాణి 4. సూత (సలహాదారు) 5. గ్రామణి (గ్రామ పెద్ద) 6. క్షత్రి (రాజ గృహ నిర్వాహకుడు)7. (సంగ్రహీత్రి)8. భాగదుష (పంపిణీదారు లేదా చెల్లింపులు జరిపే వ్యక్తి) 9. అక్షా వాప(పాచికల సంరక్షకుడు) 10. గోవికర్తన (ఆవులను నరికే వాడు) 11. పాలాగల (వార్తా హరుడు). ఇలా రాజాస్థానంలోని రత్నాలను వివరిస్తుంది ఆ బ్రాహ్మణం.

**బలి పన్ను లేదా కప్పం గురించిన ప్రస్తావనలు పదే పదే ఈ గ్రంథంలో వస్తాయి.**

ఈ కురు పాంచాల రాజ్యమే కాక మరో

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

1. యజుర్వేద, అధర్వ వేద కాలానికి మారిన సామాజిక స్థితిగతులు
పిబి చారి ......2

2. మార్క్సిజం ప్రాసంగికతకు కారణమేమిటి?
ఎంఎ బేబీ .............4

3. ప్రమాణాలు, విలువలే కమ్యూనిస్టులకు ఆయుధాలు
వి. శ్రీనివాస రావు..........6

4. తెలంగాణ పాలన: తులనాత్మక పరిశీలన
ఎస్ వీరయ్య ..........9

5. మౌర్యుల అనంతర కాలంలో సమాజం - సంస్కృతి
ఎంవిఎస్ శర్మ.......12

6. భారత స్వాతంత్ర్యం కోసం సావర్కర్ చేసిందేమీ లేదు
ప్రొ॥ వినయ్ లాల్.....15

7. అటవీ సంరక్షణ చట్ట సవరణ: గిరిజనులపై మరో దాడి................20

8. మణిపూర్ మారణకాండకు కారకులెవరు?
ఎ కోటిరెడ్డి ....23

8. హద్దులేని ప్రైవేటు టెలికాం సంస్థల అక్రమాలు – రాహుల్ వర్మ....26

సంపాదకుడు :
ఎస్.వెంకట్రావు

సంపాదక వర్గం :
పాటూరు రామయ్య
బి.వి.రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్.వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org

# బిజెపి గవర్నర్లు

**త**మిళనాడు గవర్నర్ ఆర్ఎస్ రవి, ఆ రాష్ట్ర మంత్రిని రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా పదవి నుండి తొలగించిన ఘటన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గవర్నర్ల వ్యవస్థను ఉపయోగించుకుని రాష్ట్రాల హక్కులపైనా, ఫెడరల్ వ్యవస్థపైనా చేస్తున్న దాడులకు పరాకాష్ట. గవర్నర్ దుశ్చేష్టకు ప్రతిపక్షాలే కాకుండా దాదాపు దేశంలోని ప్రధాన మీడియా అంతా తీవ్రంగా విమర్శించడంతో కేంద్ర ప్రభుత్వం తప్పని పరిస్థితుల్లో గవర్నర్ చేత మంత్రి తొలగింపు ఉత్తర్వులను తాత్కాలికంగా నిలుపివేయించింది.

ఎన్నికయిన ప్రభుత్వ సలహా మేరకు మంత్రులను నియమించడం గానీ, తొలగించడం గానీ గవర్నరు చేయాలే మినహా ఆయన స్వయంగా, ఏకపక్షంగా నిర్ణయాలు చేయకూడదని మన రాజ్యాంగం నిర్దేశిస్తోంది. కానీ బిజెపి గవర్నర్లు ఇటీవలి కాలంలో ఈ రాజ్యాంగ సూత్రాన్ని ఉల్లంఘించి కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో బిజెపియేతర రాష్ట్రాల అధికారాలపై దాడి చేయడం రివాజుగా మారింది. ఇదే గవర్నర్ తమిళనాడు శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగంలో కొన్ని భాగాలను మినహాయించి చదవడం తీవ్ర విమర్శలకు కారణమైంది. అంతకు ముందు కేరళ గవర్నర్ ఎల్‌డిఎఫ్ మంత్రివర్గం నుండి కెఎన్ బాలగోపాల్‌ను తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఆ పనిచేయకపోతే ఏకపక్షంగా తొలగించే అధికారం తనకుందని బెదిరించారు. ఇప్పుడు తమిళనాడు గవర్నర్ లేని అధికారాలను తెచ్చుకుని ఏకంగా మంత్రిని తొలగించారు.

మోడీ ప్రభుత్వం గవర్నర్లను అడ్డుపెట్టుకుని రాష్ట్రాల హక్కుల మీదా, రాజ్యాంగంలోని ఫెడరల్ సూత్రాల మీదా తీవ్రమైన దాడి చేయడం 2014 నుండి జరుగుతూనే ఉంది. మహరాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, గోవా, కర్నాటక, కేరళలో ఈ దాడులను చూశాం. తెలంగాణా గవర్నర్ తమిళ సై, రాష్ట్రప్రభుత్వం తనదని మరిచిపోయి ఒక ప్రతిపక్ష నేతలాగా వ్యవహరిస్తున్న తీరు చూస్తూనే ఉన్నాం.

గవర్నర్లకు రాజ్యాంగం ఇచ్చిన కొన్ని విచక్షణాధికారాలను ఉపయోగించుకుని వారు సమాంతర అధికార కేంద్రాలుగా మారడానికి ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించే బిల్లులకు కొన్ని సార్లు వాళ్లు ఆమోదం ఇవ్వకుండా తొక్కిపడుతున్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నరు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లును ఆమోదించాలి, లేకుంటే తిరిగి శాసన సభకు పంపాలి. శాసన సభ మళ్లీ ఆ బిల్లును ఆమోదించి గవర్నకు పంపితే దానిపై సంతకం చేసి ఆమోదించడం మినహా గవర్నరుకు మరో ప్రత్యామ్నాయం లేదు. అసాధారణ పరిస్థితుల్లో ఆయన బిల్లును రాష్ట్రపతికి పంపించవచ్చు. కాని గవర్నర్లు ఇవేవీ చేయకుండా బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టేస్తున్నారు. వాళ్లు బిల్లుకు ఆమోదం తెలపరు, లేక శాసన సభకు తిరిగి పంపరు లేకుంటే రాష్ట్రపతికీ పంపించరు. ప్రజలచేత ఎన్నుకోబడిన శాసనసభ ఉద్దేశాన్ని నామినేట్ చేయబడిన, కేంద్రంచే నియమించబడిన గవర్నరు నిరాకరిస్తున్నారు. ఇది కచ్చితంగా ప్రజాస్వామ్యం మీద దాడి మినహా మరేమీ కాదు. రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయాల ఛాన్సలర్లుగా గవర్నర్లు ఉంటున్నారు. ఈ అధికారం వారికి రాజ్యాంగం కల్పించింది కాదు. ఈ అధికారాన్ని వారికి రాష్ట్ర శాసన సభలు, చట్టాలు కల్పించాయి. ఈ అధికారాన్ని కూడా గవర్నర్లు దుర్వినియోగం చేస్తూ బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలపై రాజకీయ దాడికి ఉపయోగించుకుంటున్నారు. దీనికి ఇటీవలి ఉదాహరణ కేరళలో జరిగిన ఘటనలు.

వాస్తవానికి మన గవర్నరు వ్యవస్థ బ్రిటిష్ వలస వాదం మనకు మిగిల్చిన వారసత్వం. ప్రజాస్వామ్యంలో గవర్నరు పదవికి ఏమాత్రం ప్రాధాన్యత లేదు. అందువల్లనే సిపిఐ(ఎం) గవర్నరు వ్యవస్థను రద్దు చేయాలని కోరుతోంది.

గవర్నర్ల ద్వారా రాజ్యంగంపై జరుగుతున్న ఈ దాడి సాధారణంగా జరుగుతున్న దాడి కాదు, మన లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని తిరగరాయడానికి ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న దాడి. అందువల్ల ఈ దాడిని ఇతర అంశాలతో సంబంధం లేకుండా చూడలేం. మన రాజ్యాంగంలోని అన్ని మౌలిక అంశాలమీదా అంటే లౌకికత్వం, ప్రజాసామ్యం ముఖ్యంగా పార్లమెంటరీ ప్రజాసామ్యం, ఫెడరలిజం మొదలైన రాజ్యాంగ మౌలిక అంశాలన్నిటిమీదా జరుగుతున్న దాడిలో ఇదో భాగం. అందుకే ప్రజాస్వామ్య వాదులు, మన రాజ్యాంగాన్ని రక్షించాలనుకునేవారు గవర్నర్లను ఉపయోగించుకుని కేంద్ర ప్రభుత్వం ఎన్నికైన ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపై చేస్తున్న ఈ దాడులను ముక్త కంఠంతో ఖండించాలి.

ఈ మాసం ముఖ్యాంశం

# మార్క్సిజం ప్రాసంగికతకు కారణమేమిటి?

ఎంఎ బేబీ

**(ఇటీవల విజయవాడలో మార్క్స్, ఏంగెల్స్ సంకలిత రచనలు పుస్తకావిష్కరణ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ చేసిన ప్రసంగ పాఠాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.... సంపాదకుడు)**



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

**30** సంవత్సరాల క్రింతం వరకు మేము కేరళలో అభ్యుదయ సాహిత్యాన్ని ప్రభాత్ పబ్లిషర్స్ వద్ద కొని చదువుకొనే వాళ్లం. ఇక్కడ విశాలాంధ్ర బుక్‌హౌస్ మాదిరిగానే కేరళలో ప్రభాత్ బుక్‌హౌస్ ఆనాడు సోవియట్ యూనియన్‌కు చెందిన ప్రోగ్రెస్ పబ్లిషర్స్ ప్రచురించిన పుస్లకాల అనువాదాలను అమ్మేది. ఆ పుస్తకాలు మాలో నాడు ప్రపంచంలో జరిగే పురోగామి ఉద్యమాల గురించిన స్ఫూర్తిని నింపేవి. ప్రపంచంలోని మూడో వంతు భూభాగంలో జరిగే సోషలిస్టు నిర్మాణాన్ని గురించి వివరించేవి.

కానీ నేడు మనం ఒకవైపు సోషలిజం వెనుకంజ వేసిన పరిస్థితితుల్లో ఉన్నాం, మరోవైపు ప్రపచంలోని ఇంకో ప్రాంతంలో అంటే లాటిన్ అమెరికాలో పురోగామి శక్తులు తిరిగి పుంజుకుంటున్న దశలో, ప్రపచంలోనే అతి పెద్ద జనాభా ఉన్న చైనా ప్రపంచలోనే ఆర్థికంగా అతి శక్తివంతమైన దేశాల్లో ఒకటిగా ఎదుగుతున్న దశలో ఉన్నాం. త్వరలోనే అది ఆర్థికంగా అమెరికాను అదిగమిస్తుందనీ, ప్రపంచ నెంబర్ వన్ ఆర్థిక శక్తిగా అవతరిస్తుందనీ ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఆ విధంగా మనం ఒకవైపు సోవియట్ యూనియన్, తూర్పు యూరప్‌లలో సోషలిజానికి ఎదురుదెబ్బలు తగిలిన పరిస్థితుల్లోనూ, మరోవైపు వామపక్ష, పురోగామి శక్తులు అభివృద్ధి చెంతున్న కాలంలోనూ ఉన్నాం.

మార్క్స్ బ్రతికి ఉన్న కాలంలోనే మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని 'మార్క్సిజం' అని అనేక మంది సిద్ధాంతవేత్తలు, పురోగామి వాదులు పేర్కొన్నపుడు దాన్ని మార్క్స్ అంగీకరించలేదన్న విషయం మనకు తెలుసు. నిజానికి ఒకానొక సందర్భంలో మార్క్స్ తాను మార్క్సిస్టును కానని అన్నారు. అంటే ఒక తత్వవేత్తనుండి, ఒక విప్లవ కార్యాచరణ వాది నుండి ఒక సిద్ధాంతం పుట్టింది అనేదాన్ని మార్క్స్ వ్యతిరేకించాడు. ఆయన చాలా స్పష్టమైన అవగాహనతోనే ఈ వైఖరి తీసుకున్నాడు. కానీ ఏదో పేరుతో పిలవాలి కాబట్టి వెసులుబాటు కోసం మనందరం మార్క్సిజం అంటున్నాం. ఎందుకంటే ఆలోచనా పరిజ్ఞానపు చరిత్రలో, ఇంకా చెప్పాలంటే విప్లవ కార్యాచరణకు సంబంధించిన ఆలోచనల చరిత్రలో కార్ల్ మార్క్స్ మాత్రమే సమాజం ఎలా మారుతుందో స్పష్టంగా చెప్పగలిగారు. అంతకు ముందు చాలా రకాల తత్వ సిద్ధాంత అవగాహనలు న్నాయి. ప్రాచీన కాలం నుండీ కూడా ప్రతి నాగరికతలోనూ సమానత్వం అనే భావన గల సామాజిక వ్యవస్థల గురించిన అవగాహన ఉన్నది. మళయాళం కవి ఒళ్లపెల్లి ఒకానొక తన కవితలో ప్రపంచంలోని వివిధ నాగరికతల గురించి వివరిస్తూ ఈ ప్రాచీన నాగరికతలన్నిటిలోనూ 'ఓణం' అనే భావన ఉందని రాశాడు. ఓణం అనేది కేరళవాసుల పండగ. ఈ పండగ భావనే అందరూ సమానమని. సమానత్వం వర్ధిల్లాలని. ఇటువంటి సమానత్వపు సంస్కృతి ప్రాచీన నాగరికతలన్నిటిలోనూ ఉన్నదని, లాటిన్ అమెరికాలోని 'ఇంకా' సంస్కృతి, మెసపొటోమియా సంస్కృతి, ఈజిప్టు సంస్కృతి, చైనా సంస్కృతి, భారతీయ సంస్కృతిలో కూడా ఉన్నదని కవి రాశాడు. 1877లో అమెరికన్ శాస్త్రవేత్త లూయిా హెన్రీ మోర్గన్ ఒక పుస్తకం రాశాడు. దాని పేరు 'ప్రాచీన సమాజం'. ప్రాచీన కాలంలో కుటుంబ సంబంధాలు ఎలా మారుతూ వచ్చాయో, చారిత్ర పూర్వ దశ ఇంకా చెప్పాలంటే ఆదిమ సమాజం ఎలా ఉండేదో ఆయన చెప్పాడు. మానవాభవృద్ధిలోని ఈ దశను 'ఆదిమ కమ్యూనిస్టు సమాజం' అని కూడా అన్నాడు. ఇప్పుడు మనం పిత్రుస్వామిక సమాజంలో ఉన్నాం. కానీ ప్రాచీన సమాజంలో మహిళలు ప్రధాన మైన సామాజిక బాధ్యత నిర్వహించేవారని మోర్గన్ చెప్పారు. వాటిలోని కొన్ని సమాజాల్లో మహిళలే నాయకత్వ స్థానంలో ఉండేవారు. ఆ సమాజంలో వర్గ వైరుధ్యాలుండేవి కావని మోర్గన్ చెప్పారు. అంటే సమాజంలో ప్రాచీన దశ అంతా వర్గ రహిత దశే. మోర్గన్ ఈ విషయం కనిపెట్టిన తరువాత కారల్ మార్క్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళికకు ఒక ఫుట్ నోట్స్ రాయాల్సి వచ్చింది. ఎందుకంటే కమ్యూనిస్టు ప్రణాళిక ఒక వాక్యంతో ప్రారంభమవుతుంది. మానవ సమాజ చరిత్ర అంతా వర్గ పోరాట చరిత్రే అని. తరువాత ఈ ఫుట్ నోట్స్ ఇచ్చారు. అదే మంటే వర్గ సమాజం ఏర్పడిన తరువాత మానవ సమాజ చరిత్ర అంతా వర్గపోరాట చరిత్రే అని. వర్గ సమాజం ఏర్పడక ముందు వర్గ రహిత సమాజం ఉండేది. అప్పుడు వర్గ పోరాటం లేదు.

మార్క్స్, ఏంగెల్స్ సమాజంలోని అన్ని కొత్త ఆవిష్కరణలను స్వీకరించి తమ తాత్విక సిద్ధాంతాన్ని పరిపుష్టం గావించారు. మార్క్స్, ఏంగెల్స్ తీసుకున్న వైఖరిని మనలో చాలా మందిమి తీసుకోలేకపోతున్నాం. వారు తీసుకున్న వైఖరి ఏమిటి? ఈ మొత్తం విశ్వంల , ఈ సమాజంలో, మనుషులతో సహా మొత్తం జీవరాశి శరీరాల్లో నిరంతరం మార్పులు జరుగుతుంటాయి. ఈ విశ్వంలో అంటే మహామహా దూరాలను ఆక్రమించే గెలాక్సీల నుండి కంటికి కనిపించని పరమాణువుల వరకు నిరంతం మార్పులు సంభవిస్తూనే ఉంటాయి. ఈ సమాజంలో కూడా నిరంతం మార్పులు జరుగుతుంటాయి. ప్రతి జీవరాశలో, ప్రతి మనిషిలో నిరంతరాయంగా మార్పులు జరుగుతూనే ఉంటాయి. అందువల్ల సజీవమైన ప్రతి సిద్ధాంతం కూడా నిరంతరాయంగా, వేగంగా మారుతున్న ఈ మార్పులను దృష్టిలో పెట్టుకోవాలి. దానికనుగుణంగా మనం మన సిద్ధాంతాన్ని తాజాపరుచుకుంటూ ఉండాలి.

అందువల్ల మార్క్స్, ఏంగెల్స్ ఏమి చెప్పారంటే మేము అసలు మార్పులేకుండా నిరంతరం ఉండిపోయేదేన్నీ కనిపెట్టలేదు అన్నారు. మార్క్స్, ఏంగెల్స్ సంయుక్తంగా రూపొందించిన మహత్తర ఆవిష్కరణ అయిన కమ్యూనిస్టు ప్రణాళిక గురించి కూడా వారు అదే విషయం చెప్పారు. కమ్యూనిస్టు ప్రణాళిక తరువాతి కాలంలో మేము రాసిన రచనలన్నీ కూడా కమ్యూనిస్టు ప్రణాళిక ఆలోచనల కొనసాగింపులేనని వారు పేర్కొన్నారు. వాళ్లు కార్మిక వర్గ రాజ్యం వస్తే ఎటువంటి విధానాలు అమలు చేయాలో వరుస సంఖ్యలో చెప్పారు. అయితే వారు దాన్ని ఒక సాధారణ మార్గదర్శకం మాత్రమేనని స్పష్టం చేశారు. ఆయా దేశ, కాలాలను బట్టి మార్పులుంటాయన్నారు. నేను ఇక్కడ ఒక సరళమైన, కానీ సంక్లిష్టమైన ప్రశ్నను ముందుకు తెస్తాను. దానికి సమాధానం చెప్పాలని కాదు. దాని గురించి మనందరం లోతుగా ఆలోచించాలని మాత్రమే. మార్క్సిజం-లెనినిజం ఇచ్చిన ఈ అవగాహనతో మనం సోవియట్ యూనయన్‌లోనూ, తూర్పు యూరప్‌లోనూ సోషలిజానికి ఎదురైన ఎదురుదెబ్బలను ఎలా సంగ్రహపరచగలం? దానికి సరళమైన సమాధానం ఒక్కటే. ఆ వ్యవస్థ నిరంతరం జరుగుతున్న మార్పులకనుగుణంగా తనను తాను తాజాపరుచుకోలేకపోయింది. సిఐఎ కుట్ర, దాని ఎరలో కొంతమంది పడిపోవడం వంటి అనేక అంశాలు ఉన్న మాట నిజమే. కానీ కీలకమైన అంశం ఏమంటే, సోవియట్ యూనియన్‌లోనూ, తూర్పుయూరప్‌లోనూ విప్లవ శక్తులు నిరంతరం విప్లవాత్మకంగా మార్పు చెందడంతో విఫలం కావడమే. 1899లోనే వ్లదిమీర్ ఇల్యిచ్ లెనిన్ భవిష్యత్ దర్శనం లాగా దీని గురించి 'మన కార్యక్రమం' అని ఆయన రాసిన గ్రంథంలో చెప్పాడు. ఆయన ఇలా పేర్కొన్నాడు. "మేము మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పరిపూర్ణమైనదిగానో లేక అనుల్లంఘనీయమైనదిగానో పరిగణించడం లేదు. కానీ అది సైన్సుకు పునాది రాయి. దాన్ని సోషలిస్టులమైన మనం అన్ని దిశల్లో అభివృద్ధి చేయాలి. అలా కాకుంటే మనం జీవితంతో పాటు ఎదగలేం." (లెనిన్ ఏరిన రచనలు, వాల్యూమ్ 4, పేజీ నెం.11,12). ఈ వాక్యాలు ఇక వివరణ అవసరం లేనంత స్పష్టంగా ఉన్నాయి. సూటిగా, నిక్కచ్చిగా, శాస్త్రీయంగా ఉన్నాయి. ప్రతిదీ తుది అంశం అని మార్క్స్, ఏంగెల్స్ చెప్పలేదని లెనిన్ చెప్పాడు. కానీ మనలో కొంతమందిమి మాత్రం దాన్ని బైబిల్, ఖురాన్, భగవత్ గీత లాగా చూస్తుంటాం. కానీ ఈ ధోరణిని మార్క్స్, ఏంగెల్స్ ఏనాడూ అంగీకరించలేదు. లెనిన్ ఎన్నడూ అంగీకరంచలేదు.

అందువల్ల ప్రతిదీ మార్పు చెందుతూ ఉంటుంది. నిరంతరాయంగా మారిపోతూ ఉంటుంది. దానికనుగుణంగా మనం నిరంతరం తాజపరుచుకుంటూ వెళ్లాలని మార్క్సిజం చెపుతుంద. ఈ కారణం చేతనే మార్క్సిజం నేటికీ ప్రాసంగికత కలిగి ఉంది. బ్రిటిష్ రచయిత టెర్రీ ఈగల్టన్ "మార్క్సిజం ఎందుకు, ఎలా ప్రాసంగికత కలిగి ఉంది" అని రాసిన పుస్తకంలో ఈ విషయాన్ని సంగ్రహపరిచాడు. 'సమాజంలో వర్గ విభజన ఉన్నంత కాలం, అసమానతలు ఉన్నంత కాలం, అన్యాయం కొనసాగుతున్నంత కాలం శాస్త్రీయ పునాదుల మీద నిలబడ్డ మార్క్సిస్టు సిద్ధాంతం, మార్క్స్, ఏంగెల్స్ ప్రతిపాదించి, లెనిన్ అభివృద్ధి చేసిన సిద్ధాంతం నిరంతరాయంగా స్ఫూర్తినిస్తూనే ఉంటుంది' అని ఆయన స్పష్టం చేశాడు. ఈ అవగాహనతోనే మనం నిరంతరం మన మార్క్సిస్టు పరిజ్ఞానాన్ని తాజాపరుచుకుంటూ వెళ్లాలి.

❋

**"ఈ సమాజంలో కూడా నిరంతం మార్పులు జరుగుతుంటాయి. ప్రతి జీవరాశలో, ప్రతి మనిషిలో నిరంతరాయంగా మార్పులు జరుగుతూనే ఉంటాయి. అందువల్ల సజీవమైన ప్రతి సిద్ధాంతం కూడా నిరంతరాయంగా, వేగంగా మారుతున్న ఈ మార్పులను దృష్టిలో పెట్టుకోవాలి. దానికనుగుణంగా మనం మన సిద్ధాంతాన్ని తాజాపరుచుకుంటూ ఉండాలి."**




కమ్యూనిస్టు ప్రణాళిక రూపకర్తలు కారల్ మార్క్స్, ఏంగెల్స్

దిద్దుబాటు ఉద్యమం

# ప్రమాణాలు, విలువలే కమ్యూనిస్టులకు ఆయుధాలు

**వి.శ్రీనివాసరావు**



రచయిత సిపిఐ(ఎం) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శి

సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ దిద్దుబాటు ఉద్యమం కోసం నిర్ణయించిన మూడు ప్రధాన అంశాల్లో కమిటీల పనివిధానంలో ఉన్న లోపాలు, బలహీనతల గురించి గత సంచికలో చర్చించుకున్నాము. కమ్యూనిస్టు ప్రమాణాలు, వ్యక్తిగత విలువల అమలును సమీక్షించి సరిదిద్దుకోవాలని మరో ముఖ్యమైన అంశంగా కేంద్ర కమిటీ నిర్దేశించింది.

బూర్జువా ప్రమాణాలు, విలువలకు పూర్తిగా విరుద్ధమైనవి కమ్యూనిస్టు ప్రమాణాలు, విలువలు. సరళీకరణ ఆర్థిక విధానాల అమలు తరువాత రాజకీయాలు అత్యంత లాభసాటి వ్యాపారంగా మారిపోయింది. ఓటు ఒక సరుకుగానూ, ప్రభుత్వం ఒక కంపెనీలాగా నడుస్తున్నది. క్రమంగా ఓటుకు వెచ్చించే ధర పెరుగుతూ వస్తుంది. బూర్జువా పార్టీలు అధికారంకోసం పోటీలుపడి డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఓటు వేసినా, వేయకపోయినా కవర్లు అందజేస్తున్నారు. జనం కూడా డబ్బులు తీసుకోవడం ఒక హక్కుగా భావిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే పోలింగ్ స్టేషన్ దగ్గరకు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఈ సంస్కృతికి భిన్నంగా కమ్యూనిస్టులు డబ్బులు పంచరు, పైగా ఎన్నికల ఖర్చులకోసం జనాన్నే డబ్బులు అడుగుతారు. ఎన్నికల్లో ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా పోరాడే క్రమంలో కొన్ని ప్రాంతీయ బూర్జువా పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం ఈ కాలంలో అనివార్యమైంది. బూర్జువా పార్టీల వెనకున్న జనానికి ఆ పార్టీలు డబ్బులు ఇస్తేనే వేయించగలిగిన స్థితి వచ్చింది. కొన్ని సందర్భాల్లో బూర్జువా పార్టీలు కమ్యూనిస్టులు పోటీ చేసిన చోట వారిచేతనే తమ జనానికి డబ్బులు పంపిణీ చేయిస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. దీనితో కమ్యూనిస్టులు కూడా డబ్బులు ఇస్తారన్న భావం ఏర్పడింది. ఇది కమ్యూనిస్టులకు, బూర్జువా పార్టీలకు మధ్య నున్న గీత చెరిగిపోవడానికి దారితీసింది. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంపై ఇది తీవ్రమైన ప్రభావం చూపింది.

కమ్యూనిస్టు పార్టీ నాయకుల జీవన సరళి కూడా సరళీకరణ ఆర్థిక విధానాల కాలంలో ప్రభావానికి గురైంది. బూర్జువా నాయకుల సౌకర్యాలు, కొత్త అలవాట్లు నేర్చుకున్నారు. కమ్యూనిస్టు కుటుంబ జీవితాల్లోనూ మార్పులు వచ్చాయి. పాతతరం ఆలోచనలకు, కొత్తతరం ఆలోచనలకు మధ్య అఘాదం (గ్యాప్) ఏర్పడింది. కుటుంబాల ఒత్తిడి పేరుతో బూర్జువా విలువలను పాటించడం తప్పు కాదన్న భావం అనేక మందిలో ఏర్పడింది. అన్ని పార్టీల నాయకుల్లాగానే ఆడంబరంగా ఖర్చులు చేయడం, సౌకర్యవంతమైన ప్రయాణాలు, వినియోగదారీ సంస్కృతికి అలవాటు పడడం, ఉత్సవాలు, పండగలకు మొగ్గుచూపడం, గృహ ప్రవేశాలు, పిల్లల నూతన వస్త్రాల మహోత్సవాలు, పుట్టిన రోజుతో సహా అనేక తరహా ఉత్సవాలను ఆడంబరంగా జరపడం, సాంప్రదాయ పెళ్లిలకు మొగ్గుచూపడం సర్వసాధారణంగా మారిపోయింది. ప్రజల్లో కలిసిపోవడానికి ఇవన్నీ జరపక తప్పదన్న సమర్థింపు వినిపిస్తోంది. కొంతమంది ప్రజా పంథా అర్థాన్ని మార్చేస్తున్నారు. ఇటువంటి కార్యకలాపాలకు తాము అతీతంగా ఉండి ఇతరులకు ఆదర్శంగా ఉండాలన్న భావానికి బదులుగా అందరూ చేస్తున్నారు కాబట్టి తామూ చేస్తున్నామని ఒకరు చేస్తే రైటు, మరొకరు చేస్తే తప్పా వంటి ప్రశ్నలు కూడా ఎదురవుతున్నాయి. ఆదర్శానికి పోలిక కాకుండా ఆడంబరానికి పోలిక పెట్టే ఈ చర్చ కమ్యూనిస్టు పద్ధతులకు పూర్తి విరుద్ధమైనది.

### పార్టీలోకి చొచ్చుకు వస్తున్న అవినీతిపై పోరాటం

వ్యక్తిగత జీవనంలో బూర్జువా సమాజ ప్రభావంతో వచ్చిన మార్పుల వల్ల అవసరాలకు, కుటుంబ నిర్వహణకు ఖర్చులు పెరిగే కొద్దీ ఆదాయం కూడా పెంచుకోవాల్సిన దురవస్త ఎదురవుతున్నది. అందుకోసం ఎలాంటి తప్పుడు పద్ధతులకైనా దిగజారే పరిస్థితి అక్కడక్కడా వ్యక్తమవుతున్నది. ఈరోజు పార్టీ

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్ధిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

ఎదుర్కొంటున్న ఒక ముఖ్యమైన సమస్య అవినీతి, ఆర్థిక అరాచకత్వం, నిధుల దుర్వినియోగం. వివిధ స్థాయిల్లో ఇది పార్టీని వెంటాడుతున్నది. ప్రజల్లో పార్టీ ప్రతిష్టను పలచబరుస్తున్నది. ఇటీవల కాలంలో కొంతమంది ముఖ్యమైన రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులపైనా చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

> "వ్యక్తిగత జీవనంలో బూర్జువా సమాజ ప్రభావంతో వచ్చిన మార్పుల వల్ల అవసరాలకు, కుటుంబ నిర్వహణకు ఖర్చులు పెరిగే కొద్దీ ఆదాయం కూడా పెంచుకోవాల్సిన దురవస్త ఎదురవుతున్నది. అందుకోసం ఎలాంటి తప్పుడు పద్ధతులకైనా దిగజారే పరిస్థితి అక్కడక్కడా వ్యక్తమవుతున్నది. ఈరోజు పార్టీ ఎదుర్కొంటున్న ఒక ముఖ్యమైన సమస్య అవినీతి, ఆర్థిక అరాచకత్వం, నిధుల దుర్వినియోగం. వివిధ స్థాయిల్లో ఇది పార్టీని వెంటాడుతున్నది."

### అక్కౌంట్స్ నిర్వహించకపోవడం

కొంతమంది అక్కౌంట్స్ నిర్వహించకుండా దాన్నొక సాధారణ బలహీనతగా చెప్పుకొని సమర్థించుకుంటున్నారు. పనుల బిజీలో ఉండి నిర్వహించలేకపోతున్నామని సాకులు చెబుతున్నారు. అటువంటి వారు అక్కౌంట్స్ బాధ్యత నుండి తప్పుకోడానికి మాత్రం సిద్దపడరు. డబ్బులపై పెత్తనం కావాలనుకుంటారు. కొన్ని సంఘాల బాధ్యులు అక్కౌంట్స్‌ను సంవత్సరాల తరబడి ఆడిట్‌కు ఇవ్వడం లేదు.

ప్రధాన బాధ్యులే అక్కౌంట్స్ నిర్వహిస్తూ అవకతవకలకు పాల్పడడం, సంవత్సరాల కొద్దీ లెక్కలు కమిటీలకు సమర్పించకుండా ఉద్దేశపూర్వకంగా జాగు చేయడం, ఆడిటింగ్‌కు ఇవ్వకపోవడం ఒక ప్రధాన లోపంగా కనిపిస్తున్నది. డబ్బు వసూళ్ళు చేసి సొంతానికి వాడుకోవడానికి నూతన మార్గాలను కూడా కనిపెడుతున్నారు. ఈ విషయంలో కొంతమంది సృజనాత్మక పద్ధతులను కనిపెట్టారు. అధికారిక అక్కౌంట్స్‌కు బదులుగా సొంతగా అక్కౌంట్స్ తెరవడం, సంఘం పేరుతో ఇచ్చిన చెక్కును బ్యాంకులో వేసి సొంతానికి డ్రా చేయడం, వాటిని అక్కౌంట్స్‌లో వ్రాయకపోవడం వంటి అవలక్షణాలు ఇటీవల కాలంలో అక్కడక్కడా బయటపడ్డాయి. బూర్జువా పార్టీలలో ఇది సహజమైనప్పటికీ కమ్యూనిస్టు పార్టీలో అనుమతించరాని నేరం. స్వల్ప స్థాయిలోనే అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీలో ఈ పరిణామం ఆందోళన కరమైనది. అందుకనే కేంద్ర కమిటీ దిద్దుబాటుకు చేపట్టిన మూడు అంశాలలో అవినీతి, అక్కౌంట్స్ నిర్వహణలోని లోపాలను ఒకటిగా గుర్తించింది. దీనిని సరిదిద్దడానికి చాలా పెద్ద పోరాటమే చేయాల్సి వస్తుంది. యావత్ పార్టీ ఒక్కతాటి మీదకు వచ్చి సరిదిద్దుకోవాలనే దీక్షతో పనిచేస్తేనే ఈ లోపాన్ని అధిగమించడం సాధ్యమవుతుంది. అవినీతికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో వ్యక్తిగత సంబంధాలు ఆటంకం కాకూడదు. ముఠాతత్వం, పదవీకాంక్ష, వ్యక్తిగత లాబీలు, పార్టీలో అవినీతిపై పోరాడటానికి ఆటంకాలుగా మారుతున్నాయి. అందువల్ల పార్టీ ప్రమాణాలను పునరుద్ధరించడానికి పూర్తిస్థాయిలో సమగ్రమైన కృషి జరగాల్సి ఉంది. ఈ క్రమంలో పార్టీ కొన్ని ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి వస్తుంది. పట్టుదలతో, రాజకీయ చైతన్యంతో వ్యవహరిస్తే స్వల్ప కాలంలోనే దీన్ని అధిగమించి పార్టీని మరింత ముందుకు తీసుకొని పోగలుగుతాము.



కమ్యూనిస్టు ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య

1990 తరువాత కమ్యూనిస్టు ఉద్యమానికి కొత్త సవాళ్ళు ఎదురయ్యాయి. ఒక బలమైన సోషలిస్టు వ్యవస్థగా ఉన్న సోవియట్ యూనియన్ కుప్పకూలడం, కమ్యూనిస్టుల యొక్క సైద్ధాంతిక విశ్వాసాన్ని సడలింపచేసింది. అదే సమయంలో అమెరికన్ సామ్రాజ్య వాదం నాయకత్వంలో నయా ఉదారవాద విధానాలు ప్రజలపై ఏకపక్షంగా దాడిచేశాయి. ఈ విధానాలను ముందుకు తీసుకుపోవడానికి మనలాంటి దేశాల్లో మతతత్వాన్ని సాధనంగా

> **“ కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన నేపథ్యంలో పార్టీపై అన్నివైపులనుండి దాడిజరు గుతుంది. పార్టీ నాయ కులు, కార్య కర్తలు సులభంగా పెధ ధోరణులకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. అందువల్ల ఎప్పటికన్నా ఇప్పుడు సైద్ధాంతిక రాజకీయ చైతన్యాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అధ్యయ నం, ఆచరణను కలగలిపి ముందుకు తీసుకు పోయేందుకు పార్టీ ప్రయత్నం చేస్తున్నది. ”**

వాడుకుంటున్నారు. మత విద్వేశాలు పెంచి ప్రజలమధ్య చీలికలు తేవడమేగాకుండా దేశాన్ని కూడా బలహీనపరుస్తున్నారు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడియొక్క పెత్తనానికి మతోన్మాదం ఒక కవచంలా తోడ్పడుతున్నది. ప్రపంచీకరణ ఊపందుకున్న దశలో ఆధునీ కానంతరవాదం (పోస్టు మోడరనిజం), అస్థిత్వ వాద రాజకీయాలు (ఐడెంటిటీ పాలిటిక్స్) ఊపందుకున్నాయి. 1980లో కుల అస్థిత్వ ఉద్యమాల్లో ప్రజాస్వామిక వాంఛ ఉండేది. భూస్వామ్య కులదురహంకారానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలు మంచి విజయాలు సాధించాయి. క్రమంగా బూర్జువా పార్టీలు దీనిని తమలో ఇముడ్చుకొని కమ్యూనిస్టు ఉద్యమాలను, కార్మికోద్యమాల ఐక్యతను దెబ్బకొట్టడానికి సాధనంగా వాడుకోవడానికి మొదలు పెట్టాయి. హిందూత్వ అస్థిత్వవాదం మరింత ప్రమాదకరంగా దేశాన్ని పట్టిపీడి స్తున్నది. సోషల్ ఇంజనీరింగ్ పేరుతో కులాన్ని హిందూత్వ రాజకీయాల్లో అంతర్భాగం చేశారు. ఈ ప్రమాదాన్ని గుర్తించనివారు ఇప్పటికీ వామపక్ష రాజకీయాలపైనే దాడి ఎక్కుపెడుతున్నారు. అస్థిత్వ ఉద్యమాలు క్రమం గా బలహీనపడుతున్నాయి. పాలకవర్గాల రాజకీయాల్లో అవి అంతర్భాగమైపోతున్నాయి. ఈ స్థితిలో సామాజికోద్యమాలను వర్గపోరాటంలో భాగంగా మలచుకుంటేనే కార్మికవర్గ ఐక్యతను కాపాడుకోగలం. పెట్టుబడిదారుల కుట్రలను ఓడించగలం. ఈ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోలేనివారు వర్గపోరాటాల స్థానంలో కుల పోరాటాల్ని ప్రతిష్టించాలని ప్రయత్నిస్తున్నారు. మార్క్సిస్టు దృక్పతంతో అంబేద్కరిజాన్ని అర్థం చేసుకోవడానికి బదులుగా అంబేద్కరిజమే భారతదేశ మార్క్సిజమనే సిద్ధాంత పెధ ధోరనులు కూడా వ్యక్తమవుతున్నాయి. సామాజికోద్యమాలను ముందుకు తీసుకుపోతూనే, కుల వ్యతిరేక పోరాటాలు చేసే సంఘాలు, వ్యక్తులతో కలిసి పనిచేస్తూనే వర్గ దృక్పథాన్ని, వర్గ పోరాటాన్ని మరింత చైతన్యంతో ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉంది.

కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన నేపథ్యంలో పార్టీపై అన్నివైపులనుండి దాడిజరుగుతుంది. పార్టీ నాయకులు, కార్య కర్తలు సులభంగా పెధ ధోరణులకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. అందువల్ల ఎప్పటికన్నా ఇప్పుడు సైద్ధాంతిక రాజకీయ చైతన్యాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అధ్యయనం, ఆచరణను కలగలిపి ముందుకు తీసుకు పోయేందుకు పార్టీ ప్రయత్నం చేస్తున్నది.

నేటి పరిస్థితి 1990లోలాగా లేదు. 21వ శతాబ్దం రెండో దశకంలో అనేక నూతన పరిణా మాలు జరుగుతున్నాయి. అమెరికన్ సామ్రాజ్య వాదం తీవ్రమైన సంక్షోభంలో ఉంది. ప్రపంచ పెత్తనాన్ని కాపాడుకోవడానికి కమ్యూనిజంపై మరోసారి దాడికి పూనుకుంటున్నది. కమ్యూ నిజం భూస్థాపితం అయిందని ప్రకటించిన సామ్రాజ్యవాదులే నేడు కమ్యూనిజమే తమకు ప్రధాన శతృవని ప్రకటించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సోవియట్ యూనియన్ కూలిపో యిన 30 ఏళ్ళ తరువాత సోషలిస్టు చైనా ఒక మహా శక్తిగా నేడు అవతరించింది. లాటిన్ అమెరికాలో అనేక దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. పశ్చిమాసియాలో పెను మార్పులు జరుగుతున్నాయి. యూరప్‌లో కార్మిక, విద్యార్థి ఉద్యమ సమ్మెలు విస్తరిస్తున్నాయి. సోషలిజం గురించిన చర్చ మరోసారి ప్రపంచంలో మొదలైంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిజం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని నేటి పరిణామాలు రుజువు చేస్తున్నాయి. మార్పుకోసం యువతరం అన్వేషణ సాగిస్త న్నది. యువతరం ఎదురుచూసే మార్పు వామ పక్ష ఉద్యమాల ద్వారానే సాధ్యమని, మరో నూతన వ్యవస్థ సోషలిజంలోనే ఉంటుందని విశ్వాసాన్ని ఈతరానికి కల్పించాలి. ఇతర బూర్జువా పార్టీలకు భిన్నంగా కమ్యూనిస్టు పార్టీ ఉంది అన్న విశ్వాసాన్ని కల్పించగలిగితేనే కొత్తతరం మనవైపు చూస్తుంది. అందుకు దిద్దుబాటు ఉద్యమం ఒక సాధనం. కేంద్ర కమిటీ రూపొందించిన మార్గదర్శకాలకను గుణంగా పార్టీ యావత్ ఐక్యంగా నిబద్ధతతో దిద్దుబాటుకు పూనుకోవాలి. ఇది వ్యక్తులపై చర్యలకు సంబంధించిన విషయం కాదు. ఈ పేరుతో ఎవరిపట్ల కక్షసాధింపులకు, వివక్షతతో వ్యవహరించే సమస్య ఉండదు. ఎవరికి వారు తమ లోపాలను గుర్తించి అంతర్గత మార్పుల కోసం సాధన చేయాలి. వ్యక్తుల్లో మార్పుకోసం, స్వయం కృషితో స్వీయమానసికతను అధిగమించి, వస్తుగత దృష్టితో సమిష్టిగా సాగించే ఈ కృషే దిద్దుబాటు ఉద్యమం. ❋

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# తెలంగాణ పాలన: తులనాత్మక పరిశీలన



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**ఎస్ వీరయ్య**

తెలంగాణ పాలకులు దశాబ్ది ఉత్సవాల సంరంభంలో ఉన్నారు. అద్భుతాలు సాధించామని గొప్పలు చెపుతున్నారు. ఏమి సాధించారని సంబురాలు జరుపుతున్నారని బీజేపీ నాయకులు హేళన చేస్తున్నారు. కాంగ్రెసు నాయకులు కూడా విమర్శిస్తున్నారు. ఏ ప్రభుత్వం వనితనమైనా ప్రజల ప్రయోజనాలతోనే బేరీజు వేయగలం. ఎవరికి వారు తమ పార్టీ ప్రయోజనాల దృష్టితోనే పరిశీలిస్తే పాక్షిక నిర్ధారణలే వస్తాయి. అందుకే దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తులనాత్మక పరిశీలన అవసరం. 'తెలంగాణ వస్తే అన్నీ వస్తాయన్నారు' ఉద్యమ కాలంలో. తెలంగాణ ఏర్పడటమే కాదు... దశాబ్ది ఉత్సవాల సమయంలో ఉన్నాం. తిండీ, బట్ట, ఇల్లు, విద్య, వైద్యం లాంటి మౌలిక సమస్యలలో కొత్తగా సాధించిందేమీ లేదు. అదే సమయంలో కాంగ్రెసు, తెలుగుదేశం పాలనకన్నా భిన్నమైనవేమీ లేవని చెప్పజాలం. మార్పులూ, వాటి స్వభావాలు పరిశీలించటం అవసరం.

పాలనను పరిశీలించడం అంటే ఆర్థికాంశాలకే పరిమితం కాలేము. దేనినీ రాజకీయ నేపథ్యం నుంచి విడదీసి చూడలేము. ముఖ్యంగా జాతీయ స్థాయిలో వస్తున్న పరిణామాల నుంచి విడదీసి చూడలేము. దాదాపు ఒకే సమయంలో కేంద్రంలో బీజేపీ సర్కారు, ఇక్కడి తెలంగాణ సర్కారు కొలువుదీరాయి. కేంద్ర ప్రభుత్వం బీజేపీ విధానాలు, దానిని నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రయత్నాల నేపథ్యంలో తెలంగాణ పరిణామాలను పరిశీలించాలి. బూర్జువా పార్టీలు ఏవైనా, తాము చేసిన దానికన్నా ఎక్కువ చెప్పుకుంటాయి. చేయగలిగిన దానికంటే ఎక్కువ వాగ్దానాలు చేస్తాయి. ఓట్ల కోసం, సాధ్యాసాధ్యాలతో నిమిత్తం లేని వాగ్దానాలు చేస్తాయి. ప్రజలను మభ్యపెడతాయి. తెలంగాణ వస్తే అన్నీ వస్తాయని ఉద్యమకాలంలో చెప్పిన నేతలు, ఇప్పుడు అన్నీ చేస్తున్నామనే చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు దేశంలో తన రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకుంటున్నది బీజేపీ. సాక్షాత్తూ ప్రధాని నరేంద్రమోడీ స్థాయిలోనే ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. తన తొమ్మిదేండ్ల పాలనలో దేశం ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించడంలో విఫలమైన మోడీ ప్రభుత్వం, మతం చాటున ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు దక్షిణాదిలో బలపడేందుకు తెలంగాణ మీద కన్నేసింది. అందుకే, తెలంగాణ ప్రభుత్వం సాధించిందేమిటని హేళన చేస్తున్నది. కాంగ్రెసు కూడా బాధ్యతారహిత విమర్శలకు పూనుకున్నది. ఉమ్మడి రాష్ట్రాన్ని అత్యధిక కాలం పాలించింది కాంగ్రెసు. ఆర్థిక, సామాజిక, ప్రాంతీయ అసమానతలకు బాధ్యత వహించాల్సింది కాంగ్రెసు. అలాంటి కాంగ్రెసు పార్టీ, ఇప్పుడు బీఆర్ఎస్ పాలనను విమర్శించడం హాస్యాస్పదం.

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కాంగ్రెసు పాలనలో అమలు చేసిన విధానాలనే మరింత దూకుడుగా అమలు చేస్తున్నది. ఫలితంగా బడా పారిశ్రామికవేత్తలు మరింత బలిసిపోయారు. ఆర్థిక వనరుల మీద కేంద్రం పట్టుబిగించింది. రాష్ట్రాల హక్కులు, అధికారాలను హరిస్తున్నది. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ సంస్థలను తమ రాజకీయ సాధనాలుగా వాడుకుంటున్నది. అవినీతిని చట్టబద్ధం చేసింది. న్యాయవ్యవస్థ మీద కూడా పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తున్నది. రాజ్యాంగంలోని లౌకిక, ప్రజాస్వామ్య విలువలు ధ్వంసం చేస్తున్నది. హిందూత్వ విధానాలు రుద్దేందుకు అన్ని ప్రయ్నాలు చేస్తున్నది. కార్పొరేట్ సంస్థలు, మతోన్మాదుల అపవిత్ర బంధం బలపడుతున్నది. ప్రాంతీయ పార్టీల మనుగడకే ముప్పు ఏర్పడుతున్నది. ప్రతిపక్ష పార్టీల నేతలను బ్లాక్‌మెయిల్ చేసి లొంగదీసుకునేందుకు మోడీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఒక సెక్యులర్, ప్రాంతీయ పార్టీగా టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) వైఖరికి ప్రాధాన్యత ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ విధానాల పట్ల గానీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాల పట్ల గానీ ఈ తొమ్మిదేండ్లలో టీఆర్ఎస్ వైఖరి సూటిగా, నికరంగా ఉన్నదని చెప్పలేము. అనేక ఊగిసలాటలు ప్రదర్శించింది. మొదట కేంద్ర ప్రభుత్వంతో సహకారం పేరుతో అవకాశవాద ధోరణి ప్రదర్శించింది. కానీ తమ రాజకీయ మనుగడకే ముప్పు వస్తున్నదని అర్థమైన తర్వాత కేంద్రంతోను, బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలతోనూ సూటిగా తలపడుతున్నది. పదునైన విమర్శలు చేస్తున్నది. ఇది ఆహ్వానించదగిన పరిణామం. ఇలాంటి సమయంలో బీజేపీ ప్రమాదాన్ని గుర్తించకుండా, రాష్ట్రంలో కాంగ్రెసు నేతలు చేస్తున్న దాడి మతోన్మాదులకే ఉపయోపడుతుందన్న స్పృహ లేకుండా వ్యవహరిస్తున్నది. బూర్జువా పార్టీల స్వభావం పట్ల ఎవరికీ గందరగోళం, భ్రమలు అవసరం లేదు. వాటి అవకాశవాద ధోరణలు, ఊగిసలాటలు, ఉదారవాద విధానాలు అమలు చేయడం వంటి విషయాలలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కు స్పష్టత ఉన్నది. కేంద్రంలో మోడీ సర్కారు విధానాలు, బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదం, హిందూత్వ విధానాలను దేశం మీద రుద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాల ప్రమాదాన్ని గుర్తించాలి. రాజ్యాంగంలోని లౌకిక, ప్రజాస్వామ్య పునాదులనే ధ్వంసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో, వీటికి వ్యతిరేకంగా నిలిచేందుకు

"హక్కులకోసం, అధికారాలకోసం, చట్టపరంగా రావల్సిన నిధులకోసం కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిగా నికరంగా పోరాడుతున్నది. కానీ కేంద్రంతో ఒంటరి పోరాటం ఫలితం ఇవ్వదు కదా! కలిసి వచ్చే రాష్ట్ర ప్రభుత్వాలను కలుపుకుని పోరాడాలి. రాష్ట్రంలో కలిసిరావడానికి సిద్ధపడిన పార్టీలతో కలిసి కేంద్రాన్ని నిలదీయాలి. కలిసే ఉన్నామన్న అభిప్రాయం మాత్రం కలిగిస్తున్నారు కానీ కలిసి పోరాటానికి సిద్ధపడటంలేదు."

సిద్ధపడే శక్తులన్నింటినీ సమీకరించడం తక్షణ కర్తవ్యం. అందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలు, కేంద్రం నియంతృత్వ ధోరణులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ తీసుకునే వైఖరి ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ విషయంలో ఏ మేరకు బీఆర్ఎస్ నాయకత్వం నికరంగా నిలబడితే ఆ మేరకు కలిసి పనిచేయడం వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల బాధ్యత.

టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలులోకి వచ్చాయి. రైతులకు ఉచిత విద్యుత్తు, రైతుబంధు పథకం ద్వారా ప్రతి పంటకు ఎకరానికి పదివేల సాయం, ధాన్యం కొనుగోళ్ళు వంటి చర్యలు పేదలకు, రైతులకు ఊరటనిస్తున్నాయి. వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ వైద్యం మెరుగుపరచటం, కొంతమేరకు ఖాళీ పోస్టులు భర్తీ చేయటం వంటి పాక్షిక చర్యలు కొంత దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయి. ఆమేరకు ఇవన్నీ ఆహ్వానించదగినవే. అదే సమయంలో కేజీ టు పీజీ ఉచిత విద్య, దళితులకు మూడెకరాల సాగుభూమి, డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వటం వంటి వాగ్దానాలు అమలుచేయలేదు. ఉమ్మడి రాష్ట్రం కాలం నుంచి నేటివరకు కార్మికుల కనీసవేతనాలు సవరించలేదు. వ్యవసాయ కార్మికుల ఊసెత్తడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. అన్ని పంటలకు మద్దతు ధర వర్తింపు, గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యాల వంటి దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాడాలి. అలాంటి ప్రయత్నం లేదు. స్థూలంగా ఓట్ల కోసం ఉపయోగపడే సంక్షేమ పథకాలకే ప్రాధాన్యతనిచ్చారు. శాశ్వత పరిష్కారాలవైపు అడుగులు వేయలేదు.

కొన్ని కీలక సందర్భాల్లో కేంద్రం తప్పుడు విధానాలను కాంగ్రెసుతోపాటు టీఆర్ఎస్ కూడా సమర్థించింది. కార్మిక చట్టాల రద్దు, పెద్దనోట్ల రద్దు, ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం, వంటి సందర్భాలలో కేంద్రాన్ని సమర్థించింది. తర్వాత కాలంలో రైతు వ్యతిరేక చట్టాలు, విద్యుత్తు సవరణ బిల్లు లాంటి అంశాల మీద నికరంగా నిలదీస్తున్నది. రాష్ట్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మత విద్వేశాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించిన సందర్భాలలో సమర్థవంతంగా ఎదుర్కొన్నది.

ప్రజాస్వామ్య విలువల విషయంలో మాత్రం ప్రజల ఆశలమీద ప్రభుత్వం నీళ్ళు చల్లింది. అధికారంలోకి రాగానే ప్రతిపక్షాన్ని ఖాళీ చేసే పనిలోపడింది. ప్రతిపక్షంలో రాజకీయ శూన్యత, మరింత ప్రమాదకరమైన మతోన్మాద శక్తులు చొరబడేందుకు తోడ్పడుతుందన్న స్పృహలో లేకుండా ఏకపక్ష ధోరణి ప్రదర్శించింది. ఆమేరకు నష్టం రుచి చూసిన తర్వాత మాత్రమే నాలుక కర్చుకున్నది. శ్రామికుల హక్కులపట్ల అప్రజాస్వామిక ధోరణి హానికరం. రియలెస్టేట్‌కు పెద్దపీట వేయటం, ప్రభుత్వమే భూముల అమ్మకానికి సిద్ధపడటం, అభివృద్ధి పేరుతో పేదల అస్సైన్డ్ భూములు గుంజుకోవటం గమనించదగిన విషయం. పేదలకు ఇక ఇండ్ల స్థలాలు దొరకవన్న ఆందోళన మొదలైంది.

హక్కులకోసం, అధికారాలకోసం, చట్టపరంగా రావల్సిన నిధులకోసం కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిగా నికరంగా పోరాడుతున్నది. కానీ కేంద్రంతో ఒంటరి పోరాటం ఫలితం ఇవ్వదు కదా! కలిసి వచ్చే రాష్ట్ర ప్రభుత్వాలను కలుపుకుని పోరాడాలి. రాష్ట్రంలో కలిసిరావడానికి సిద్ధపడిన పార్టీలతో కలిసి కేంద్రాన్ని నిలదీయాలి. కలిసే ఉన్నామన్న అభిప్రాయం మాత్రం కలిగిస్తున్నారు కానీ కలిసి పోరాటానికి సిద్ధపడటంలేదు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర, అన్ని పంటలను 'మద్దతు ధర' పరిధిలోకి తేవటం, మార్కెట్ సౌకర్యం లాంటి సమస్యల మీద కేంద్రంతో ఐక్య ఉద్యమం అవసరం. ఆర్టీసీ, సింగరేణి పరిరక్షణ, విభజన సమస్యల పరిష్కారం వంటి విషయాలలో కేంద్రంతో పోరాడాలి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు ఎన్ని పరిమితులున్నప్పటికీ, దీనిని విమర్శించే కనీస అర్హత బీజేపీకి లేదు. కాంగ్రెసు నాయకుల విమర్శలు కూడా అవకాశవాదం ఫలితమే. మోడీ ప్రధాని అయ్యేనాటికి 'గుజరాత్ నమూనా' గురించి ఊదరగొట్టారు. ఇప్పుడు గుజరాత్ ఊసెత్తగల స్థితిలో లేరు. వ్యవసాయం, సాగునీరు. తాగునీరు, పేదరికం తగ్గించటం, ఉపాధి కల్పన, సంక్షేమ పథకాలు, తలసరి ఆదాయం, మాతాశిశు మరణాల నియంత్రణ, పరిశ్రమల అభివృద్ధివంటి రంగాలలో, కేంద్రప్రభుత్వ లెక్కల ప్రకారమే తెలంగాణ కన్నా గుజరాత్ చాలా వెనుకబడి ఉన్నది. "గుజరాత్‌లో అద్భుతం చేసి చూపించాం. మమ్మల్ని గెలిపిస్తే దేశమంతా అద్భుతం చేసి చూపిస్తాం." 2014 ఎన్నికలకు ముందు బీజేపీ నేతల ప్రగల్భాలివి. 22 సంవత్సరాల బీజేపీ పాలన తర్వాత గుజరాత్ గురించి చెప్పుకునే స్థితిలో బీజేపీ లేదు. దేశంలో అత్యధిక రాష్ట్రాలలో బీజేపీ పాలన ఉన్నది. ఏ ఒక్క రాష్ట్రంలోనూ తన పాలన ఆదర్శవంతంగా ఉన్నదని చెప్పలేని దైన్యస్థితిలో బీజేపీ ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ, ఇప్పుడున్న కాంగ్రెసు పాలిత రాష్ట్రాలలో గానీ తెలంగాణ కన్నా మెరుగైన పాలన అందించగల స్థితిలో కాంగ్రెసు కూడా లేదు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం రాళ్ళు వేయటం తగదు.

స్థూలంగా ఆర్థిక విధానాల విషయంలో వామపక్షేతర పార్టీలన్నింటి దారి ఒక్కటే! జాతీయ, ప్రాంతీయ పార్టీలన్న తేడా లేదు. ప్రపంచీకరణ విధానాలు అమలుచేయటంలో పోటీపడుతున్నాయి. గత తొమ్మిది సంవత్సరాల పాలనలో కూడా అంతిమంగా తేలింది ఇదే. మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దు చేసింది. నాటి టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) నాయకత్వం కూడా దాన్ని సమర్థించింది. కేంద్రంలో బీజేపీ సర్కారు నూతన విద్యావిధానం పేరుతో విద్యలో మరింత వర్గ విభజనకు పూనుకున్నది. స్థూలంగా రాష్ట్రంలో జరుగుతున్నది కూడా ఇదే. వెయ్యికి పైగా గురుకుల విద్యాసంస్థలు ఏర్పాటు చేయటం ఆహ్వానించదగిందే. మరోవైపు కార్పొరేట్ విద్యాసంస్థలు బలపడుతున్నాయి. ఆర్థికంగా వెసులుబాటు ఉన్నవారు తమ పిల్లలను ప్రైవేటు సంస్థలలో

చదివిస్తున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఫలితంగా ఉన్నత కుటుంబాల పిల్లలు, బడుగు బలహీన వర్గాలలోని చదువులో ముందున్న కొద్దిమంది (క్రీమీలేయర్) మినహా మిగిలిన విద్యార్థులను పట్టించుకునేవారు లేరు. తలసరి ఆదాయం పెరుగుదల ప్రజల ఆదాయాల పెరుగుదలను సూచించదు. బడాబాబుల ఆదాయాలు కలిపి లెక్కిస్తారు. అటవీ విస్తీర్ణం పెరిగింది. కానీ అది ఆదివాసీల హక్కులమీద దాడి చేస్తూ చూపిస్తున్న లెక్కే తప్ప కొత్తగా అభివృద్ధి చేసిన అడవులు కాదు. జీఎస్టీ వృద్ధి రేటులో కూడా తెలంగాణ ముందున్నది. ఇది ప్రజల మీద కేంద్ర, రాష్ట్ర పాలకులు మోపిన అదనపు భారాల ఫలితం. పన్నుల రాబడిలో తెలంగాణ సాధించిన ర్యాంకు కూడా దీనినే సూచిస్తున్నది. కనీస వేతనాలు సవరించకుండా, యూనియన్ల కార్యకలాపాలు నిరోధించి, పెట్టుబడిదారులకు ఇస్తున్న భారీ రాయితీల ఫలితమే పరిశ్రమల అభివృద్ధి ! ఆదాయం, అభివృద్ధి రేటు, తలసరి విద్యుత్తు వినియోగం (ఇది కూడా భారీ, మధ్యతరహా పరిశ్రమలు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు వినియోగించే విద్యుత్తును కలిపి లెక్కిస్తారు) కూడా ఇలాంటివే ! పెట్టుబడిదారుల సంక్షేమ పథకాలు కూడా కేవలం పేదలను ఆదుకోవటం కోసం ప్రభుత్వం పెడుతున్న ఖర్చుగా చూడకూడదు. ప్రభుత్వం చేసే ఖర్చు ఎంతగా పెరిగితే అంతగా మార్కెట్లో డబ్బు తిరుగుతుంది. సరుకుల అమ్మకాలు పెరుగుతాయి. తిరిగి ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుతుంది. ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం కావడానికి తోడ్పడుతుంది. ఇందుకు భిన్నంగా, పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు ఇచ్చే రాయితీలు వారి దగ్గర సంపద పోగు పడటానికే తోడ్పడతాయి. రైతుబంధు వల్ల సంఖ్యరీత్యా పేద, మధ్యతరగతి రైతులు ఎక్కువమంది లబ్ది పొందుతున్నారు. కానీ దీనికి కేటాయించిన నిధులలో గణనీయమైన భాగం ధనికరైతులు, భూస్వాములకు ముట్టజెపుతున్నారు. వీరికి ప్రభుత్వ సహాయం అవసరం లేదు కదా! దశాబ్దాలుగా పేదలు దున్నుకుంటున్న భూములను ధరణి పేరుతో మళ్ళీ పాత భూస్వాములకు కట్టబెట్టారు. సాధారణ రైతులందరికీ చాలాకాలంగా పరిష్కారం కాని చిన్నచిన్న సమస్యలు పరిష్కారమైనప్పటికీ, మౌలికంగా విదేశాలలో స్థిరపడినవారితో సహా ధనిక రైతులు, భూస్వాములు, రియలెస్టేట్ వ్యాపారుల లావాదేవీలను సులభతరం చేసింది. ఇతర రైతులకు కొన్ని ఇతర సమస్యలు కూడా తెచ్చిపెట్టింది. వీటన్నింటిలో బూర్జువా పార్టీలన్నింటి దారి ఒక్కటే. వాటి వర్గ స్వభావం ఫలితమే ఈ విధానాలు.

> **❝ ఏంచేసైనా తెలంగాణలో బలపడాలని బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఇతర పార్టీల నాయకులకు అధికార పార్టీ శాసనసభ్యులకు కూడా ఎరవేయటం, బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారా కలుపుకునే ప్రయత్నాలు చేస్తున్నది. పండుగలను ఉపయోగించుకుని మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నది. వీటికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకత్వం సూటిగా, స్పష్టంగా పదునుగా స్పందించాలి. ఐక్య పోరాటంలో ఊగిసలాటలకు, సందేహా లకు తావులేని వైఖరి ప్రదర్శించవలి. ❞**

ఇప్పుడు దేశంలో ఒక నమూనాగా ప్రజలను ఆకర్షిస్తున్న రాష్ట్రం కేరళ. ఎర్రజెండా పాలనలో ఉన్న కేరళ, సాధారణ ప్రజల జీవితాలతో ముడిబడిన అన్ని కీలకాంశాలలోనూ దేశానికే ఆదర్శప్రాయంగా ఉన్నది. మానవాభివృద్ధి సూచీలలో ముందున్నది. వైద్యరంగంలో, కరోనాను ఎదుర్కొన్న తీరుకు ఐక్యరాజ్యసమితి నుంచి అరుదైన గౌరవాన్ని అందుకున్నది. వలస కార్మికులను అతిథులుగా పరిగణించింది. దేశంలోనే కార్మికులకు అత్యధిక కనీస వేతనాలు అమలు చేస్తున్న రాష్ట్రం కేరళ. భయంకరమైన ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవటంలో, ప్రజలకు అండగా నిలవటంలో తనకు తానే సాటి కదా! ప్రతిపక్షాన్ని సైతం గౌరవిస్తూ, ప్రజాస్వామ్య విలువలకు వన్నె తెస్తున్న రాష్ట్రం. ప్రభుత్వరంగం, సామాజిక న్యాయం, మహిళల భద్రత, లౌకిక విలువలు, సహకార రంగం అభివృద్ధి తదితర విషయాలలో దేశం దృష్టిని ఆకర్షిస్తున్న ఆదర్శపాలన. అందువల్ల తెలంగాణలో పాలన మరొకముందడుగు వేయాలంటే కేరళ పాలనను పరిశీలించాలి. తెలంగాణ ప్రత్యేక పరిస్థితులకు అన్వయించుకోవాలి. కానీ వామపక్షాలకు మాత్రమే సాధ్యమైన విధానాలు అవి.

ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న సమయంలోనే బీఆర్ఎస్ రాజకీయ వైఖరుల గురించి కూడా చర్చ వేడెక్కింది. ఏడాదికాలంగా కేంద్రంమీద, బీజేపీ విధానాల మీద, ఆర్ఎస్ఎస్ మతోన్మాదం మీద బీఆర్ఎస్ యుద్ధం ప్రకటించింది. ప్రజాస్వామ్యవాదులంతా ఈ మార్పును హర్షించారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా వామపక్షాల మద్దతుతో బీజేపీని ఓడించగల్గింది. రానున్న శాసనసభ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్, వామపక్షాలు కలిసే నడుస్తాయని ప్రకటించారు. వామపక్షాలు కూడా సంసిద్ధతను వ్యక్తం చేసాయి. కానీ ఆశ్చర్యకరంగా, ఈమధ్య ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్రమంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు. మరోవైపు బీఆర్ఎస్ క్రమంగా బీజేపీకి దగ్గరవుతున్నదన్న వాదనలు మీడియాలో బలంగా ముందుకొచ్చాయి. మోడీ ప్రభుత్వం బ్లాక్‌మెయిలింగ్ ఫలితమేనని కూడా వచ్చింది. ఇంత కీలకమైన రాజకీయ విషయంలో బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం, చాలా ఆలస్యంగా స్పందించింది.

ఏంచేసైనా తెలంగాణలో బలపడాలని బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఇతర పార్టీల నాయకులకు అధికార పార్టీ శాసనసభ్యులకు కూడా ఎరవేయటం ... లేదా బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారా కలుపుకునే ప్రయత్నాలు చేస్తున్నది. మతపరంగా సున్నితమైన రాష్ట్రం తెలంగాణ. పండుగలను ఉపయోగించుకుని మత విద్వేశాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నది. ప్రార్థనా మందిరాల పేరుతో వివాదాలు సృష్టించి హిందూ ఓటు బ్యాంకు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నది. వీటికి వ్యతిరేకంగా తెలంగాణ గడ్డమీద నుంచి బీఆర్ఎస్ నాయకత్వం సూటిగా, స్పష్టంగా పదునుగా స్పందించాల్సిన సమయం. ఐక్య పోరాటంలో ఊగిసలాటలకు, సందేహాలకు తావులేని వైఖరి ప్రదర్శించవల్సిన సందర్భం.

❀

చరిత్ర

# మౌర్యుల అనంతర కాలంలో సమాజం - సంస్కృతి

## (క్రీ.పూ.200 -క్రీ.శ.300)


రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎం.వి.ఎస్.శర్మ

### కుల వ్యవస్థ - విస్తరణ

క్రీ.పూ.500 నాటికే, అంటే, గౌతమ బుద్ధుని కాలం నాటికే గంగా తీర మైదానాల్లో కుల వ్యవస్థ ఏర్పడివుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలతో బాటు, ఉపకులాలు, తెగలు గా విభజన అమలులోకి వచ్చింది. ముఖ్యంగా తూర్పు ఉత్తర ప్రదేశ్, బీహార్ ప్రాంతాలలో (కోసల, మగధ రాజ్యాలలో) ఈ పరిస్థితి ఉంది. కులాంతర వివాహాలపై నిషేధం ఉండేది. ఈ నిషేధం క్షత్రియ కులాల్లో మరీ ఎక్కువగా ఉండేది. బుద్ధుడి స్వంత తెగ, శాక్యులలో ఈ నిషేధం కారణంగా తక్కిన కులాలవారిని పెండ్లాడలేక, తమ స్వంత అక్కచెల్లెళ్ళనే వివాహం చేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. బౌద్ధం, జైనం కులాలమధ్య తేడాలను పట్టించుకోలేదు. కాని మరణానంతరం ఆత్మ మళ్ళీ వేరే జీవిగా జన్మిస్తుంది అన్న పునర్జన్మ సిద్ధాంతాన్ని ఈ రెండు మతాలూ బలపరిచాయి. బ్రాహ్మణ మతం కూడా ఈ సిద్ధాంతాన్ని బలపరిచింది. అందువలన ఈ జన్మలో తాము కుల కట్టుబాట్లను బాగా పాటిస్తే వచ్చే జన్మలోమరింత పెద్ద కులంలో జన్మించే అవకాశం ఉంటుంది అన్న విశ్వాసం శూద్ర కులాల్లో బలంగా ఉండేది. ఆ విశ్వాసం కారణంగా ప్రస్తుత జన్మలో కుల వివక్షను తక్కువకులాలవారు ఏ ప్రతిఘటనా లేకుండా ఆమోదించారు.

అలెగ్జాండర్ దండయాత్ర కాలానికి (క్రీ.పూ. 327-325) నాటికి సింధు మైదాన ప్రాంతాలలో కులవ్యవస్థ ఉన్నట్టు చరిత్రలో కనిపించదు. పురోహితులను బ్రాహ్మణులు అని పిలిచేవారన్న ప్రస్తావన మాత్రం ఉంది. కాని ఇరవై సంవత్సరాల తర్వాత మెగస్థనీస్ మగధరాజ్యానికి పర్యాటకుడు గా వచ్చినప్పుడు గ్రంథస్తం చేసిన వివరాలలో కులవ్యవస్థ గురించి, కులాంతర వివాహాలపై ఆంక్షల గురించి స్పష్టంగానే పేర్కొన్నాడు. ఐతే అందులో నాలుగు కులాలను గాక, ఏడు కులాలను (వాటిలో అంటరాని కులాలు కూడా ఉన్నాయి) పేర్కొన్నాడు. కులం పుట్టుకతోటే సంక్రమిస్తుందని కూడా పేర్కొన్నాడు. అంటే సింధు ప్రాంతం నుండి కాక, గంగా మైదాన ప్రాంతం నుండే కుల వ్యవస్థ తక్కిన భారత భూభాగానికి విస్తరించిందని మనం చెప్పవచ్చు.

అశోకుడు స్థాపించిన సువిశాల సామ్రాజ్యంలో బ్రాహ్మణ, బౌద్ధ, జైన, అజివిక మతాలు నాలుగింటినీ ఆదరించాడు. ఈ నాలుగు మతాలూ కుల వ్యవస్థను ఆమోదించాయి. కనుక అశోకుడి సామ్రాజ్యం యావత్తూ కుల వ్యవస్థ విస్తరించడానికి అప్పటి పరిస్థితులు దోహదం చేశాయి.

పాలక వంశాలు తాము బ్రాహ్మణ స్త్రీ గర్భాన జన్మించామని చెప్పుకోడానికి ప్రయత్నించేవారు. క్రీ.పూ. 2వ శతాబ్దానికి చెందిన ఒక శిలాశాసనంలో (బర్హుత్ ప్రాంతం) తన తాత గాగి పుత్రుడని, తండ్రి గోతి పుత్రుడని, తాను వచ్చిపుత్రుడనని రాజు ప్రకటించుకున్నాడు. గాగి, గోతి, వచ్చి అనేవి తల్లి వైపునుండి సంక్రమించిన గోత్రాలు. అవి బ్రాహ్మణకులానికి చెందినవి. ఇదేవిధంగా క్రీ.పూ.105 నాటి శాసనంలో శుంగ వంశ రాజు భగభద్రుడు తాను కౌత్సీపుత్రుడనని ప్రకటించుకున్నాడు. శాతవాహన వంశానికి చెందిన రాజులు కూడా గౌతమీపుత్ర, వాసిష్టీ పుత్ర అని (క్రీ.శ. రెండో శతాబ్దం) ప్రకటించుకున్నారు. ఈ రాజ్యం దక్కను ప్రాంతానికి చెందినది. అంటే అప్పటికే కుల వ్యవస్థ ఉత్తరాదినుండి దక్కను ప్రాంతానికి విస్తరించిందన్నమాట. నాలుగు కులాల మధ్యా వర్ణ సంకరం జరగకుండా చూసినందుకు శాతవాహన చక్రవర్తిని ప్రశంసించిన శిలా శాసనం కూడా లభించింది. అదే సమయంలో శాతవాహనులు బౌద్ధ ఆరామాలకు ఉదారంగా విరాళాలు ఇచ్చిన వైనం కూడా శాసనంలో ఉంది. అంటే వివిధ మతాలను ఆదరించడానికి, కుల వ్యవస్థను అమలు చేయడానికి మధ్య వైరుధ్యం ఏమీ లేదన్నమాట.

### కుల వ్యవస్థ-ఆధిపత్యం

కుల వ్యవస్థ విస్తరిస్తున్నకొద్దీ దానిని కొన్ని నియమ నిబంధనల చట్రంలో ఉంచవలసిన అవసరం ఆధిపత్య కులాలకు ఏర్పడింది. క్రీ.శ. రెండో శతాబ్దంలో రాయబడిన అర్థశాస్త్రం, మనుస్మృతి ఈ రెండూ కులవ్యవస్థ గురించి వివరంగా చర్చించాయి. అర్థశాస్త్రంలో పేర్కొన్న విషయాల గురించి మౌర్యసామ్రాజ్యం మీద రాసిన వ్యాసాలలో వివరంగా పేర్కొనడం జరిగింది. ఇప్పుడు ప్రధానంగా మనుస్మృతి గురించి చర్చిద్దాం. ఇక్కడ ఒక విషయం గమనించాలి. మనుస్మృతిలో పేర్కొన్న కుల వ్యవస్థ, కట్టుబాట్లు, అప్పటికే పూర్తిగా అమలులో ఉండేవా లేక అందులో పేర్కొన్న విధంగా కుల వ్యవస్థ ఉండాలని మనుస్మృతి కారుడు కోరుకున్నాడా అన్నది ఇదమిత్థంగా చెప్పడం సాధ్యం కాదు.

సృష్టి ప్రారంభం నుండీ నాలుగు వర్ణాలు ఉనికిలో ఉన్నాయని మనుస్మృతి తనకు తానే ప్రకటించింది. పురోహితులుగా, వేదాలను బోధించేవారుగా బ్రాహ్మణులు, రాజ్యపాలన, యుద్ధాల నిర్వహణ చేసేవారుగా క్షత్రియులు, వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారం చేసేవారుగా వైశ్యులు ఉంటారని నిర్దేశించింది. ఈ మూడు కులాలవారినీ సేవించడమే శూద్రుల బాధ్యత అని చెప్పింది.

పై మూడు కులాలవారినీ ద్విజులు అని (రెండుసార్లు జన్మించినవారు అని అర్థం) వర్గీకరించి మత క్రతువులకు వారిని అర్హులుగా ప్రకటించింది. ఆర్య అన్న సంబోధన ప్రధానంగా ఈ మూడు కులాలవారికే పరిమితం చేసింది.

ఈ వ్యవస్థలో రెండురకాల మార్పులను మనుస్మృతి ఆమోదించింది. ఒకటి: బాగా ధనవంతుడైన వైశ్యుడు బ్రాహ్మణుడుగా గాని క్షత్రియుడుగా గాని పరిగణింపబడవచ్చు. అలాగని ప్రతీ వైశ్యుడూ పైకులాలకు ఎగబాకలేడు. రెండవది: కాయకష్టం ఇమిడివున్న వృత్తులు శూద్రకులాలకు కేటాయించబడ్డాయి. తొలుత వైశ్యుల వృత్తిగా పరిగణించబడిన వ్యవసాయం, ఆ తర్వాత శూద్రుల వృత్తి అయింది. ఇనుపకర్రుతో నేలను దున్నడం అంటే భూమాతను గాయపరచడమే అని, అది పాపకార్యం అని, అందుచేత దానిని శూద్రులకు కేటాయించాలని మనుస్మృతి (3-64) లో పేర్కొన్నారు. చైనా యాత్రికుడు యువాన్‌త్సాంగ్ (క్రీ.శ.7వ శతాబ్దం) భారతదేశంలో వ్యవసాయం పూర్తిగా శూద్రుల వృత్తి అని పేర్కొన్నాడు. సమాజంలో మిగులు సంపదను దోపిడీ చేయడం పెరిగినకొద్దీ కుల వివక్ష తీవ్రం అవడం మనకు కనిపిస్తుంది. కాయకష్టం చేయడం నీచమైనదిగా పరిగణించడం కూడా కనిపిస్తుంది.

శూద్రుడు ప్రధానంగా పైమూడు అగ్ర వర్ణాలకూ సేవ చేయడానికే ఉన్నాడని మనుస్మృతి చెప్పింది. (7-412-14) బ్రాహ్మణుడికి సేవ చేసినందుకు గాను అతడికి మిగిలిపోయిన ఆహారాన్ని, పాత దుస్తులను, ధాన్యాన్ని ప్రతిఫలంగా ఇస్తారు. (10-125) పెద్ద కులాలవారిని శూద్రుడు నిందిస్తే అతడి నాలుకను తెగ్గోయడం, మరిగించిన నూనెను అతడి నోట్లో, చెవుల్లో పోయడం వంటి శిక్షలు ఉంటాయి. (8-270-72) పెద్ద కులానికి చెందిన మహిళతో అక్రమ సంబంధం ఉందని తెలితే ఆ శూద్రుడు తన యావదాస్తినీ కోల్పోతాడు. అంతేగాక అతడిని నపుంసకుడిగా మార్చవచ్చు,లేదా చంపివేయ వచ్చు. (8-374) సేవావృత్తినుండి చేతివృత్తికి మారాలంటే చాలా ప్రత్యేక పరిస్థితుల్లోనే అనుమతి లభిస్తుంది.

బ్రాహ్మణాధిపత్యాన్ని అంగీకరించి తగిన గౌరవాన్ని ప్రదర్శించకపోతే అటువంటి వారి కులాల స్థాయిని తగ్గించిన సందర్భాలున్నాయి. ఆ విధంగా క్షత్రియ

**"శూద్రుడు ప్రధానంగా పైమూడు అగ్ర వర్ణాలకూ సేవ చేయడానికే ఉన్నాడని మనుస్మృతి చెప్పింది. (7-412-14) బ్రాహ్మణుడికి సేవ చేసినందుకు గాను అతడికి మిగిలిపోయిన ఆహారాన్ని, పాత దుస్తులను, ధాన్యాన్ని ప్రతిఫలంగా ఇస్తారు. (10-125) పెద్ద కులాలవారిని శూద్రుడు నిందిస్తే అతడి నాలుకను తెగ్గోయడం, మరిగించిన నూనెను అతడి నోట్లో, చెవుల్లో పోయడం వంటి శిక్షలు ఉంటాయి."**

పట్టిక

| వెలివేయబడిన కులం | వృత్తి |
|---|---|
| 1. సౌరంధ్ర | యజమానికి అర్థబానిస. అతడిసేవలు చేయడం, అలంకరణ, జంతువులను సాకడం |
| 2. మైత్రేయిక | గంటలు కొట్టడం, యజమానిని బిగ్గరగా పొగడడం |
| 3. మార్గవ; దాస, కైవర్త | పడవ నడపడం |
| 4. కారావర | చర్మపు పని |
| 5. పాండుశోపాక | వెదురుతో బుట్టలు అల్లడం |
| 6. శోపాక | చండాలుల వృత్తి |
| 7. అంత్యవాసులు | శ్మశానంలో పని |
| 8. సూత | గుర్రాలను, రథాలను కాయడం |
| 9. అంబష్ఠ | జబ్బులను నయం చేయడం |
| 10. వైదేహక | స్త్రీలకు సేవలు చేయడం |
| 11. మాగధ | వ్యాపారం |
| 12. నిషాదులు | చేపలవేట |
| 13. ఆయోగవ | వడ్రంగం |
| 14. మేద, ఆంధ్ర, చుంకు, మద్గు | అటవీమృగాలను వధించడం |
| 15. క్షత్రి, ఉగ్ర, పక్కాశ | బొరియల్లోని జంతువులను పట్టి చంపడం |
| 16. ధిగ్వన | చర్మపు వృత్తి |
| 17. వేనులు | వాయిద్యకారులు |
| 18. చండాల, శ్వపచ | అనాథశవాలను మోసుకుపోవడం, నేరస్తులను శిరచ్ఛేదం చేయడం (వీరి ప్రధాన వ్యాపకం గురించి పేర్కొనలేదు) |

కులం హోదాను పోగొట్టుకుని శూద్రులుగా పరిగణించబడినవారు చోళులు, యవనులు, (గ్రీకులు) శకులు, పహ్లవులు, (పార్థియన్లు) . వీరంతా తమ తమ ప్రాంతాలలో పాలక వంశాలుగా ఉన్న సంగతి మనకు తెలుసు.

ఇలా కులాలను మార్చడం అన్నది వేరే ఏ ఇతర కారణం రీత్యా అనుమతించబడదు. వర్ణసంకరం అన్నది అత్యంత పాపకార్యంగా పరిగణించబడింది. భగవద్గీత లో వర్ణసంకరం అనేది అధర్మం అని, అత్యంత వినాశకరం అని చెప్పారు. మనుస్మృతిలో కులాంతర వివాహాలను అనులోమ, ప్రతిలోమ వివాహాలుగా రెండు రకాలుగా వర్గీకరించారు. ఎక్కువ కులపు పురుషుడు తక్కువ కులపు స్త్రీ ని పెళ్ళాడితే అది అనులోమ వివాహం. ఎక్కువ కులపు స్త్రీ ని తక్కువ కులపు పురుషుడు పెళ్ళాడితే అది ప్రతిలోమ వివాహం. మనుస్మృతి ప్రతిలోమ వివాహాన్ని ఎక్కువ దోషంగా పరిగణించింది. బ్రాహ్మణుడు తన కులపు స్త్రీని వివాహం చేసుకున్న తర్వాత క్షత్రియ స్త్రీని, వైశ్యస్త్రీని, శూద్రస్త్రీని ఆ క్రమంలో వివాహం చేసుకోవచ్చునని మనుస్మృతి (3-12,13) చెప్పింది. క్షత్రియుడు తన కులపు స్త్రీ ని

**“ మనుస్మృతిలో 10వ అధ్యాయంలో 32 నుండి 56 సూత్రాలలో వివిధ వెలివేయబడ్డ కులాల గురించి, వారు చేయ వలసిన పనులగురించి పేర్కొన్నారు. చండాలురు, శ్వపచులు వెలివేయబడ్డ కులాలలో అధికసంఖ్యాకులు. వీళ్ళు గ్రామాలకు వెలపలనే నివాసం ఉండాలి. తమ కులాన్ని సూచించే గుర్తు ధరించాలి. రాత్రుళ్ళు గ్రామాల్లోకి ప్రవేశించరాదు. పగిలిపోయిన కుండలలోనే భుజించాలి. కేవలం ఇనుప ఆభరణాలనే ధరించాలి. చండాలురు పట్ల అంటరానితనం ప్రత్యేకంగా పాటించాలి. ”**


వివాహం చేసుకున్నాక వైశ్య,శూద్ర కులాల స్త్రీలను పెళ్ళాడవచ్చునని, వైశ్యుడు తన కులపు స్త్రీని పెళ్ళాడిన తర్వాత శూద్ర స్త్రీని పెళ్ళి చేసుకోవచ్చునని చెప్పింది. శూద్రుడు మాత్రం తన కులపు స్త్రీని మాత్రమే పెళ్ళాడాలని నిర్దేశించింది. అంటే కట్టుబాటు శూద్రులకే అన్నమాట.

కట్టుబాట్లను అతిక్రమించి పెళ్ళిళ్ళు చేసుకున్న తర్వాత వారికి జన్మించిన సంతానాన్ని వెలివేయబడిన కులాలుగా పరిగణించారు. (10-7 నుండి 39) ఆ విధంగా వెలివేయబడిన కులాలకు చాలా కఠోరమైన నిబంధనలు విధించారు. వారు చాలా అనారోగ్యకరమైన వృత్తులను చేయాలి. (చచ్చిన జంతువుల కళేబరాలనుండి చర్మాలను తీసి శుభ్రం చేయడం వంటివి) వారు శ్మశానాల దగ్గర, చెట్ల కింద, తోపుల్లో, లేదా కొండల్లోబతకాలి. గ్రామంలోకి పగలు వచ్చి పాయిఖానాలను శుభ్రం చేయడం, చెత్త ఎత్తి దూరంగా పారబోయడం వంటి పనులు చేయాలి.

మనుస్మృతిలో 10వ అధ్యాయంలో 32 నుండి 56 సూత్రాలలో వివిధ వెలివేయబడ్డ కులాల గురించి, వారు చేయవలసిన పనులగురించి పేర్కొన్నారు.

చండాలురు, శ్వపచులు వెలివేయబడ్డ కులాలలో అధికసంఖ్యాకులు. వీళ్ళు గ్రామాలకు వెలపలనే నివాసం ఉండాలి. తమ కులాన్ని సూచించే గుర్తు ధరించాలి. రాత్రుళ్ళు గ్రామాల్లోకి ప్రవేశించరాదు. పగిలిపోయిన కుండలలోనే భుజించాలి. కేవలం ఇనుప ఆభరణాలనే ధరించాలి. చండాలురు పట్ల అంటరానితనం ప్రత్యేకంగా పాటించాలి. (పట్టిక 5-85)

భారత ఉప ఖండం వెలుపలనుంచి వచ్చిన విదేశీయుల్ని “మ్లేచ్ఛులు” అని, “అనాగరికులు” అని మనుస్మృతి వర్ణించింది. (2.23, 10.45) ఆ కారణంగా వాళ్ళు కుల




(మ్యాప్1.1)

వ్యవస్థకు వెలుపల ఉన్నట్టు పరిగణించింది. యవనులు, శకులు, పహ్లావులు వంటి కొందరు విదేశీయుల్ని క్షత్రియ కులం స్థాయి నుండి శూద్రుల స్థాయికి తగ్గించింది. అంతే కాని వారినెవరినీ అంటరానివారిగా పరిగణించలేదు.

సంఘపరివార్ కుల వ్యవస్థను సమర్ధిస్తూ అంటరానితనం మన దేశానికి వెలుపలినుంచి వచ్చిందంటూ అవాస్తవాలను ప్రచారం చేస్తారు. కాని మనుస్మృతి ఆ విధంగా ఎక్కడా చెప్పలేదు.

**మనుస్మృతి - మహిళలు**

“బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో ఆ భర్త మరణానంతరం కొడుకులు స్త్రీ ని సంరక్షించాలి. స్త్రీ కి స్వాతంత్ర్యం ఎప్పుడూ ఉండరాదు” అని మనుస్మృతి (5-147,148) నిర్దేశించింది. “దైవికంగానే స్త్రీ అపవిత్రమైన కోర్కెలతో, కపటంతో, అసూయతో, విద్వేషంతో, తప్పుడు ప్రవర్తన కలిగివుంటుంది.” అని 10.17 లో ఉంది. ఆ కారణంగానే స్త్రీకి స్వంత ఆస్తి కలిగివుండే హక్కు లేదు.(7.416) ఐతే వివాహం సందర్భంగా గాని కుటుంబ సభ్యులనుండి గాని కానుకలు పొందవచ్చు. (3.52) పురుషుడు ఎందరు భార్యలనైనా కలిగివుండవచ్చు కాని స్త్రీ కి విడాకులు కోరే హక్కు గాని, భర్త మరణానంతరం పునర్వివాహం చేసుకునే హక్కు కాని లేవు. (9-45,46, 5-161 నుంచి 164) ఇంటిలోనే వుంటూ భర్తను అన్ని విధాలా, అన్నివేళలా సంతృప్తి పరుస్తూ, అంట్లు తోముకుంటూ, ఇంటిని శుభ్రంగా ఉంచుతూ, భర్తకు వండిపెడుతూ ఉండడమే స్త్రీకి గౌరవం. (5-151, 9-2) సిద్ధార్ధుడు యువరాజుగా ఉన్నప్పుడు రహదారి వెంబడి పోతూవుంటే అతడిని కిటికీ చాటు నుండి చూడడానికి కూడా భర్త అనుమతి కోరిన మహిళల ప్రస్తావన అశ్వఘోషుడి బుద్ధ చరిత్ర గ్రంధంలో ఉంది.

మరోపక్క పురుషుల వాంఛలను తీర్చడానికి కొందరు మహిళలు వేశ్యావృత్తిని చేపట్టడానికి మనుస్మృతి అనుమతించింది. (4-209, 219) ఆడ బానిసలను వేశ్యావృత్తిలోకి బలవంతంగా దింపడాన్ని కూడా ఆమోదించింది.

గృహ నిర్బంధాన్ని, ఇంటి చాకిరీని తిరస్కరించి బౌద్ధ సంఘాలలోనో, జైన సంఘాలలోనో చేరిన మహిళలు కూడా ఉన్నారు. బౌద్ధ, జైన మతాలు వారిని ఆదరించాయి. మనుస్మృతి మాత్రం వారిని వెలివేసింది. వారిని నైతికంగా పతనం అయినవారిగా పరిగణించింది. (5-89,90)

**బానిసలు**

బానిసవిధానం అమలులో ఉన్నట్టు స్పష్టంగా మనుస్మృతి బట్టి చెప్పవచ్చు. బానిసకు జన్మించినవారు బానిసల అవుతారని, యుద్ధంలో ఖైదీలుగా పట్టుబడినవారిని బానిసలుగా పరిగణించవచ్చునని, బానిసలను కానుకలుగా ఇవ్వడం కాని స్వీకరించడం కాని చేయవచ్చునని, తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉన్నవాడు బానిసగా ఇతరులకు అమ్ముడుపోవచ్చునని మనుస్మృతి పేర్కొంది. (8-45, 4-253, 9-178)ఇంటి చాకిరీ నిమిత్తం గాని, పొలాల్లో వ్యవసాయ పనులకు గాని, చేతివృత్తిదారుల వద్ద పనిలో సహాయపడడానికి గాని బానిసలను ఎక్కువగా ఉపయోగించేవారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు జాతక కథలలో, అర్ధశాస్త్రం లో,

(మిగతా 34వ పేజీలో)

ఇంటర్వ్యూ

# భారత స్వాతంత్ర్యం కోసం సావర్కర్ చేసిందేమీ లేదు

**ప్రొ॥ వినయ్ లాల్**

**(హిందూత్వ ఐకాన్ అయిన వి.డి.సావర్కర్ మహాత్మా గాంధీ సలహా మేరకే బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష కోరుతూ లేఖలు రాశారని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజనాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను లాస్ఏంజెల్స్ లోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో చరిత్ర మరియు ఆసియన్ అమెరికన్ స్టడీస్ ప్రొఫెసర్ అయిన డా॥ వినయ్ లాల్ తిరస్కరించారు. వినయ్‌లాల్ చరిత్ర మూలాలకు సంబంధించిన కీలకమైన రచనలు చేశారు. ద హిస్టరీ ఆఫ్ హిస్టరీ (2003), ఇంట్రడ్యూసింగ్ హిస్టరీ (2005), ది అదర్ ఇండియన్స్ : ఎ పొలిటికల్ అండ్ కల్చరల్ హిస్టరీ ఆఫ్ సౌత్ ఏషియన్స్ ఇన్ అమెరికా (2008) వంటి ముఖ్యమైన రచనలు ఉన్నాయి. ఫ్రంట్‌లైన్ కోసం కేరళకు చెందిన జర్నలిస్ట్ అభిషేక్.కె.బోస్‌కు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అసంబద్ధ వ్యాఖ్యలను ఖండించారు. ఆ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలను పాఠకులకు అందిస్తున్నాం- సంపాదకుడు.)**



రచయిత లాస్ఏంజెల్స్ లోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో చరిత్ర, ఆసియన్ అమెరికన్ స్టడీస్ ప్రొఫెసర్

అభిషేక్ కె బోస్: **హిందూత్వ ఐకాన్ అయిన వి.డి.సావర్కర్ మహాత్మాగాంధీ సలహా మీదనే బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష కోరుతూ ఉత్తరం వ్రాశారని రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు? మీ అభిప్రాయం ఏమిటి? స్వాతంత్ర పోరాటంలో విడి సావర్కర్, ఇతర హిందూత్వవాద నాయకులు ఎటువంటి పాత్ర పోషించారని మీరు భావిస్తున్నారు?**

**వినయ్‌లాల్:** రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడి నది తప్పని నేను ఖచ్చితంగా, నిస్సందేహంగా చెబుతున్నాను. సావర్కర్‌ను క్షమాభిక్ష కోరుతూ లేఖ వ్రాయమని మహాత్మాగాంధీ చెప్పినట్లుగా చిన్న ఆధారం కూడా లేదు. ఈ వాదన పూర్తిగా కల్పితమే. రక్షణ మంత్రి ఈ వాదనకు తెరలేపకమునుపే సావర్కర్ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్రాసిన అనేక లేఖలపై, క్షమాభిక్ష వినతులపై గణనీయమైన పరిశోధన జరిగింది. ఉదాహరణకు ఎ.జి.నూరాని వ్రాసిన సావర్కర్ అండ్ హిందూత్వ : ది గాడ్సే కనెక్షన్ (లెఫ్ట్ వర్డ్ బుక్స్, 2002) అనే పుస్తకం ప్రచురితమైంది. ఆ పుస్తకంలోని అను బంధాలను గనుక పరిశీలిస్తే ఆ లేఖలలోని కొన్ని అంశాలను ఎలా మార్చారో అర్ధమవు తుంది. సావర్కర్ 1911లో దాఖలు చేసిన లేఖలోని అంశాలు అందుబాటులో లేవు. కానీ 1913లోను, ఆ తరువాత పంపిన లేఖలు చదువుతున్నప్పుడు ఆవేదన కలుగుతుంది. ఆ లేఖలలో సావర్కర్ "బ్రిటిష్ ప్రభుత్వ బహుముఖ ప్రయోజనం కోసం నన్ను విడుదల చేసినట్లయితే నేను బ్రిటిష్ రాజ్య అభివృద్ధికి బలమైన చేదోడుగా, విశ్వసనీయుడుగా ఉంటాను". తనను విడుదల చేయడం బ్రిటీషు ప్రభుత్వానికే ప్రయోజనమని సూచనచేస్తూ "బ్రిటీష్ ప్రభుత్వానికి అనుగుణంగా నా పరివర్తన ఉంటుంది. తప్పుదారి పట్టి నన్ను అనుసరించే ఎంతోమంది దేశ యువతను తిరిగి బ్రిటీషు విధేయులుగా మార్చడానికి ఉపకరిస్తుంది. ప్రభుత్వం ఎలా కోరుకుంటే అలా సేవ చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని సావర్కర్ ఆ లేఖలలో రాశాడు. సావర్కర్ తన లేఖ ముగింపులో ఇంకా దయనీయమైన పదాలు ఉపయోగించారు. "బలాఢ్యులు మాత్రమే దయ కలిగి ఉంటారు. తప్పిపోయిన పిల్లలు తిరిగి తల్లిదండ్రుల వంటి ప్రభుత్వం వద్దకు కాక ఇంకెక్కడికి వెళ్ళగలరు?" బ్రిటిష్ ప్రభుత్వం ఏది చెప్తే అది చేయడానికి సిద్ధంగా ఉన్నాను, నన్ను జైలు నుండి విడుదల చేయండి అని సావర్కర్ చెప్పడమే దీని సారాంశం. "తల్లి – తండ్రి" వంటి బ్రిటిష్ ప్రభుత్వం తన బిడ్డను గుండెలపైకి చేర్చుకోవాలని సావర్కర్ అడుగుతున్నాడు. గాంధీజీ ఎన్నో సార్లు జైలుకు వెళ్ళారు. ఆయన ఎప్పుడైనా తనను విడుదల చేయమని గాని, క్షమాభిక్ష కోరుతూ గాని విజ్ఞాపన చేశారా? నిజానికి 1922లో దేశద్రోహ నేరంపై భారత శిక్షాస్మృతి సెక్షన్ 124 క్రింద విచారణ జరుగుతున్న సమయంలో న్యాయమూర్తి గనుక తాను నేరం చేసినట్లు విశ్వసిస్తే చట్ట ప్రకారం ఎంత కఠినమైన శిక్ష వేయగలిగితే అంత వేయమని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి చుక్కలు చూపించారు.

కానీ గాంధీజీని ఇష్టపడని భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌వంటి వారిని తీసుకుందాం. వారు ఉరిశిక్ష పడ్డాక కూడా క్షమాభిక్ష కోరలేదు సరికదా, భగత్‌సింగ్ తండ్రి "నువ్వు చిన్న వాడివి. నీకు ఎంతో భవిష్యత్తు ఉంది. బ్రిటీషు అధికారులను క్షమించమని కోరుతూ ఉత్తరం వ్రాయమంటే అటువంటి సలహా ఇచ్చినందుకు ఆయన తన తండ్రిపై మండిపడ్డారు. కానీ సావర్కర్ అందుకు పూర్తి భిన్నంగా జైలుశిక్ష అనుభవించినందుకే పదేపదే క్షమాభిక్ష అర్జీలు వ్రాస్తూనే ఉన్నాడు.

క్షమాభిక్ష ఉత్తరం వ్రాస్తే వారు క్షమిస్తారని గాంధీజీ సావర్కర్‌కు సలహా ఇచ్చారన్న వాదనను తీసుకుందాం.

1920 జనవరి 18 వ తేదీన సావర్కర్ సోదరుడు తన అన్నతోపాటు ఉన్న సహ ఖైదీలకు బ్రిటీషు అధికారులు క్షమాభిక్ష పెట్టారని, కానీ ఆయనను మాత్రం విడుదల చేయలేదని, ఈ విషయంగా మీరేమైనా సాయం చేయగలరా? అని గాంధీజీని అడుగుతూ ఉత్తరం వ్రాశాడు. లాహెూర్ జైలులో ఉన్న గాంధీజీ జనవరి 25న (ఈ అంశం భారత

> దేశ విభజనను ముందుగా ప్రతిపాదించింది జిన్నా కాదు. సావర్కర్. జిన్నాకు సావర్కర్‌కు ఉన్న సారూప్యత ఎప్పుడూ బయటపడలేదు. కానీ దేశ విభజన వ్యూహకర్త జిన్నా కాదు, సావర్కరేనని అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నారు. అంబేద్కర్ తన థాట్స్ ఆఫ్ పాకిస్తాన్ (1940) పుస్తకంలో "జిన్నా, సావర్కర్ ఒక దేశం, రెండు జాతుల అంశంపై వాదించుకున్నట్లు పైకి కనబడినా దేశవిభజనకు అంగీకరించారు." అని వ్రాశారు.

ప్రభుత్వం ప్రచురించిన కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మా గాంధీలోని 19వ వాల్యూమ్‌లో ఉన్నది). నీ ఉత్తరం అందింది. నీకు సలహా ఇవ్వడం చాలా కష్టం" అని సమాధానం వ్రాశారు.

మన గౌరవ రక్షణ శాఖమంత్రి గారికి గాంధీజీ సావర్కర్‌కు క్షమాభిక్ష రాయమన్నారన్న విషయం ఎలాతోచింది? ఆ ఉత్తరంలో ఏమైనా పేర్కొన్నారా? లేదు. ఇంకా ఆ ఉత్తరంలో "మీ సోదరుడు పాల్పడిన నేరం పూర్తిగా రాజకీయ సంబంధమైనదని పేర్కొంటూ నేర తీవ్రతను తగ్గించేలా సంక్షిప్తంగా ఒక పిటిషన్ వ్రాయండి. ప్రజల దృష్టిని కేంద్రీకరించేందుకు ఉపయోగపడుతుందని ఈ సలహా ఇస్తున్నాను."

సావర్కర్ చేసింది సాధారణ నేరం కాదు, రాజకీయపరమైనది అని గాంధీజీ ఉద్దేశ్యం. గాంధీ, సావర్కర్‌ల మధ్య రాజకీయ వైరుధ్యాలున్నప్పటికీ రాజకీయ ఖైదీలకు, సాధారణ నేరాలు చేసి జైలు శిక్ష అనుభవిస్తున్నవారికి వ్యత్యాసం ఉందని గాంధీ అర్థం చేసుకున్నారన్నది ముఖ్యం. గాంధీజీ సావర్కర్‌ను రాజకీయ ఖైదీగా పరిగణించారు.

1920లో గాంధీజీ యంగ్ ఇండియా జర్నల్‌లో ఒక ఆర్టికల్ వ్రాశారు. కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మా గాంధీలోని వాల్యూమ్ 20లో కూడా 'సావర్కర్ సోదరులు' అన్న శీర్షికన ఈ ప్రస్తావన ఉంది. సావర్కర్ సోదరులు ఇతర రాజకీయ ఖైదీలలాగే క్షమాభిక్షకు అర్హులని గాంధీజీ స్పష్టత కలిగి ఉన్నారని ఆ వ్యాసంలో విశ్లేషించారు.

కానీ గాంధీ ఆ సోదరుల గురించి తాను ఏ అభిప్రాయం కలిగిఉన్నారనేది ఈ వ్యాసంలో స్పష్టంగా వ్రాశారు. "ఆ ఇద్దరు సోదరులు తమను విడుదల చేసినందుకు ప్రతిగా ఇక ఏ విధమైన విప్లవ ఆలోచనలను చేయబోమని తమ రాజకీయ విధానాన్ని స్పష్టం చేశారు. బ్రిటిషు సంస్కరణల చట్టం భారతదేశానికి రాజకీయ హక్కులను సాధించడానికి, దాని పరిధిలో పని చేయడానికి వీలు కల్పిస్తాయని భావించి, దానికి లోబడి ఉండేందుకు అంగీకరించారు. బ్రిటిషు పాలన నుండి దేశానికి స్వాతంత్య్రాన్ని కోరమని, బ్రిటిషు పాలనకు అనుబంధంగా ఉంటేనే భారతదేశ భవిష్యత్తు బాగుంటుందని వారిరువురూ నిస్సందేహంగా పేర్కొన్నారు.

సావర్కర్ జైలు నుండి విడుదల కావడం కోసం దేశస్వాతంత్య్రాన్ని కూడా లక్ష్యపెట్టలేదని ఇంతకన్నా స్పష్టంగా ఇంకెక్కడ దొరుకుతుంది? ఒకవేళ అతను స్వాతంత్య్రం కోసం ఏమైనా చేసిఉన్నా అది చాలా స్వల్పం. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) గాని, హిందూ మహాసభగాని స్వాతంత్ర్య పోరాట సమయంలో దేశ స్వాతంత్య్రం కోసం ఏమీ చేయలేదని నిస్సందేహంగా చెప్పగలను. వారు బ్రిటిషు వారితో కుమ్మక్కయ్యారు.

ఇండియా, పాకిస్థాన్ విభజనకు మహమ్మద్ ఆలీ జిన్నా బాధ్యుడనే భారతీయుల ధోరణి గురించి డా॥ బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన విషయాలు గుర్తు చేయాలనుకుంటున్నాను. దేశ విభజనను ముందుగా ప్రతిపాదించింది జిన్నా కాదు. సావర్కర్. జిన్నాకు సావర్కర్‌కు ఉన్న సారూప్యత ఎప్పుడూ బయటపడలేదు. కానీ దేశ విభజన వ్యూహకర్త జిన్నా కాదు, సావర్కరేనని అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నారు. అంబేద్కర్ తన థాట్స్ ఆఫ్ పాకిస్తాన్ (1940) పుస్తకంలో "జిన్నా, సావర్కర్ ఒక దేశం, రెండు జాతుల అంశంపై వాదించుకున్నట్లు పైకి కనబడినా దేశవిభజనకు అంగీకరించారు. వారి అభిప్రాయం ప్రకారం ఇండియాలో రెండు జాతులు ఉన్నాయి, అవి ఒకటి ముస్లిం జాతి, ఇంకొకటి హిందూ జాతి అని పూర్తిగా విశ్వసించారు. విశ్వసించమేకాదు. దాని కోసం పట్టుబట్టారు" అని వ్రాశారు.

### గాంధీ, సాంస్కృతిక రాజధాని

అభిషేక్.కె.బోస్: **ఆర్ఎస్ఎస్ మరియు దాని అనుబంధ సంస్థలు గాంధీజీ వారసత్వాన్ని చేజిక్కించుకోవడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు? సంఘ్‌పరివార్‌లో అంతటి స్థాయి ఉన్న వ్యక్తి లేరనా? దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?**

వినయ్‌లాల్: మీ ప్రశ్నలోనే సమాధానం ఉంది. స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించి వ్యక్తిగా గాని, సంస్థగా గాని ఏమైనా చేశామని చెప్పాలంటే వారు ఖచ్చితంగా గాంధీజీ వారసులమని చెప్పుకోవడం అత్యవసరం. ఇతర వ్యక్తులకు ఉన్న పరిమితులు గాంధీజీకి కూడా ఉన్నాయి. సాంస్కృతిక మూలాల అంశంపై ఫ్రెంచి సిద్ధాంతవేత్త పియెర్ బోర్ద్యూ చేసిన ప్రతిపాదనలు పరిశీలిస్తే గాంధీ అంటే ఏమిటో మనకు అర్థమవుతుంది. గాంధీ పేరు ప్రపంచవ్యాప్తంగా ఒక సాంస్కృతిక మూలాలతో ముడిపడి ఉంది. 1950, 1960లలో అమెరికాకు వలస వచ్చిన భారతీయులతో నేను మాట్లాడాను. (1924 వలసల చట్టం మరియు ఆసియన్ బహిష్కరణ చట్టం ప్రకారం 1923 - 45 మధ్య భారతీయులు యు.ఎస్.కు రావడానికి అనుమతి లేదు.). వారికి అమెరికాలో తెలిసినవారు ఎవరూ లేరు. కానీ మేము గాంధీగారి దేశం నుండి వచ్చాము అని వారు చెప్పగానే అక్కడి వారు వారిని హృదయ పూర్వకంగా ఆహ్వానించారు. పౌరహక్కుల కోసం జరిగిన పోరాటానికి ముందే గాంధీ యు.ఎస్.లో సుపరిచితుడు.

గాంధీజీ మరణించినపుడు ఆయనను నెహ్రూతోను, జిన్నాతోను ఎవరూ పోల్చలేదు. జీసస్ క్రైస్ట్, బుద్ధుడు వంటి మానవతా మూర్తులతో పోల్చారు. గాంధీజీ ప్రపంచంలో ఎప్పటికీ ఒక చారిత్రాత్మక వ్యక్తిగానే నిలిచిపోతారు. దీన్నే బోర్ద్యూ సాంస్కృతిక మూలాలుగా చెబుతారు. ఆర్ఎస్ఎస్, బిజెపి గాంధీ పేరును వాడుకుని తమ హిందూ జాతీయవాద భావనకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇది అభ్యంతరకరమే కాదు పూర్తిగా తిరస్కరించాల్సిన అంశం. దీన్ని మనం వ్యతిరేకించకపోతే ఇంకో అబద్ధాన్ని ప్రచారంలోకి తీసుకువస్తారు.

### హిందూత్వ చరిత్ర విశ్లేషణ

అభిషేక్.కె.బోస్: **దేశవ్యాప్తంగా పలు కాలేజీలలో ఆర్ఎస్ఎస్, ఆ సంస్థ నాయకుల చరిత్రను బోధించాలని వివాదాలు జరుగుతున్నాయి. కేరళలోని కన్నూరు యూనివర్సిటీ కర్కులమ్‌లో సావర్కర్, ఎం.ఎస్.గోల్వాల్కర్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ**

**వంటి ఆర్ఎస్ఎస్ నాయకుల రచనలు చేర్చారు? హిందూత్వవాదుల సిద్ధాంతాలు బోధించాల్సిన అవసరం ఉందని మీరు భావిస్తున్నారా?**

**వినయ్‌లాల్:** ఈ అంశాన్ని మనం చాలా సూక్ష్మంగా పరిశీలన చేయాల్సిన అవసర ముంది. పారిశ్రామిక విప్లవకాలం నుండి నేటివరకు ఉన్న సమకాలీన ప్రపంచ చరిత్రను నేను 18–21 ఏళ్ళ విద్యార్థులకు బోధిస్తాను. 1930, 1940 సంవత్సరాల నాటి కాలం నాజీ జర్మనీ, హిట్లర్‌ల నాటి కాలం. హిట్లర్ మీన్‌కాంఫ్ అనే ఒక గ్రంధాన్ని వ్రాశాడు. అది సాధారణమైనది. దాన్ని చదివిన మేధావులు ఎవరూ హిట్లర్ ఆలోచనలవల్ల ప్రభావితు లవ్వరు. అంతమాత్రాన దేశాన్ని దోచుకున్న వ్యక్తి ఎటువంటి రాజకీయ మేధస్సు కలిగి లేడని చెప్పలేము. నేను నా విద్యార్థులను మీన్ కాంఫ్‌లో 10 పేజీలు చదవమని చెబుతాను. హిట్లర్ గురించి చదవమంటే నేను యూదుమతానికి వ్యతిరేకంగా ప్రచారం చేసినట్లా? ఎంతమాత్రమూ కాదు. పెడధోరణులు ప్రమాదకరమైనప్పటికీ వాటిని అర్థం చేసుకోవడం సంక్లిష్ట బోధనా విధానంలో భాగం. మానవత్వాన్ని ప్రతిబింబించే చరిత్రను మాత్రమే అధ్యయనం చేస్తే మనం ఆలోచనాత్మకంగా, మానవతావాదులుగా మారము. సమాజంలో కొన్ని హానికరమైన వ్యాఖ్యలు ఎలాంటి పాత్ర పోషించాయో కూడా అధ్యయనం చేయాలి. తెలుసుకోవాలి. సావర్కర్, గోల్వాల్కర్‌లు తత్వవేత్తలుగా అతిసాధారణమైనవారు అయినప్పటికీ సావర్కర్ కొన్ని అంశాలలో ప్రశంసించ దగినవాడు. ఇది మనం ఒప్పుకోవాలి. ఉదాహరణకు అతను మరాఠీలో గొప్ప కవి. తన 10వ ఏట నుండే రచనలు చేశాడు. అందులోను 1857 –58 నాటి విప్లవంపై విమర్శనాత్మక పుస్తకం వ్రాశాడు. అది చాలా ఆసక్తికరమైన పుస్తకం. అంతేకాదు, హిందూత్వ భావనకు జన్మనిచ్చింది సావర్కర్ కాదు. బెంగాలీ నుండి క్రైస్తవుడిగా మారిన బ్రహ్మబంధ ఉపాధ్యాయ్ అనే వేద పండితుడు. ఆయనే హిందూత్వపై మొదటగా రచనలు చేశాడు. అది వేరే కథ. సావర్కర్ చెప్పే పుణ్యభూమి వాదన గురించి అర్థం చేసుకోవాలంటే ఆ పుస్తకంలో కొంత భాగం చదవాలి. ఇతరులకు తప్పు అనిపించే వాదనలు కూడా మనం అధ్యయనం చేయకపోతే విద్యార్థులకు సరైన బోధన చేయలేము. గోల్వాల్కర్, సావర్కర్‌లను గొప్ప తత్వవేత్తలుగా భావించకపోయినప్పటికీ

> **❝ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పేరు ప్రచారం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం చాలా కృషి చేస్తున్నది. 2015 నుండి 2017 వరకు సంవత్సరానికి ఒక స్టాంపు విడుదల చేసింది. దీనదయాళ్ చెప్పిన సమగ్ర మానవతావాదంలో ఉన్న ప్రధానమైన అంశం జయప్రకాష్ నారాయణ్ చెప్పిందే. అయితే పచ్చి హిందూత్వ పక్షపాతంతో కలుషితమైపోయిన ఆలోచనలు దీనదయాళ్‌లో స్పష్టంగా కనబడుతాయి. ❞**

హిందూత్వ భావజాలం ఎటువంటి హానికరమైన పరిణామాలకు దారి తీస్తుందో విద్యార్థుల ఊహకు అందాలంటే వారి రచనల్లోని కొన్ని అంశాలను బోధించాల్సి ఉంటుంది. గోల్వాల్కర్ విషయంలో ఇది మరింత స్పష్టం. అతను రాసిన బంచ్ ఆఫ్ థాట్స్ గాని, ఉయ్ అండ్ అర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్ గాని చూస్తే అతను నాజీ సిద్ధాంతానికి చాలా రుణపడ్డాడు అని అర్థమవుతుంది. నాజీలను ఆరాధించే గోల్వాల్కర్ నాజీలాగానే మాట్లాడుతాడు. జర్మనీలో నాజీలు యూదు మతస్థులను హింసించిన విధానాన్ని భారతదేశం కూడా ఆదర్శంగా తీసుకోవాలని చెబుతాడు. జర్మనీలో యూదులు ఎలాంటి కష్టాలను అనుభవించారో మన దేశంలోని కొంత మంది ప్రజలు కూడా అటువంటి కష్టాలు అనుభవించాలని చెప్పింది ఎవరో నేను ప్రత్యేకించి వివరించనక్కరలేదు. ఇది గుర్తుంచుకోవాల్సిన ప్రధాన అంశం. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పేరు ప్రచారం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం చాలా కృషి చేస్తున్నది. 2015కు ముందు అతని గౌరవార్థం ఒక స్టాంపు కూడా ముద్రించింది. 2015 నుండి 2017 వరకు సంవత్సరానికి ఒక స్టాంపు విడుదల చేసింది. దీనదయాళ్ చెప్పిన సమగ్ర మానవతావాదంలో ఉన్న ప్రధానమైన అంశం ఏమిటి? జయప్రకాష్ నారాయణ్ చెప్పే వాదన కూడా ఇదే. జె.పి. కొంత మెరుగుగా ఆలోచించగలిగినవాడే అయినా అతనివి దీనదయాళ్ విధానాలకు భిన్నమైనవేమీ కాదు. అయితే పచ్చి హిందూత్వ పక్షపాతంతో కలుషితమైపోయిన ఆలోచనలు దీనదయాళ్‌లో స్పష్టంగా కనబడుతాయి.

### చరిత్రను పున:లిఖించడం

**అభిషేక్.కె.బోస్:** **నేడు చరిత్రను మార్చివ్రాసే ప్రయత్నాలను అడ్డుకునేవారు అంతగా కనబడడంలేదు. చాలా మంది చరిత్రకారులు ఈ పనిలో సంఘ్‌పరివార్‌తో**



విడి సావర్కర్

**చేతులుకలుపుతున్నారు. హరప్పా నాగరికత పేరును సరస్వతి నాగరికతగా మార్చడానికి ప్రయత్నించడం దీనికి తార్కాణం. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సిలబస్‌లో మార్పులు చేయడానికి 90వ దశకంలో చేసిన ప్రయత్నాలను చూశాము. ఎందుకని మన దేశంలో ఈ ప్రయత్నాలను అడ్డుకునేవారు లేరు?**

**వినయ్‌లాల్:** ఈ ప్రశ్నకు విశాల దృక్పథంతో సమాధానం వెతకాలి. చరిత్రను మార్చడానికి చేస్తున్న ప్రయత్నాలను చూసి ఆశ్చర్యపోనక్కరలేదు. దురదృష్టవశాత్తు ఇది మనదేశంలో మాత్రమే కాక, అధికారంలో ఉన్న వారి ప్రత్యేక హక్కుగా ప్రపంచమంతటా వ్యవహరిస్తున్నారు. ఈ అంశం గురించి నేను చాలా సంవత్సరాల నుండి వ్రాస్తున్నాను. 2003లో రాజకీయాలు, చరిత్ర రచనపై 'ది హిస్టరీ ఆఫ్ హిస్టరీ : పాలిటిక్స్ అండ్ స్కాలర్‌షిప్ ఇన్ మోడరన్ ఇండియా' (ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 2003) అనే పుస్తకం వ్రాశాను. అధికారం సంపాదించినవారు చరిత్రను మార్చి వ్రాయడం వారి ప్రత్యేక హక్కుగా భావిస్తున్నారు. ప్రతి దేశంలోను చరిత్ర పుస్తకాలలోని అంశాలపై విభిన్న వాదనలు ఉంటాయి. ఇండియాలో మనం వీటిపట్ల ఎలా ఆలోచిస్తున్నాం అనేదే సమస్య.

**"దేశంలోని మేధావి వర్గాలు మౌనంగా ఉన్నాయని నేను భావించడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం భిన్నాభిప్రాయాలను సహించలేక అణగదొక్కాలని చూస్తున్నది. దేశంలోని యూని వర్సిటీలలో, జెఎన్‌యూలో ఏం జరిగిందో చూడండి. హిందూ త్వ వాదులు జెఎన్‌యు కమ్యూనిస్టుల కంచుకోట అని చెబుతారు. ఇది అసంబద్ధమైన వాదన. కొంతమంది వామపక్ష భావజాలం కలిగిన చరిత్రకారులు, సామాజికవేత్తలు ఉన్న మాట వాస్తవమే కాని వారు ఇతర యూనివర్సిటీలైనా అదే పనిచేస్తారు."**

భారతీయ జర్నలిజంలో సంకుచితత్వం ఉన్నది. మన జర్నలిస్టులు ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఏమి జరుగుతుందో గమనించాలను కోరు. జపాన్‌లో ఆ దేశపు చరిత్ర పాఠ్య పుస్తకాలపై అనేక చర్చలు జరుగుతున్నాయి. ఎందుకు? రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ పోషించిన పాత్ర, జపాన్ ఏం చేసి ఉండాలి? రెండవ ప్రపంచయుద్ధంలో తాను పాల్పడిన అకృత్యాలకు జర్మనీ క్షమాపణలు చెప్పినట్లుగా జపాన్ కూడా క్షమాపణలు చెప్పాలా? తదితరాలపై చర్చలు జరుగుతుంటాయి.

క్షమాభిక్షల రాజకీయాల గురించి నేను మాట్లాడబోవడంలేదు. చరిత్ర పాఠ్య పుస్తకాలలో అంశాలు, అధికారంలో ఉన్న వారు చరిత్రను మార్చడానికి ప్రయత్నిస్తు న్నారన్న వాస్తవం గురించిన ఈ వాదనలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న వారు ఇంతే చేస్తారు అనుకుంటూ ఏం జరిగినా చేతులు ముడుచుకుని కూర్చోమని దీనర్థం కాదు. చారిత్రక ఆధారాల ద్వారా, తార్కిక శక్తుల ద్వారా లేదా సహేతుకమైన నిర్ధారణల ద్వారా పాఠ్యపుస్తకాలు వ్రాయబడుతున్నాయా అన్న దాన్ని పూర్తిగా పరిశీలించాలి. మనం వాటిని సీరియస్‌గా తీసుకోవాలి.

సరస్వతి నాగరికత గురించిన వాదన ఏమిటి? హిందూత్వ దళం ఎందుకు ఈ వాదన పట్టుకు వేలాడుతోంది? వారు చెబుతున్న కారణాలలో ఒకటి ఆర్యులు విదేశీయులు అన్న అభిప్రాయాన్ని చెరిపేయడం. ఆర్యులు ఇండియాకు వలస వచ్చారని చెబుతున్న దానికి ఆధారాలు లేవని వారు చెబుతున్నారు. ముస్లింలే ఈ దేశంలో విదేశీయులు అని వారి వాదన. అసలు ముస్లింలను విదేశీయులని అనడంలో వారి ఉద్దేశ్యం ఏమిటి? ఎంతకాలం నుండి ముస్లింలు భారతదేశంలో ఉన్నారు? వెయ్యి సంవత్సరాల నుండా? ఏ కోణంలో వారు విదేశీయులవుతారు అని నేను వారిని ప్రశ్నిస్తున్నాను. ఆర్యులు విదేశీయులని ఎవరైనా చెప్పారంటే అది చాలా పెద్ద సమస్య అవుతుంది. చర్చ మొత్తం దీనిపైనే అని నేను చెప్పట్లేదు. ఇది వారి స్వాభావిక ఎత్తుగడ అని చెబుతున్నాను. ఇదే స్థానమార్పిడి చర్చ – ఒక అంశం గురించి వాదన చేస్తున్నట్లుగా ఉంటుంది కానీ అది వేరే అంశానికి సంబంధించి ఉంటుంది.

అభిషేక్.కె.బోస్: **ప్రతిపక్షం దాన్ని ఎదుర్కోవడానికి ఏమీచేయడంలేదని మీరు ఎందుకు అనుకుంటున్నారు? దేశంలోని మేధావి వర్గాలు ఎందుకని మౌనం వహిస్తున్నాయి?**

**వినయ్‌లాల్:** దేశంలోని మేధావి వర్గాలు మౌనంగా ఉన్నాయని నేను భావించడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం భిన్నాభిప్రాయాలను సహించలేక అణగదొక్కాలని చూస్తున్నది. దేశంలోని యూనివర్సిటీలలో ఏం జరుగుతుందో చూడండి. జెఎన్ యూనివర్సిటీలో ఏం జరిగిందో చూడండి. హిందూత్వ వాదులు జెఎన్‌యు కమ్యూనిస్టుల కంచుకోట అని చెబుతారు. ఇది అసంబద్ధమైన వాదన. కొంతమంది వామపక్ష భావజాలం కలిగిన చరిత్రకారులు, సామాజికవేత్తలు ఉన్న మాట వాస్తవమే కాని వారు ఇతర యూనివర్సిటీలైనా అదే పనిచేస్తారు. కానీ జెఎన్‌యులో ఏం జరుగుతుంది? కేరళలోని కన్నూర్‌లో క్రితం నెల జరిగిన వివాదం గురించి ప్రస్తావించారు. ఇటీవలే జెఎన్‌యు ఐచ్ఛిక పాఠంగా ఉగ్రవాదం మరియు ఉగ్రవాద వ్యతిరేక వ్యూహాలు అనే కోర్సును ప్రవేశపెట్టింది. మీరు ఉగ్రవాదం గురించి, దాన్ని తిప్పికొట్టే వ్యూహాల గురించి అధ్యయనం చేయాలనుకుంటే ఇస్లామిస్టు జిహాద్ గురించి అధ్యయనం చేయాలని చెబుతోంది. అంటే దానర్థం ఇస్లాం జిహాద్ మాత్రమే ఉగ్రవాదానికి పర్యాయపదంగా చెప్పదలచుకున్నారు. దీన్ని ఎవరు ధృవీకరించారు? అకడమిక్ కౌన్సిల్, వైస్ ఛాన్సలర్ దీనిని ఆమోదించారు. ఇది పూర్తిగా సందేహాస్పదమైన కోర్సు.

దురదృష్టవశాత్తూ భారత విశ్వవిద్యా లయాలు ప్రపంచం దృష్టిలో హాస్యాస్పదంగా మారిపోయాయి. భిన్నాభిప్రాయాలు చెప్పేవారు పక్కకు నెట్టివేయబడుతున్నారు. వారి నోరు నొక్కేస్తున్నారు. నేడు వైర్, స్క్రోల్ వంటి వెబ్ పోర్టల్‌లు ఉన్నాయి గానీ కేవలం నాయక బృందానికి ప్రబోధనలు చేసినట్లుగా ఆంగ్ల శ్రోతలతోనే మాట్లాడుతారు. కానీ వైర్ కొన్ని సంవత్సరాల క్రితమే విషయాలను అర్ధమయేలా చేయటం కోసం హిందీలో కూడా వీడియోలు అందించడం కోసం ప్రశంసనీయ కృషి చేస్తున్నది. మీరు పాఠ్యాంశాల్లో తెస్తున్న అసంబద్ధ మార్పులను వ్యతిరేకించేవారు లేరంటే మాత్రం అది వాస్తవం కాదు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారికి ఎదురవుతున్న సమస్యలు చిక్కుగా ఉన్నాయి. ట్రోల్స్ అనేవి యు.ఎస్.లో కూడా ఉన్నాయి. కానీ నాకు తెలిసినంతవరకు భారత్‌లో నడుస్తున్న ట్రోల్స్ మాత్రం పూర్తిగా దుర్మార్గమైనవి, రాయనలవి కానివి. వారికి ఉన్నతమైన చదువులు లేకపోయినా సోషల్‌మీడియా శక్తిని బాగా అర్ధం చేసుకున్నారు. ఇటువంటి సోషల్‌మీడియాతో ఉన్న ప్రమాదమేమంటే అది కేవలం ప్రజాస్వామికీకరణకు మాత్రమే కాకుండా నిరంకుశత్వానికి కూడా దారి తీస్తుంది.

అభిషేక్.కె.బోస్: **భారత ప్రభుత్వం దేశంలోని విద్యాసంస్థలన్నింటిలో ఏకీకృత విద్యాంశాల విధానాన్ని ఏర్పాటు చేసే దిశగా ఉందని రిపోర్టులు ఉన్నాయి. మీ అభిప్రాయం ఏమిటి?**

**వినయ్‌లాల్:** దాని గురించి నేను విన్నాను. కానీ దానిపై అభిప్రాయం చెప్పేంత స్పష్టత లేదు. దేశానికి సంబంధించి 10 వేల సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం చరిత్రను మార్చివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విన్నాను. 10 వేలు కావచ్చు, 15 వేలు కావచ్చు. హరప్పా లేక ఇండస్ లోయ నాగరికత క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల క్రితం నాటిది. ఒకవేళ నిజంగా దేశం మొత్తం ఒకే పాఠ్యాంశాలు ఏర్పాటు చేయాలని అనుకుంటే అది ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుంది. అది స్వేచ్ఛా తర్కానికి ముగింపు అవుతుంది.

కేంద్ర ప్రభుత్వం దేశమంతటా ఏకీకృత పాఠ్యాంశాలను నియంతృత్వంగా రుద్దితే మాత్రం అది ఆలోచనా, స్వేచ్ఛా తర్కానికి

> **" కేంద్రప్రభుత్వం దేశమంతటా ఏకీకృత పాఠ్యాంశాలను నియంతృత్వంగా రుద్దితే మాత్రం అది ఆలోచనా, స్వేచ్ఛా తర్కానికి చరమ గీతం అవుతుంది. చిన్న గమనిక - నేను నా విద్యార్ధులకు చరిత్రను బోధించే సమయంలో నేను పాఠ్యపుస్తకాన్ని ఉపయోగించను. పలు ఆర్టికల్స్‌లోని ప్రాధమిక సమాచారాన్ని అధ్యయనం చేయమని వారికి చెబుతాను. పాఠ్యపుస్తకం జ్ఞానాన్ని ఏకరూపం లోనే ఉంచుతుంది. "**

చరమ గీతం అవుతుంది. చిన్న గమనిక – నేను నా విద్యార్ధులకు చరిత్రను బోధించే సమయంలో నేను పాఠ్యపుస్తకాన్ని ఉపయోగించను. పలు ఆర్టికల్స్‌లోని ప్రాధమిక సమాచారాన్ని అధ్యయనం చేయమని వారికి చెబుతాను. పాఠ్యపుస్తకం జ్ఞానాన్ని ఏకరూపం లోనే ఉంచుతుంది. కాబట్టి నేను చరిత్రను పాఠ్యపుస్తకాలతో బోధించను. ఏకీకృత పాఠ్యాంశాలు సమస్యలను పదింతలు చేస్తాయి. దాన్ని ఆచరిస్తే గనుక దేశం మరమనుషులను ఉత్పత్తి చేసే కార్ఖానాగా మిగిలిపోతుంది. అదే జరగబోయేది. స్వాతంత్ర్య పోరాటం చేసింది ఇందుకేనా? అప్పుడు స్వాతంత్ర్యం పొంది ప్రయోజనం ఏమిటి? బ్రిటిషు వారికి బానిసలుగా ఉన్న కాలంలో ఇంతకన్నా ఎక్కువ స్వేచ్ఛనే కలిగి ఉన్నాము.

అభిషేక్.కె.బోస్: **చాలా యూనివర్సిటీలు ఇర్ఫాన్ హబీబ్, ఆర్.ఎస్.శర్మ, రొమిల్లా థాపర్ వంటి ప్రముఖ చరిత్రకారుల పుస్తకాలను ఉద్దేశ్యపూర్వకంగానే పరిశోధనా విభాగంలో ఉండకుండా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మీరేం అంటారు?**

**వినయ్‌లాల్:** యూనివర్సిటీ గ్రంథాలయాల నుండి ఇర్ఫాన్ హబీబ్, ఆర్.ఎస్.శర్మ, రొమిల్లా థాపర్, డి.ఎన్.ఝా ఇంకా ఇతర మేధావుల రచనలు తొలగిస్తున్నారని చెబుతున్నారా? అందుకే కొందరు నిరంకుశ లేదా అంతకన్నా దుర్మార్గమైన రాజ్యాలతో సారూప్యత సరికాదని అంటున్నారు. మనం ఇప్పుడు ఆ దిశగానే పయనిస్తున్నాము. పుస్తకాలను ఉండకుండా చేయడం, తగులబెట్టడం వేరు కాదు. క్రిస్టల్‌నాక్ట్‌లో ఏం జరిగింది? యూదుల ప్రార్ధనాలయాలు, దుకాణాలు రాత్రికి రాత్రి అగ్నికి ఆహుతి చేసేశారు. వారికి వ్యతిరేకంగా చరిత్ర పుస్తకాలన్నింటినీ తగులబెట్టి చలిమంటలు వేసుకున్నారు. అది వారి ఉన్మాదానికి పరాకాష్ట. చరిత్రకారుల కృషి ఇక దొరకకుండా చేయడం, లేదా యూనివర్సిటీలు, గ్రంథాలయాల నుండి బయటకు విసిరేయడం – జరుగుతున్నది ఇదే. అయితే ఇది కేవలం అభ్యంతరకరమైనవాటిని తొలగించడం కాదు, అంతకన్నా పెద్ద సమస్య. పుస్తకాలను తగులబెట్టడం, పాతిపెట్టే సంస్కృతి తిరోగమన మార్గం. ప్రమాదకరమైన మార్గం.

### విశిష్ట మధ్యయుగ కాలం

అభిషేక్.కె.బోస్: **కొన్ని యూనివర్సిటీలలో మధ్యయుగం నాటి చరిత్రను బోధించకుండా ఆదేశాలు కూడా జారీ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.**

**వినయ్‌లాల్:** వినయ్‌లాల్: అదే గనుక జరిగితే ఇంకో సమస్య తోడైనట్లే. మధ్యయుగాల కాలం ముస్లిం రాజుల పాలనా కాలం – ముస్లిం రాజుల ఆక్రమణలు, ముస్లిం రాజుల పాలన – అవడంతోనే ఈ సమస్య ఉత్పన్నమైందని మనకు తెలుసు. ఉత్తర భారతంలో ఢిల్లీ సుల్తానులు, దక్షిణ భారతంలో బహమనీ సుల్తానులు, దానితో పాటు మొఘల్ సామ్రాజ్య పాలన. ఈ అంశాలు బోధించక పోతే విద్యార్ధులు ఈ కాలంలో ఏం జరిగిందో తెలుసుకోలేరు. దేశంలోని మార్పులను అర్థం చేసుకోవడానికి అవస్థ పడతారు. ఇది కేవలం దేశ చరిత్రలోని ఒక పెద్ద భాగాన్ని తొలగించడమే కాదు. ఇది మనం చాలా కీలకంగా ఆలోచించాల్సిన సమస్య. ఆర్ఎస్ఎస్, బిజెపి మూక మధ్యయుగ చరిత్ర యూరోపియన్ చీకటి యుగం లేదా మధ్యయుగం వంటిదని యూనివర్సిటీలను, విద్యాసంస్థలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. యూరోపియన్ చరిత్రనే భారత చరిత్రగా చొప్పించేందుకు ప్రయత్నిస్తారు. యూరోపియన్ చీకటి యుగం లేదా మధ్యయుగం గుర్తు ఉండే ఉంటుంది. భారత మధ్యయుగ చరిత్ర మొత్తం చాలా గొప్ప కాలం. ఆ కాలంలోనే భారతీయ భాషలు, సాహిత్యం విలసిల్లాయి. భక్తి ఉద్యమం నడిచింది. 1000 – 1700 సంవత్సరాల మధ్యలోనే ప్రపంచంలో ఎక్కడాలేనంత భక్తి సాహిత్య భాండాగారంగా భారతదేశం విరాజిల్లింది. ఉత్తర భారతంలో తులసీదాస్, సూర్‌దాస్, మీరాబాయి, కబీర్, నందదాస్‌లు, మహారాష్ట్రలో తుకారాం, ఏక్‌నాథ్, నరసింహ మెహతా వంటి ప్రముఖ వ్యక్తులు, అంతకన్నా ముందు 13వ శతాబ్దంలో జ్ఞానేశ్వర్, దక్షిణ భారతంలో బసవన్న, వీరశైవుల వంటి పద్యకారులు, బెంగాల్‌లో చైతన్య, చండీదాస్, ఇలా అనేక మంది ఉన్నారు. నాకు ఇప్పటికిప్పుడు గుర్తు వచ్చిన కొన్ని పేర్లను మాత్రమే చెప్పాను. ఇప్పుడు వారు దీన్ని ఒకే విధానంగా మలిచేందుకు, వారికి వీలైన ఆలోచనలు చొప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ భారతదేశంలో జాతీయోద్యమాన్ని నిర్మించేందుకు ఈ సాంస్కృతిక ఉద్యమం దోహదపడింది.

యూరోపియన్ చరిత్రలో మధ్య యుగాలను చీకటి యుగంగా పిలుస్తున్నారు. ఆ కాలంలో యూరప్ దేశాలు మేధస్సు, సాంస్కృతిక వారసత్వంతో సంబంధాలు కోల్పోయాయి. అరబ్బుల వల్లే అరిస్టాటిల్ వంటి గ్రీకు తత్వవేత్తలు పశ్చిమ దేశాల్లో వెలుగులోకి వచ్చారన్నది మనకందరకు తెలుసు. ఈ అంశంపై వేలకొద్దీ పుస్తకాలు వ్రాయబడ్డాయి. ముస్లిం పరిపాలన సాగిన మధ్యయుగాన్ని చీకటి యుగం అనే పేరుతో వారికి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు. విభజన ఆధారంగా చరిత్రను అధ్యయనం చేయాల్సిన అవసరం లేనప్పటికీ దేశ చరిత్రను ప్రాచీన, మధ్య, ఆధునిక భారత చరిత్రలుగా విభజించి చూసిన ఆలోచన కూడా యూరప్ నుండి తీసుకున్నదే. ఉత్తర భారత దేశంలో ఇండో – ఇస్లామిక్ సంస్కృతుల కలయికతో అభివృద్ధి చెందిన తరహా సంస్కృతి మూరిష్ స్పెయిన్ (8, 15 శతాబ్దాలలో ఉత్తర ఆఫ్రికా, స్పెయిన్‌లో నివసించిన ముస్లిం తెగ ప్రజలు) లో తప్ప ప్రపంచంలో మరే ఇతర ప్రాంతంలోను కనబడదు. గంగా యమున సంగమం, ఇండో ఇస్లామిక్ సంస్కృతుల కలయిక వంటి ఆలోచనను సహించలేని చరిత్రకారులు కొద్ది మంది ఉన్నప్పటికీ ఈ కలయికపై చర్చలను కొనసాగించడానికి అవకాశం ఉంది. దక్కన్, బహమనీ సామ్రాజ్యాలలో భాగంగా ఉన్న బీజాపూర్ వంటి కాస్మోపాలిటన్ నగరాలను కూడా అధ్యయనం చేయాలి. స్థూలంగా చెప్పాలంటే మధ్యయుగం మొత్తాన్ని మన చరిత్ర పుస్తకాలలోనుండి తొలగించడం వల్ల నేను వివరించిన సమస్యలే కాకుండా భవిష్యత్తు తరాల మేధస్సు, ఊహాశక్తి పూర్తిగా విఫలమయ్యే ప్రమాదం ఉంది.

**(అనువాదం: వల్లభనేని గీత)**

# అటవీ సంరక్షణ చట్ట సవరణ:
# గిరిజనులపై మరో దాడి



పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఎలాంటి జోక్యాన్నీ పాలక పార్టీ అనుమతించటంలేదు. ఫలితంగా, చర్చలు లేకుండానే ప్రభుత్వం తన వ్యవహారాలను చక్కబెట్టుకోగల్గుతున్నది. అందులో భాగమే, అటవీ సంరక్షణ చట్టం (యఫ్‌సిఎ) -1980 సవరణ బిల్లు ప్రవేశపెట్టడం. ఇలాంటి విషయాలను, 'పర్యావరణము, అటవీ-వాతావరణ మార్పుల' మంత్రిత్వ శాఖ పరిధిలోని 'పార్లమెంటరీ స్టాండింగ్ కమిటి' (యంఒఇయఫ్‌సిసి)కి సమర్పించాలి. కానీ ప్రభుత్వం ఆ బిల్లును, పార్లమెంట్ ఉభయ సభల సభ్యులతో కూడిన 'జాయింట్ కమిటీ'కి సమర్పించింది. ఆ సాంప్రదాయాన్ని ప్రభుత్వం ఎందుకు ఉల్లంఘించింది? దీనిపై ఆ కమిటీ ఛైర్మన్, కాంగ్రెస్ నేత జయరాం రమేష్ తన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తంచేయటం సరైనదే. పార్లమెంటరీ సాంప్రదాయాలను, లక్ష్యాలను ప్రభుత్వం తోసిరాజంటున్న ధోరణికి ఇది మరొక ఉదాహరణ.

ఈ సవరణ బిల్లు చాలా ఆందోళన కరమైనది. తమ పరిధిలో ఏ ప్రాజక్టుకైనా ఆయా గ్రామ సభల ఆమోదం లేకుండా చేపట్టరాదన్నది రాజ్యాంగం ప్రసాదించిన చట్టబద్ధ హక్కు. ఆ హక్కును పాలకులు అత్యంత అభ్యంతరకరమైనదిగా భావించారు. ఆ హక్కును ఖతం చేయాలనే ఉద్దేశ్యంతోనే యఫ్‌సిఎ రూల్స్ -2003ను యంఒఇయఫ్‌సి సి ద్వారా సవరించాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారు. దానికోసమే, అటవీ భూముల దారి మళ్లింపు (డైవర్షన్) నిబంధనలను సరళతరంచేయడం, 'అటవీ సంరక్షణ' ముసుగులో అడవులను ప్రైవేట్‌పరంచేయడం, అడవుల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను నిర్వీర్యం చేయడం, అందుకు కేంద్రానికి ఎక్కువ అధికారాలను కట్టబెట్టడం వంటి చర్యలకు పూనుకున్నారు. పై చట్ట సవరణతో 'అడవులుగా మార్చే స్కీము' రూపురేఖలను సమూలంగా మార్చి, వాణిజ్యపరమైన వినియోగాలతో సహా, ప్రైవేటు తోటల పెంపకాలను ప్రోత్సహించా లన్నది పాలకుల ఉద్దేశ్యం.

ఈ చట్ట సవరణలను సిపిఐ(ఎం) దాన్ని గుర్తుచేసుకుందాం. ఆ విభజనను చట్టబద్ధం చేయటమే ఈ బిల్లు ఉద్దేశ్యం.

**యఫ్ఆర్ఎ, పీసా(పిఇయస్ఎ)ల ప్రస్తావనే లేదు.**

గిరిజన ప్రజానీకం, సాంప్రదాయ అటవీ వాసుల రక్షణకు ఉద్దేశించిన ఇతర చట్టాలు, రాజ్యాంగబద్ధ గ్యారంటీలున్నాయి. వాటి ప్రస్తావన ఒకటి కూడా ఆ బిల్లులో లేదు. ముందుమాట ఇలా ప్రస్తావిస్తున్నది : "అడవిపై ఆధారపడిన ప్రజానీకం పురోభివృద్ధితోపాటు, అటవీ ఆధారిత ఆర్థిక, సామాజిక, పర్యావరణ ప్రయోజనాలను మెరుగుపరచాలి." సవరణల బిల్లు మూలంలో పై అంశం ప్రస్తావనే లేదు. ఆవిధంగా, ''సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు, జీవన పరిస్థితుల అభివృద్ధి"కి ఆ చట్టాలు హామీనిస్తున్నాయి. ఆ చట్టాల ఉల్లంఘనకు ఈ బిల్లు ముసుగు తప్ప మేమీకాదు.

**మినహాయింపుల ద్వారా సరళీకరణ**

మినహాయింపు అంటే, ప్రాజక్టులకు ఆటోమాటిక్‌గా అనుమతులు మంజూరుచేయ టం. అందుకు, 'పర్యావరణ ప్రభావాలపై అంచనాలు; అటవీ హక్కుల చట్టం; యఫ్ఆర్ఎ, పీసా,డబ్లుయల్‌పిఎ (2006 సవరణలతో)లతో నిమిత్తం లేకుండా సదరు అనుమతులను ఇవ్వాలి. కానీ ఆయా ప్రాంతా ల్లో ఏ ప్రాజక్టులకైనా గ్రామ సభల అనుమతి తప్పనిసరిగా అవసరమని పై చట్టాలు నిర్దేశిస్తున్నాయి.

ఏ భూములకు, ఏ తరహా ప్రాజక్టులకు మినహాయింపు ఇవ్వాలన్న వివరాలను క్లాజు 1ఎ(1), (2)ల్లో వివరంగా పొందుపరిచారు. (1)లో, 1996కు ముందు ప్రారంభించిన ప్రాజక్టులకు, అన్ని అటవీ భూముల మళ్లింపులకు చట్టం నుండి మినహాయింపులు ఇవ్వబడినాయి. దానితో, అనేక సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రాజక్టులన్నింటికీ ఈ మినహాయింపు వర్తిస్తుందన్న తార్కిక వాదనలకు దారితీయవచ్చు. వాస్తవానికి, అటవీ హక్కుల చట్టం ఆమోదంపొందాక అలాంటి భూమి అంతా అటవీ హక్కుల చట్టం(యఫ్ఆర్ఎ) పరిధిలోకి వచ్చింది. ఆదివాసులు, ఇతర సాంప్రదాయ అటవీ వాసులందరి హక్కులు పరిరక్షించబడుతున్నాయి. 1996కి ముందున్న ప్రాజక్టులకు ఉన్నాయని చెప్పబడుతున్న హక్కులను యఫ్ఆర్ఎ ఇప్పటికీ గుర్తించటం లేదు. అందుకు అనేక ఉదాహరణలను పేర్కొనవచ్చు. యఫ్ఆర్ఎ, యఫ్‌సిఎల పరిధి నుండి అలాంటి ప్రాజక్టులను తొలగించేందుకు ప్రస్తుత బిల్లు 'అడవి'ని పున: నిర్వ చించేందుకు(రిడిఫైన్) పూనుకుంది. అలాంటి ప్రాజక్టులకు మినహాయింపు ఇవ్వటమంటే, భూమి హక్కును కోల్పోతున్న బాధితుల ప్రస్తావన లేకుండానే, 'భూమి వినియోగం' ఆటోమాటిక్‌గా మారిపోతుందని అర్థం.

సెక్షన్ (2)లో, పలు విభాగాల అటవీ భూమి మినహాయించబడింది. దానితో అటవీ భూమిలో పెద్ద భాగం ప్రభావితమౌతుంది. తద్వారా ఆదివాసులు, ఇతర అటవీ వాసుల హక్కులను పెకలించివేయాలని ప్రభుత్వం

> "ఈ బిల్లు ముందుమాటలో "ఆర్థిక అవసరాల" ప్రస్తావన ఉంది. అందులో ఇలా పేర్కొన్నారు: "అడవుల పరిరక్షణా నిర్వహణ, అడవుల పునరుద్ధరణ, పర్యావరణ రక్షణను కొనసాగించటం, అడవుల సాంస్కృతిక, సాంప్రదాయ విలువలను నిలబెట్టేందుకు అవసరమైన చట్టబద్ధ నిబంధనలను సమకూర్చుకోవాలి." ఇదే బిల్లు సారాంశం. ఎవరి ఆర్థిక అవసరాలను పూర్తి చేయాలి? ఆర్థిక అవసరాలు తీర్చాలన్న పేర ప్రతిపాదిత సవరణల ద్వారా ప్రభుత్వం ప్రాజక్టుల జాబితాను విస్తరిస్తున్నది."

వ్యతిరేకించింది. కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌కు మెమోరాండాన్ని సమర్పించింది. సిపిఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు ఎలరీం కరీం ఈ సవరణ ప్రతిపాదనలను రద్దుచేయాలని కోరుతూ సభలో చట్టబద్ధ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తీర్మానాన్ని అనుమతించి నప్పటికీ చర్చకు అవకాశమివ్వలేదు. గతంలో పర్యావరణ ప్రభావిత నియమాలను ప్రభుత్వం సవరించింది. ఈ తతంగమంతా మోడీ సర్కారు 'స్వేచ్ఛా వాణిజ్యం' మంత్రానికి సానుకూలతను సాధించేందుకే ఉద్దేశించబడింది.

ప్రస్తుత సవరణ బిల్లు, ఆదివాసులు, సాంప్రదాయ అటవీ వాసుల హక్కులపై మరోసారి దాడిచేసేందుకే ఉద్దేశించబడింది. వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని కర్బన ఉద్ఘాతాలను అరికట్టడంపేర ఏక పక్షమైన, అవాస్తవ లక్ష్యాలను నిర్దేశించారు. దానితో భారత్‌ను చట్టబద్ధంగా కట్టడిచేసేందుకు కూడా పై సవరణలు ఉద్దేశించబడ్డాయి. అవి ప్రధానంగా భూములను 'కొత్త అడవులుగా మార్చటం'(ఎఫారస్టేషన్')పైనే దృష్టి సారించాయి. తద్వారా అభివృద్ధిపేరుతో, కార్పోరేట్లకు విస్తారమైన అటవీ భూములను దారిమళ్లించి కట్టబెట్టేందుకు పాలకులు పూనుకున్నారు. ఈ చర్యతో, ప్రస్తుత 'అటవీ హక్కుల చట్టా'న్ని ప్రత్యక్షంగా ఉల్లంఘించేందుకు సిద్ధమైనారు. ఈ ప్రమాదం మూలంగానే, ఈ సవరణ బిల్లు ప్రవేశపెట్టే దశలోనే రద్దుచేయబడాలి.

**ఎవరి 'ఆర్థిక అవసరాల' కోసం..?**

ఈ బిల్లు ముందుమాటలో "ఆర్థిక అవసరాల" ప్రస్తావన ఉంది. అందులో ఇలా పేర్కొన్నారు : "అడవుల పరిరక్షణా నిర్వహణ, అడవుల పునరుద్ధరణ, పర్యావరణ రక్షణను కొనసాగించటం, అడవుల సాంస్కృతిక, సాంప్రదాయ విలువలను నిలబెట్టేందుకు అవసరమైన చట్టబద్ధ నిబంధనలను సమకూర్చుకోవాలి." ఇదే బిల్లు సారాంశం. ఎవరి ఆర్థిక అవసరాలను పూర్తిచేయాలి? ఆర్థిక అవసరాలు తీర్చాలన్న పేర ప్రతిపాదిత సవరణల ద్వారా ప్రభుత్వం ప్రాజక్టుల జాబితాను విస్తరిస్తున్నది. 'అటవీ రక్షణ చట్టం నియంత్రణ చట్టానికి అనుగుణంగా మినహాయించిన భూముల జాబితాను కూడా పెంచుతున్నది. 2008-2009 మధ్య కాలంలో, 2.53లక్షల హెక్టార్ల అటవీ భూమిని ప్రాజక్టుల కోసం విభజించాలని రాజ్యసభలో ప్రభుత్వం సమాధానమిచ్చింది. కంకణంకట్టుకుంది. ఉదాహరణకు, సరిహద్దుల నుండి 100కి.మీల వరకూ అటవీ భూమి యఫ్‌సిఎ ఆంక్షల నుండి మినహాయించబడింది. అనేక మంది 'పరిసరాల పరిశీలనా శాస్త్రజ్ఞులు'(ఎకాలజిస్టు), నిపుణుల అంచనాల ప్రకారం 13లక్షల చదరపు కి.మీ. లేదా భూ విస్తీర్ణంలో షుమారు 40 శాతం, అందులో గణనీయమైన భాగం అటవీ భూమి మినహాయించబడుతుంది. ఈ మినహాయింపులన్నీ, వ్యూహాత్మకమై 'జాతీయ ప్రాధాన్యతగల ప్రాజక్టులు" లేదా "రక్షణ సంబంధిత ప్రాజక్టులు" లేదా "ప్రజా వినిమయ ప్రాజక్టులు". వీటికి పై మినహాయింపులన్నీ వర్తిస్తాయి. ఈ క్లాజు(క్యాచ్ -ఆల్ క్లాజు), చట్టం నిషేధించని ఏ పనినైనా చేసేందుకు ట్రస్టీలకు అధికారం ఇస్తుంది. దాన్ని అడ్డం పెట్టుకుని మినహాయింపులకు అర్హమైన దేన్నైనా, ప్రతి దాన్నీ ప్రాజక్టులు తమ వశం చేసుకుంటాయి. అంతేగాక, 'జాతీయ ప్రాధాన్యత', లేక 'ప్రజా ప్రయోజనము' వంటి పదాలు ప్రభుత్వ యాజమాన్యానికి మాత్రమే సూచకలు కావు. అందుకు భిన్నంగా, అవి కార్పోరేట్ల యాజమాన్యంలోని ప్రైవేటు సంస్థలకు కూడా వర్తిస్తాయి. రక్షణ రంగంతో సహా వ్యూహాత్మక రంగాలను కార్పోరేట్ల పరంచేయాలన్నది ప్రభుత్వ విధానం. దాని ఉప సిద్ధాంతంగానే, యఫ్‌సిఎ ఆంక్షల పరిధిలో మినహాయింపులను ప్రతిపాదించారు. ప్రైవేటు పెట్టుబడికి ప్రోత్సాహకాల రూపంలోనే ఈ మినహాయింపులున్నాయి. ఈ మినహాయింపులు, అటవీ హక్కుల చట్టం తదితర చట్టాలన్నింటినీ ఉల్లఘిస్తున్నాయి. అవి, అటవీ వాసులు ప్రధానంగా ఆదివాసుల హక్కులు. జీవనాలపై నేరుగా ప్రభావం చూపుతాయి.

ఈ మినహాయింపులు, "అడవిలో చెట్లు తొలగించినచోట తిరిగి చెట్లు నాటే (రిఫారెస్టేషన్) ప్రాంతాన్ని (ప్రభుత్వ భూమి లేదా ప్రభుత్వ రికార్డుల్లోని భూమి) నిర్దిష్టంగా పేర్కొనలేదు. అ క్లాజు ప్రైవేటు అడవులకు ఉన్నత స్థానం కల్పించేందుకే ఉద్దేశించబడిందనేది స్పష్టం.

**అధికార కేంద్రీకరణ**

ఈ బిల్లు రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కాలరాస్తున్నది. అంతేకాదు, పై మినహాయింపులు కేవలం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన షరతులకు అనుగుణంగా మాత్రమే జరుగుతాయి. చివరకు చెట్లు కొట్టేయటం, అందుకు పరిహారంగా తిరిగి కొత్తగా అడవుల పెంపకానికి మొక్కలు నాటే సమస్య కూడా రాష్ట్ర ప్రభుత్వాల అధికార పరిధిలో ఉండదు.

దేశంలో అధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వం వద్ద కేంద్రీకృతమౌతున్నాయి. ప్రధాన చట్టంలోని 2వ సెక్షన్‌కు మరొక సవరణ సందర్భంగానూ ఈ అధికార కేంద్రీకరణ పునరావృతమైంది. పాలకులను ఆందోళన పరుస్తున్న అంశాలు : "అడవుల రక్షణకు ఉద్దేశించిన రిజర్వేషన్‌లను ఎత్తేయటంపైన, లేదా అటవీ భూములను అటవీయేతర అవసరాలకు వినియోగించటంపై ఆంక్షలు." ఈ బిల్లు మినహాయింపుల జాబితాను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నది. ఆ మినహాయింపుల విస్తరణ జాబితాలో 'అటవీయేతర అవసరాలు', ఎకో(పరిసరాలను పరిశీలించే శాస్త్రం) టూరిజంను, ప్రైవేటు సఫారీ (అడవుల్లో జంతువుల వేట)ను చేర్చేందుకు, లేదా 'కేంద్ర ప్రభుత్వం భవిష్యత్‌లో స్పష్టంగా నిర్దేశించుకోనున్న ఇతర అవసరాలు' కూడా ఉంటాయి. సవరణ (2)లో, కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను ప్రకటించవచ్చు. ఆ కార్యక్రమాల్లో ఖనిజ నిక్షేపాలున్న ప్రదేశాల అన్వేషణ, గనుల తవ్వకాలను 'అటవీయేతర అవసరాల' జాబితా ప్రకటన నుండి మినహాయించాలి. షరతులను కూడా నిర్ణయించాలి.

> **" కేంద్ర ప్రభుత్వం నటనా చాతుర్యానికి ఈ బిల్లు ఒక మచ్చుతునక. ఈ బిల్లు మినహాయింపులను విస్తరిస్తున్నది. అటవీ భూముల మళ్లింపులను, గిరిజన హక్కులపై దాడులను చట్టబద్ధం చేస్తున్నది. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు 'జాతీయంగా నిర్ణయించిన సహకారాల' (యన్‌డిసి) అమలుకు భారత్ అంకితమౌతుందన్న ముసుగులో ప్రభుత్వం పై దుశ్చర్యలకు పాల్పడుతున్నది. "**

ఆ విధంగా మినహాయింపులు అడవుల పరిరక్షణకు హాని చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించ కుండానే కేంద్ర ప్రభుత్వం సవరణలు చేస్తుంది. తద్వారా సంక్రమించిన అధికారాలతో, మరి కొన్ని మినహాయింపులు కూడా ఇవ్వవచ్చు.వాటికి షరతులను కూడా నిర్ణయించవచ్చు. ఆంక్షలను సరళీకరించటం, కేంద్ర ప్రభుత్వం చేతుల్లో అధికారాలు కేంద్రీకరణ అనేవి సవరణల బిల్లులోని రెండు పార్శ్వాలు.

**కేంద్ర ప్రభుత్వ నటనా చాతుర్యం**

కేంద్ర ప్రభుత్వం నటనా చాతుర్యానికి ఈ బిల్లు ఒక మచ్చుతునక. ఈ బిల్లు మినహాయింపులను విస్తరిస్తున్నది. అటవీ భూముల మళ్లింపులను, గిరిజన హక్కులపై దాడులను చట్టబద్ధం చేస్తున్నది. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు 'జాతీయంగా నిర్ణయించిన సహకారాల' (యన్‌డిసి) అమలుకు భారత్ అంకితమౌతుందన్న ముసుగులో ప్రభుత్వం పై దుశ్చర్యలకు పాల్పడుతున్నది. చట్ట పరిధిలోని నియంత్రణ చట్రం నుండి ఒక బిల్లు ఒక స్థాయిలోని ప్రాజక్టులకు మినహాయింపులు ఇచ్చేలా ఆ బిల్లు ఎలా రూపొందించబడింది? ఆ బిల్లుతో, ఇంకా ఎక్కువ అటవీ భూమి పలు మినహాయింపులకు దారితీయటం అనివార్యమౌతుందా? ఆ క్రమం యన్‌డిసిలో ఇముడుతుందా? ముందుమాటలోని వాదనలు, బిల్లులో ప్రతిపాదిత వాస్తవ సవరణలు ప్రత్యక్షంగా పరస్పరం వైరుధ్యపూరితంగా ఉన్నాయి. అవి ఒకదానితో మరొకటి విభేదిస్తున్నాయి.

ముందుమాటలో, యన్‌డిసిలోని సహకారాలను ప్రస్తావించారు. అందులోని వాగ్దానాలకు ఒక విధమైన చట్టబద్ధమైన గుర్తింపునిచ్చారు. వాటిని ప్రభుత్వం, తర్వాత జరుగబోయే 'అంతర్జాతీయ పర్యావరణ మహాసభ'లో చాటిచెబుతుంది. నిర్ణయించుకున్న కొన్ని నిర్దిష్ట లక్ష్యాలను అక్కడ ప్రస్తావిస్తుంది. "2030 నాటికి 2.5 నుండి 3 బిలియన్ టన్నుల అదనపు కార్బన్‌డై ఆక్సైడ్ (సిఒ 2)కు సమ సంయోగ యోగ్యతగల (ఈక్వోవలెంట్) 'కర్బనపు సింకు'ని సృష్టించనున్నట్లు ప్రకటిస్తుంది. 2030నాటికి అడవులను, చెట్ల పచ్చదనపు ఆచ్ఛాదన(కవర్)ను మూడవ వంతు భూమి విస్తీర్ణానికి పెంచుతామని ఘనంగా చెబుతారు. కానీ, మినహాయింపులతో ఆ లక్ష్యాలను చేరటం సాధ్యమా?

2021 ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (యఫ్‌యస్‌ఐ) నివేదిక ప్రకారం, భూ విస్తీర్ణంలో అటవీ ఆచ్ఛాదనం 21.7శాతం గాను, చెట్ల ఆచ్ఛాదనం 2.9శాతంగాను ఉన్నాయి. రెండూ కలసి భూ విస్తీర్ణంలో, మొత్తం ఆచ్ఛాదనం 24.7 శాతం మాత్రమే ఉంది. ఈ అంచనా కూడా అతిగా ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కారణం, ఆ ఆచ్ఛాదనల్లో టీ తోటలు, పండ్ల తోటలు, ఎడారి పొదలనూ అటవీ ఆచ్ఛేదనలుగా చూపారు. అధికార అంచనాలను పరిగణలోకి తీసుకున్నా, సమ సంయోగ యోగ్యతగల (ఈక్వోవాలెంట్) 'కర్బనపు సింకు' సృష్టికి అవసరమైన చెట్లను నాటేందుకు ఎంత భూమి అవసరమౌతుంది ?

'భారత ప్రభుత్వం గ్రీన్ మిషన్ అంచనాల కమిటి' తన 2018 డిసెంబరు నివేదికలోని వివరాలు : "కర్బనం స్వాధీనానికి అవసర మైన లక్ష్యాలను చేరుకునేందుకు ప్రస్తుత అడవులకు అదనంగా, 3 కోట్ల (30 మిలియన్) హెక్టార్ల భూమి అవసరమౌతుంది." కానీ, ఈ భూమిని ఎక్కడనుండి సేకరించాలన్న అంశాన్ని మిషన్ నివేదిక స్పష్టంచేయలేదు. ప్రధానంగా గిరిజన ప్రజానీకం అధీనంలోని భూముల్లోనే అలాంటి కొత్త అడవులను ఏర్పాటు చేస్తున్నారు. వారి హక్కులను గుర్తించటం లేదు. అందుకు భిన్నంగా మొక్కలు నాటేందుకు, వారి భూములను బలవంతంగా స్వాధీనంచేసుకుంటున్నారు.

యఫ్‌యస్‌ఐ 2021 నివేదిక ప్రకారం, అటవీ ఆచ్ఛాదనంలో 60శాతం, చిక్కటి అడవుల్లో 73శాతం 218 జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. వీటిని గిరిజన జిల్లాలుగా వర్గీకరించారు. అవి ఈశాన్య, తూర్పు, మధ్య భారతంలో ఉన్నాయి. ఆ ప్రాంతాలు, భారత రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్ల ద్వారా ప్రత్యేక రక్షిత ప్రాంతాలు క్రింది నమోదయ్యాయి. వాటిలో అనేక జిల్లాలు సంపద్వంతమైన ఖనిజాలు, నీటి వనరులకు కూడా నెలవుగా ఉన్నాయి. అందుకే ఈ జిల్లాల్లో గనుల ప్రాజక్టులు; విద్యుత్, జలవనరుల ప్రాజక్టులకు అటవీ భూములు ఎక్కువగా మళ్లించబడ్డాయి. అయినప్పటికీ, ఈ ప్రాంతాల్లో, ప్రధానంగా నమోదు చేయబడిన అటవీ ప్రాంతాలకు బైట అటవీ ఆచ్ఛాదనపు స్థూల విస్తీర్ణం పెరిగింది. గిరిజన ప్రజానీకపు రాజ్యాంగపరమైన, న్యాయబద్ధమైన హక్కులను గుర్తించాలి. ఆ ప్రాతిపదికపైన, అటవీ పరిరక్షణ పథకాల్లో, గిరిజన ప్రజానీకాన్ని భాగస్వాములను చేయటంలోని ప్రాధాన్యతను మరోసారి గమనించగల్గుతాము. కానీ ప్రబుత్వం మాత్రం అందుకు వ్యతిరేక దిశలో వ్యవహరిస్తున్నది.

**ప్రమాదకరమైన బిల్లును వ్యతిరేకించాలి!**

మొత్తంమీద ఈ బిల్లు విస్తృత పథకంలో భాగం మాత్రమే : ఆ ప్రమాదాలు : 1. యఫ్‌సిఎ, యఫ్‌ఆర్‌ఎ,(అడవుల సంరక్షణ బిల్లు పార్లమెంటు ముందుంది. (కానీ ఆపాటికే యంఒఇయఫ్‌సిసి రాష్ట్ర అధికారులతో తన ప్రక్రియను ప్రారంభించింది. గుర్తింపుగల అటవీ విభాగాలను సమీక్షించాలని వారిని కోరింది ఆ చట్టాల పరిధి నుండి ఎక్కువ భాగం అడవులను బైటికి తేవాలి. వాటికి అనుగుణంగా అడవులను పునర్నిర్వచించాలి. 2. అటవీ పాలనా పద్ధతిలో, కేంద్రీకరణను అనుమతించేలా పునర్నిర్మించాలి. వెనక్కు మళ్లించాలి. ఆ లక్ష్యాను అటవీశాఖ ఉన్నతాధికారులు, అటవీ మాఫియా, కార్పోరేట్లకు అత్యధిక నియంత్రణ కల్పించటం ద్వారా సాధించాలి. 3. అటవీ పాలనా పద్ధతిలో ప్రజాస్వామ్య పురోగమన పునాదిని హరించి వేయాలి. అందుకు యఫ్ ఆర్‌ఎ, పీసా, గ్రామ సభల అధికారాలను కుదించివేయాలి.

ఈ బిల్లు, గిరిజనుల హక్కులకు వ్యతిరేకంగా వాస్తవమైన యుద్ధాన్ని ప్రకటించింది. యఫ్‌సిఎ సవరణ బిల్లు వారి అంబుల పొదిలో మరో ఆయుధం. అందుకే దాన్ని వ్యతిరేకించాలి. ❋

# మణిపూర్ మారణకాండకు కారకులెవరు?



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

**ఎ కోటిరెడ్డి**

ప్రధాని నరేంద్రమోడి జూన్ 21 నుండి 23వ తేదీ వరకు అమెరికాలో, 24-25 తేదీలలో ఈజిప్టులో పర్యటించాడు. జూన్ 21 న న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో జరిగిన 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నాడు. అమెరికాలో అధ్యక్షుడు బైడెన్‌తో, ఈజిప్టులో ఆ దేశ అధ్యక్షుడు అబ్దల్ ఫతా ఎల్ సిసితోనూ, ఉభయ దేశాల ఉన్నతాధికారులతో చర్చలు జరిపాడు. అమెరికాతో వాణిజ్యం, రక్షణ, అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన అంశాలపై ఒప్పందాలు చేసుకున్నారు. దేశంలో తయారు చేస్తున్న తేలికపాటి యుద్ధ విమానం తేజాకు అవసరమైన ఇంజన్లను భారతదేశంలో తయారు చేయటం కోసం అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రికల్ కంపెనీ భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నది. జనరల్ ఎలక్ట్రికల్‌కు చెందిన ఎఫ్ 414 ఇంజన్లను భారతదేశంలో ఉత్పత్తి చేయటం కూడా ఒప్పందంలో భాగంగా ఉంది. జనరల్ ఆటమిక్ కంపెని ఉత్పత్తి చేస్తున్న డ్రోన్‌లను భారీ మొత్తంలో కొనుగోలు చేయటం కోసం ఒప్పందం చేసుకోవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికాతో చేసుకున్న ఒప్పందాలలో కొత్తవి లేవు. పాత ఒప్పందాలనే అటూ ఇటూ తిరగేసి, చిన్నచిన్న మార్పులు చేసి, కొత్త ఒప్పందాలు చేసుకున్నట్లు చెబుతున్నారు. మొత్తం ఈ కార్యక్రమం వెనుక ఉన్నది చైనాకు వ్యతిరేకంగా అమెరికా ఏర్పాటు చేస్తున్న కూటమిలో భారతదేశాన్ని కూడా భాగస్వామిని చేయటం, చైనాకు వ్యతిరేకంగా చేస్తున్న దాడిలో భారతదేశం ముందు వరుసలో ఉండేలా చూడటం అమెరికా లక్ష్యం. దానితో పాటు అమెరికా కంపెనీల నుండి భారతదేశం భారీగా ఆయుధాలను కొనేలా చేయటం, దేశరక్షణ విషయంలో భారతదేశం అమెరికాపై ఆధారపడేలా చేసి, దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకొని, తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా భారతదేశాన్ని వినియోగించుకోవాలని అమెరికా ప్రయత్నం చేస్తున్నది. అమెరికాతో చేసుకున్న ఒప్పందాలు ఆ దేశ ప్రయోజనాలను ముందుకు తీసుకుపోయేవి మినహా మనకు ఒరిగేది శూన్యం.

అమెరికా పార్లమెంటును ఉద్దేశించి చేసిన ప్రసంగంలో 'ప్రభుత్వ ప్రోత్సాహిస్తున్న టెర్రరిజంపై పోరాడటంలో ఎటువంటి మినహాయింపులూ ఉండరాదని, ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు అనుగుణంగా ప్రపంచదేశాలు వ్యవహరించాలని, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని' మోడి పేర్కొన్నాడు. ఆర్‌ఎస్‌ఎస్ క్రియాశీల కార్యకర్తగా, బిజెపి ప్రతినిధిగా మోడి నేతృత్వంలో భారతదేశం ఈ అంశాలన్నింటిలోనూ అట్టడుగు స్థాయికి పడిపోతున్నదన్న విషయం కప్పిపెట్టి, 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్న చందంగా ప్రపంచానికి ఉపదేశాలు చేయటంలో మాత్రం ముందుంటున్నారు.

మానవహక్కులకు సంబంధించి మోడి ప్రభుత్వ రికార్డు అత్యంత అధ్వాన్నంగా ఉన్నది. గత తొమ్మిది సంవత్సరాలలో ఈ పర్యటన సందర్భంగా మాత్రమే ఒకే ఒక్క మీడియా సమావేశం జరిగింది. ఆ సమావేశంలో భారతదేశంలో మనవహక్కుల పరిస్థితిపై అమెరికా విలేకరి అడిన ప్రశ్నకు మోడి సూటిగా సమాధానం చెప్పలేకపోయాడు.

ఈ పర్యటన సందర్భంగా ఇది వ్యూహాత్మక భాగస్వామ్యం, ఉభయుల ప్రయోజనాల పరిరక్షణ కోసమని పేర్కొంటున్నారు. గతంలో వలె చైనా శాంతియుతంగా ఉండేకాలం ముగిసిందని, ఇపుడు ఉభయదేశాల మధ్య శతృత్వం పెరుగుతున్నదని, అందువలన అమెరికా-భారత్‌ల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరం ఏర్పడిందని చెబుతున్నారు. అమెరికాతో అంటకాగటానికి, ఆ దేశపు సైనికభాగస్వామ్య ఉచ్చులో చిక్కుకోవటానికి ఇది సాకు మినహా చైనా నుంచి ప్రమాదం అంటూ చేస్తున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదు. చైనా ఈనాటికీ తన ఇరుగుపొరుగు దేశాలతో శాంతియుత సంబంధాలనే కొనసాగిస్తున్నది. మన దేశానికి, చైనాకు మధ్య సరిహద్దు సమస్య ఉన్నది. దీనిని శాంతియుతంగా పరిష్కరించుకుంటామని ఉభయదేశాలూ చెబుతున్నాయి. అయితే సరిహద్దులలో చెదురు మదురుగా ఉభయ సైనికదళాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. వీటికి చైనా లేదా భారతదేశాలలో ఏదో ఒక దేశమే కారణం కాదు. సరిహద్దులు అస్పష్టంగా ఉన్న పరిస్థితులలో ఒక్కోసారి ఒక్కో కారణంతో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఆ సమస్యలను పరిష్కరించుకోవటం కోసం సైనికాధికారులు, మంత్రుల స్థాయిలో ఏర్పడిన సంయుక్త యంత్రాంగం ద్వారా ప్రయత్నం చేస్తున్నారు.

అమెరికాతో భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్యం నెరపటం అనేది మన దేశ ప్రయోజనాలకు ఏ మాత్రం దోహదం చేయదు. అమెరికా ప్రపంచంలోని వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాలను తన సైనికశక్తితో బెదిరించి, భయపెట్టి దోపిడీ చేస్తున్నది. తన ప్రయోజనాకు అనుగుణంగా లొంగి వుండటానికి అంగీకరించని దేశాలపై సైనికదాడులకు పూనుకొని, ఆ దేశాలను సర్వ నాశనం చేస్తున్నది. ఇరాక్, సిరియా, లిబియా తదితర దేశాలను ఆ విధంగానే నాశనం చేసింది. ఇరాన్, వెనిజులా, ఉత్తరకొరియా లాంటి తన మాట వినని దేశాలను బెదిరిస్తున్నది. అమెరికా అనేక సందర్భాలలో మనదేశాన్ని కూడా బెదిరించింది. మనదేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించింది. మనం స్వంతంగా అణుశక్తిని, ఆయుధాలను

**❝ రెండు మాసాల నుండి మణిపూర్‌లో హత్యలు, గృహ దహనాలు, అల్లర్లు జరుగుతున్నాయి. జాతుల మధ్య రగిలిన ఘర్షణలలో ఇప్పటికి 130 మందికి పైగా మరణించారు. వెయ్యిమంది వరకు గాయాల పాలయ్యారు. వేలాది మంది నిరాశ్రయులుగా మిగిలారు. రాష్ట్రం, కేంద్రాలలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు ఈ ఘర్షణలను నివారించటానికి, రాష్ట్రంలో శాంతి యుత పరిస్థితులను నెల కొల్ప టానికి ప్రయత్నం చేయకపోగా, ఈ ఘర్షణలకు మరింతగా ఆజ్యం పోశాయి. ❞**

అభివృద్ధి చేసుకోవటాన్ని సహించలేక ఆంక్షలు విధించింది. మనల్ని తన సైనికవ్యూహంలో బంధించి, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న చైనాను బెదిరించటం, ఘర్షణలు పెంచటంలో మనదేశాన్ని పావుగా వినియోగించు కోవటానికి అమెరికా, సామ్రాజ్యవాద అనుకూల శక్తులు వ్యూహాత్మక భాగస్వామ్యం అనే అంశాన్ని ముందుకు తెస్తున్నాయి. వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఉన్న దేశాలు ఏ పనిచేసినా ఉభయులకూ ప్రయోజనకరంగా ఉండాలి. కాని అమెరికా దురాక్రమణ విధానం, వివిధ దేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోవటం మన దేశానికి ఏ విధంగా ప్రయోజనం కల్పిస్తాయి? ప్రపంచ ప్రజలను దోపిడి చేయటంలో అగ్రస్థానంలో ఉన్న దేశం అమెరికా. ఆ దోపిడీకి గురవుతున్న దేశాలలో మనదేశం కూడా ఉన్నది. దోపిడీ చేస్తున్న దేశం, దోపిడీకి గురవుతున్న దేశం వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నాయంటే దాని అర్థం స్పష్టమే. దోపిడీ చేస్తున్న దేశానికి దోపిడీకి గురవుతున్న దేశం మరింతగా లొంగిపోయిందనే. ప్రస్తుతం మోడి ప్రభుత్వం కూడా ఆ విధంగా అమెరికాకు పూర్తిగా మోకరిల్లుతూ మనదేశ ప్రయోజనాలను బలిపెడుతున్నది. దీనిని కప్పిపుచ్చుకోవటం కోసం బైడెన్ ఆహ్వానించాడని, వైట్‌హౌస్‌లో విందు ఇచ్చారని, అక్కడి భారతీయులు మోడికి మద్దతుగా ప్రదర్శనలు చేశారని కట్టుకథలను ప్రచారం చేస్తున్నారు. ఒకదేశ ప్రధాని లేదా అధ్యక్షుడు మరో దేశానికి వెళ్ళినపుడు ఎవరికైనా ఈ మర్యాదలు జరుగుతాయి. దానిని పక్కన పెట్టి మోడి కాబట్టే ఈ మర్యాదలు జరిగాయని చెబుతూ తమ అల్పబుద్ధిని ప్రదర్శించుకుంటున్నారు. అమెరికాకు లొంగిపోవటం ముందు ముందు మనదేశానికి ఎంత ప్రమాదకరంగా పరిణమిస్తుందో ఈ వందిమాగధులు పరిగణనలోకి తీసుకోవటం లేదు. జాతీయోద్యమాన్ని వ్యతిరేకించిన, దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటం పట్ల ఏ మాత్రం నిబద్ధత లేని వారి నుండి ఇంతకన్నా ఏం ఆశించగలం?

**మండుతున్న మణిపూర్–ఫిడేలు వాయిస్తున్న అభినవ నీరో**

గత రెండు మాసాల నుండి మణిపూర్‌లో హత్యలు, గృహ దహనాలు, అల్లర్లు జరుగుతున్నాయి. అక్కడ జాతుల మధ్య రగిలిన ఘర్షణలలో ఇప్పటికి 130 మందికి పైగా మరణించారు. వెయ్యిమంది వరకు గాయాల పాలయ్యారు. వేలాది మంది కొంపా గోడుకోల్పోయి నిరాశ్రయులుగా మిగిలారు. రాష్ట్రం, కేంద్రాలలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు ఈ ఘర్షణలను నివారించటానికి, రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులను నెలకొల్పటానికి ప్రయత్నం చేయకపోగా, ఈ ఘర్షణలకు మరింతగా ఆజ్యం పోశాయి. విశ్వగురు అని భజనలు చేయించుకుంటున్న మోడి ఈ ఘర్షణలపై కనీసం ప్రకటన చేయటానికి కూడా ధైర్యం చేయలేదు. ఇటువంటి పరిస్థితుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన హోంమంత్రి అమిత్‌షా తన అసమర్థతను బయట పెట్టుకున్నాడు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వాలే అధికారంలో ఉంటే రాష్ట్రాలు శరవేగంగా అభివృద్ధి అవుతాయని బిజెపి చేస్తున్న ప్రచారంలోని డొల్లతనాన్ని మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలు వెల్లడిస్తున్నాయి. బిజెపి నాయకత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వాల వలన మణిపూర్ ఆరని కుంపటిగా మారింది.

మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ ప్రారంభం కావటానికి, కొనసాగటానికి బిజెపి, కేంద్ర, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాలే కారణం. ఈశాన్యప్రాంతంలోని సరిహద్దు రాష్ట్రం, సున్నితమైన ప్రాంతాలలో ఒకటైన మణిపూర్‌లో తమ హిందుత్వ విధానాలను ముందుకు తీసుకుపోవటానికి బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రయత్నం చేయటమే ఈ ఘర్షణలకు మూలం. బిజెపి ప్రభుత్వం, ఆ పార్టీ నాయకత్వంలో వివిధ ఉన్న సంఘాలు రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న మెయిటీలు, మైనారిటీలుగా ఉన్న కుకీల మధ్య ఉన్న విభేధాలను కావాలని పెంచాయి. వారిరువురి మధ్య ఉన్న జాతిపరమైన వైరాన్ని ఉపయోగించుకున్నారు. మెజారిటీగా ఉన్న మెయిటీలు ఎక్కువ మంది హిందువులు కాగా, మైనారిటీగా ఉన్న కుకీలు క్రైస్తవులుగా ఉన్నారు. మతపరమైన ఈ విభజనను ఆధారం చేసుకొని హిందుత్వవాదులు మారణకాండకు కావలసిన పథకం రూపొందించారు. ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వ కనుసన్నలలో ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి అరాచకమూకలు ఈ మారణకాండను కొనసాగిస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి బిరెన్‌సింగ్ ప్రత్యక్షంగానే కుకీలపై వ్యతిరేకతను రెచ్చగొడుతున్నాడు. వారు విదేశీయులని, చట్ట విరుద్ధ వలసవాదులని, రాష్ట్రంలో చట్ట వ్యతిరేకంగా నివాసం ఉంటున్నారని ముఖ్యమంత్రి బహిరంగంగా చెబుతున్నాడు. వారు గంజాయిని సాగుచేస్తున్నారని, మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్నారని ప్రచారం చేస్తున్నాడు. అటవీభూములలో అక్రమంగా ఉంటున్నారని, కుకీ తెగకు చెందిన వారందరూ నేరస్తులేనన్నట్లుగా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నాడు. ఇంఫాల్ లోయలోని కుకీల నివాస ప్రాంతాలన్నింటినీ ధ్వంసం చేశారు. మెయిటీలు మెజారిటీగా ఉన్న జిల్లాల సరిహద్దులలోని కుకీల నివాసప్రాంతాలను కూడా ధ్వంసం చేసి, తగులబెట్టారు. మణిపూర్ పోలీసులు కుకీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.

ప్రతిపక్షాలు, సామాన్యప్రజలే కాకుండా, మెయిటీలలో కొందరు, బిజెపి నాయకులలో కొంతభాగం కూడా ప్రభుత్వం పక్షపాతంతో కుకీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని, వారిపై జరుగుతున్న మారణకాండకు మద్దతిస్తున్నదని భావిస్తున్నారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండ ఒక జాతిని

> “ దేశంలో మతం, ఆచారాలు, సాంప్రదాయాలు తదితరాల ప్రాతిపదికపై ప్రతి మతానికి చెందిన వారికి వర్తించే పర్సనల్ చట్టాలు ఉన్నాయి. ఆయా మతాలలోని ప్రజలు వాటిని పాటించటం నిర్బంధమేమీ కాదు. ఇష్టమైనవారు వారి మతం చెప్పిన అంశాలను పాటించవచ్చు. లేదా పాటించకపోవచ్చు. ఈ విషయంలో వారి మతపరమైన ఆచారాలు, సాంప్ర దాయాలది పాత్ర మినహా చట్టపరంగా వాటిని పాటించాలనే నిబంధనలు లేవు. ”

హననం చేయాలనే లక్ష్యంతో జరుగుతున్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి కుకీలకు వ్యతిరేకంగా పక్షపాతంతో పని చేస్తున్నాడని రాష్ట్రంలోని బిజెపి ఎంఎల్ఎ లలో ఒకరైన పావోలీన్‌లాల్ హావోకిప్ ద వైర్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. ఈ విధంగా మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, మైనారిటీలపై దాడులు చేయించే తమ కార్యక్రమంలో భాగంగా బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు ఈ హింసాకాండను బహిరంగంగా ప్రోత్సహిస్తు న్నాయి. అందువలన ఈ హింసాకాండ ఆగాలంటే మెయిటీ, కుకీలన్న విభేదం లేకుండా మొత్తం మణిపూర్ ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా నిలబడాలి. ఘర్షణకు పాల్పడుతున్న వారిని ప్రతిఘటించాలి. అసమర్ధ బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వాలను నిలదీసి, అవి శాంతిస్థాపనకు పూనుకోక తప్పని పరిస్థితిని కల్పించాలి. ఆ విధంగా రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులను ఏర్పరచటానికి కృషిచేయాలి.

### భారతదేశ వైవిధ్యంపై దాడి చేస్తున్న ప్రధాని

పార్లమెంటు ఎన్నికలు కనుచూపుమేరలోకి రావటం, ఐదు రాష్ట్రాల శాసనసభలకు జరగాల్సిన ఎన్నికల సమయం సమీపిస్తుండ టంతో ప్రజల మధ్య విద్వేషాలను పెంచే విభజన వాదానికి మోడి పదును పెడు తున్నాడు. జూన్ 27వ తేదీన మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన సభలో ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే ప్రతిపక్షాలు దానిని అడ్డుకుంటు న్నాయని మోడి ఆరోపించాడు. “ ఉమ్మడి పౌరస్మృతి పేరుతో ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొడు తున్నాయి. రెండు రకాలైన చట్టాలతో దేశం ఎలా నడుస్తుంది? రాజ్యాంగంలో కూడా సమాన హక్కులను గురించి చెప్పారు. సుప్రీంకోర్టు కూడా ఉమ్మడి పౌరస్మృతిని అమలు జరపమని చెప్పింది'' అని ప్రధాని పేర్కొన్నాడు. ఆర్ఎస్ఎస్, బిజెపిల భావజాలాన్ని ముందుకు తీసుకుపోవటానికి, ప్రత్యర్ధులపై తప్పుడు ఆరోపణలు చేయటానికి ప్రధాని ఎంతకైనా దిగజారతాడని ప్రధాని వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ముస్లింలకు దేశంలో ప్రత్యేక చట్టాలు అమలు జరుగుతున్నాయనే తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రజలను రెచ్చగొడుతున్న ఆర్ఎస్ఎస్-బిజెపిలు ఎవరో ప్రజలను రెచ్చగొడుతున్నారని అబద్ధాలను ప్రచారంలో పెడుతున్నాయి.

దేశంలో మతం, ఆచారాలు, సాంప్రదాయాలు తదితరాల ప్రాతిపదికపై ప్రతి మతానికి చెందిన వారికి వర్తించే పర్సనల్ చట్టాలు ఉన్నాయి. ఆయా మతాలలోని ప్రజలు వాటిని పాటించటం నిర్బంధమేమీ కాదు. ఇష్టమైనవారు వారి మతం చెప్పిన అంశాలను పాటించవచ్చు. లేదా పాటించకపోవచ్చు. ఈ విషయంలో వారి మతపరమైన ఆచారాలు, సాంప్రదాయాలది పాత్ర మినహా చట్టపరంగా వాటిని పాటించాలనే నిబంధనలు లేవు. వ్యక్తులు వారి ఇష్టాన్ని అనుసరించి మతాచారాలు, సాంప్రదాయాలను పాటించటం ఉంటుంది. అటువంటివి ఇతర మతాలతో పాటు హిందుమతంలో కూడా ఉన్నాయి. హిందుమతాన్ని ఆచరించేవారు తమ వ్యక్తిగత ఇష్టాయిష్టాలను బట్టి ఆచారాలు, సాంప్రదాయాలను అనుసరించటం ఉంటుంది. మహిళలకు బొట్టు, గాజులు, మంగళసూత్రాలు తదితరాలు ఉన్నాయి. పెళ్ళిళ్ళు, కుటుంబాలలో ఇతర వేడుకలు జరిగేటపుడు సాంప్రదాయాలు, ఆచారాలను పాటించేవారితో పాటు పాటించనివారు కూడా ఉన్నారు. అవి వారి వ్యక్తిగతమైనవి మినహా తప్పనిసరిగా ఆచరించాల్సినవి కాదు. అందువలన ముస్లిం మతాన్ని అనుసరించేవారికి ఏవో ప్రత్యేకమైన చట్టాలున్నట్లుగా ప్రధాని, ఆర్ఎస్ఎస్, బిజెపి చేస్తున్న ప్రచారం పూర్తిగా తప్పు.

దేశంలోని ప్రజలందరికీ ఒకే చట్టం ఉండాలని ప్రచారం చేస్తున్న వీరు హిందుమతంలో ఉన్న అసమానతలను రూపుమాపటాన్ని గురించి మాత్రం మౌనం పాటిస్తున్నారు. హిందుమతం అనుసరిస్తున్న ప్రజలలో దళితులు, గిరిజనులు, మరికొన్ని తరగతుల ప్రజలు తమ దేవుడు ఉన్న దేవాలయాలోకి ప్రవేశించకూడదు. ప్రవేశించటానికి ప్రయత్నిస్తే వారిపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతాయి. వారిని హత్య చేయటానికి కూడా అదేమతంలోని వారు ఏ మాత్రం సందేహించటం లేదు. పై కులాల వారు దిగువ కులాల వారిని ఇళ్ళలోకి రానివ్వరు. వారిని అంటుకోరు. వారిచ్చిన మంచినీళ్ళు కూడా తాగరు. ఒకే కులానికి చెందినవారు మాత్రమే దేవాలయాలలో పూజాదికాలు నిర్వహిస్తారు. మిగతా వారు గర్భగుడిలో ప్రవేశించటానికి కూడా అర్హులు కాదు. అంతేకాక వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలలో భిన్న జాతుల ప్రజలు విభిన్నమైన ఆచారాలు, సాంప్రదాయాలను అనుసరిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొస్తామని ఉద్రిక్తతలను రెచ్చగొట్టటం సంకుచిత రాజకీయ ప్రయోజనాల సాధనకు మినహా సామాజికాభివృద్ధికి దోహదం చేయదు.

ప్రజలెదుర్కొంటున్న సమస్యలైన అధికధరలు, నిరుద్యోగం, దేశ ఆర్థికాభివృద్ధి క్షీణించటం, కేంద్ర ప్రభుత్వం ప్రజలపై నిరంతరం భారాలు మోపటం, అదాని కుంభకోణం, అమెరికన్ సామ్రాజ్యవాదులకు లొంగిపోవటం తదితరాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించటానికి, ప్రజల మధ్య దూరాన్ని పెంచి, తమ హిందుత్వ విధానాలను ముందుకు తీసుకుపోవటానికి ఇటువంటి సమస్యలను ముందుకు తీసుకొస్తున్నారు. మతోన్మాదులు చేస్తున్న ఈ విచ్ఛిన్నకర విధానాలను కుల, మతాలతో నిమిత్తం లేకుండా భారతీయులందరూ ఐక్యంగా తిప్పికొట్టాలి.

❋

# హద్దులేని ప్రైవేటు టెలికాం సంస్థల అక్రమాలు

**రాహుల్ వర్మ**



**రచయిత ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకులు.**

**(రాహుల్ వర్మ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకులు. అక్కడ కార్పొరేషన్‌లు, నయా-ఉదారవాద విధానాలను గురించి బోధిస్తుంటారు. భారతదేశంలో టెలికం పని విధానం గురించి ఆయన రాస్తున్న పుస్తకంలో ఈ వ్యాసం ఒక భాగం.)**

గత మూడు దశాబ్దాలలో భారతదేశంలో టెలికాం రంగం సాధించిన విజయాలు, – సైద్ధాంతిక, రాజకీయ విబేధాలకతీతంగా – దేశం సాధించిన ఘనవిజయంగా దేశంలోని పాలక వర్గాలన్నీ చెప్పుకుంటుంటాయి. ఈ రోజు వర్గం, కులం, జాతి, వయసు, లింగ బేధాల కతీతంగా ప్రజలందరి చేతుల్లోకి ఫోన్ చేరింది. బహుశా భారతదేశం అంతటిని కలిపింది ఒక్క ఫోన్ అంటే అతిశయోక్తి కాదు. దీనిని గమనించిన వారందరు ఇదో "అద్భుతం" అంటున్నారు. కోవిడ్ మహమ్మారి వ్యాపించిన రోజుల్లో తప్పనిసరిగా మనతో ఉండవలసిన ఒక అనివార్యమైన వస్తువుగా సెల్‌ఫోన్ మారింది – ఆక్సిజెన్, ఆహారం, మందులు, విద్య – ఏది కావలసి వచ్చినా ఫోన్ పక్కనుండడం తప్పనిసరి.

దేశం మారుమూలలకి కూడా ఫోన్ ఎంతగా చేరిపోయిందంటే ఆ వ్యాప్తిని పోల్చదగినది మారేదీ లేదంటే అతిశయోక్తి కాదు. ఒకవైపు దేశంలో ఆరోగ్య సేవలు ప్రజలందరికి ఇంకా అందుబాటులోకి రావలసే ఉంది. ఇంకా బహిరంగ ప్రదేశాలలో మల విసర్జన జరుగుతూనే ఉన్నది. సాధారణ ప్రజానీకానికి తాగునీటి సౌకర్యం చేరువ కాలేదు. కానీ మొబైల్ ఫోన్లు మాత్రం భారతదేశంలో 88 శాతం జనాభాకి అందుబాటులోకి వచ్చాయి. 2020 నాటికి భారతదేశంలో రూ. 500 లకి 4 జి సేవలు లభ్యం అవుతున్నాయి. టెలికం రెగులేటర్ అథారిటీ 2018లో ఒక గిగా బైట్ వైర్లెస్ డేటాని కేవలం రూ. 12 కు ఇవ్వగలమని ప్రకటించింది. ప్రపంచంలోనే ఇది అత్యంత తక్కువ ధర అయి ఉంటుంది. నిజానికి 2014లో దీని ధర దాదాపు రూ.240. 1994లో ఫోన్ ధర రూ. 40,000. ఆ ధరను సామాన్యుడు చెల్లించే స్థితి ఉండేది కాదు, ఒక్క నిమిషం మాట్లాడడానికి రూ. 18 ఖర్చయ్యేది. అందువలన సామాన్యులకి మొబైల్ అందుబాటులో ఉండడం ఊహించలేని విషయం. కేవలం ధనికులే మొబైల్స్ వాడగలిగే పరిస్థితి ఉండేది.

ఈ విజయానికి ప్రధానమైన కారణం ప్రైవేటు పెట్టుబడి అని – ప్రభుత్వాల గందరగోళాలు, అవినీతి, కోర్టుల వద్ద ఉన్న అసంపూర్ణ సమాచారం మధ్య – మనకు చెపుతుంటారు. నేనీ విషయం మరింత లోతుగా పరిశీలించి, మూడు దశాబ్దాల టెలికాం విభాగం సాధించిన ఘనవిజయాలు తెలియచేస్తాను. అదే సమయంలో ఒక ప్రశ్న లేవనెత్తదలుచుకున్నాను: భారతదేశంలో టెలికాం పరిశ్రమ సాధించిన అద్భుత విజయాలను చూసినప్పుడు, బడా పెట్టుబడి నైజం గురించి మనం ఏమి తెలుసుకున్నాము?

భారతదేశం నయా–ఉదారవాద విధానాల అమలును మొదలు పెట్టిన 1980 దశకం తప్పటడుగులు వేస్తూనే ముందుకు సాగించింది. 1990లలో మాత్రమే వేగం పుంజుకుంది. ప్రైవేటు పెట్టుబడికి ఆహ్వానం పలికిన పరిశ్రమలలో టెలికాం పరిశ్రమ మొదటిది. ప్రైవేటు పెట్టుబడిని ఆహ్వానించడం వలన మార్కెట్ శక్తులు ఈ రంగంలో క్రమశిక్షణ, సమర్థత, సృజనాత్మకత తీసుకొస్తాయని భావించడం జరిగింది. కానీ జరిగింది అందుకు భిన్నం. ఉచ్ఛస్థితిలో ఉన్న ఆర్థికవ్యవస్థ స్వేచ్ఛ పేరుతో గుత్త పెట్టుబడి ఆధీనంలోకి వెళ్ళిపోయింది. నయా – ఉదారవాద విధానాలు అమలు చేయడం అంటే, రాజ్యం దేశంలోని ఏ వ్యవస్థలలో అయినా, ఏరకమైన నియమ నిబంధనలు లేకుండా ప్రైవేటు పెట్టుబడికి స్వేచ్ఛగా వదిలేయడం. మార్కెట్‌కి పూర్తి 'స్వేచ్ఛ' నివ్వడం.

నయా – ఉదారవాద విధానాలలో పనిచేసే ఈ రకమైన గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థలో మనకు కనిపించే మూడు రకాల ధోరణుల గురించి ఇక్కడ మాట్లాడుకుందాం. ఒకటి, ఒక సంక్షోభం నుండి ఇంకో సంక్షోభానికి వెళ్లడం. ఆ మార్గంలో మరింత ఎక్కువ మందిని పేదరికంలోకి నెట్టడం. మరింత మందిని అత్యంత ధనవంతులను చేయడం. సాధారణంగా ఈ లాభాలు గుత్త అద్దెల వలనో, సట్టా వ్యాపారాల వలనో వచ్చి పడ్డవేగాని అమ్మకాలు పెరిగినందువల్ల కాదు. రెండు, గుత్త పెట్టుబడిదారులు నయా–ఉదారవాద విధానాల వల్ల అతి తక్కువ సమయంలో లాభాలు ఆర్జించడానికి ప్రధానమైన కారణం ప్రభుత్వ ఆస్తులను కారుచవకగా వశపరచుకోవడం – అవి ప్రభుత్వ ఆస్తులు అయినా, సహజ సంపదలైన – భూమి, గనులు, స్పెక్ట్రమ్ లాంటివి అయినా అయుండొచ్చు. మూడు, గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారులు ధరల నిర్ణేతలే గాని, అనుసరించేవారు కాదు. ధరలు వారికి తక్షణ లాభాలు తెచ్చేవిగా నిర్ణయించబడడమే కాదు, దీర్ఘ కాలంలో కూడా తమ లక్ష్యాలు చేరుకునేందుకు దారులు వేసేవిగా కూడా ఉండాలి. అందువల్ల కీలకమైన సమయాల్లో గుత్త పెట్టుబడి, లాభాలు ఇబ్బడిముబ్బడిగా ఆర్జించడానికి ధరలను అత్యధికంగా నిర్ణయిస్తుంది. ధరలను తమ చేతిలో వజ్రాయుధంగా ఉపయోగిస్తుంది. ఒక్కొక్కసారి ప్రత్యర్థులను నాశనం చేయడానికి ధరలు అతి తక్కువగా నిర్ణయించి, నష్టాలు భరించడానికి కూడా వెనుకాడదు. భారత దేశంలో బడా

పెట్టుబడిదారులు టెలికం రంగాన్ని తమగుప్పెట్లోకి తెచ్చుకోడానికి ప్రేరణ దానిపై గుత్తాధిపత్యం సాధించాలనే తపన, సట్టా వ్యాపారం చేయాలనే కాంక్ష. కానీ సాధారణ ప్రజానీకం జీవితాలలో ఫోన్లు ఎంత ప్రాధాన్యత సంతరించు కున్నాయంటే , వీటిపై ఆధారపడడానికి ఎంతగా అలవాటు పడ్డారంటే, ఫోన్ల వాడకం వారి జీవితాలలో విడదీయరానిదయింది. అందువలనే టెలికం రంగంలో వచ్చే మార్పుల పర్యవసానాలు ప్రజల జీవితాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపబోతున్నాయి.

> **“ టెలికాం రంగంలోకి అడుగు పెట్టినవారిలో చాలా మంది విఫలం అవడానికి ప్రధాన కారణం టెలికాం పరిశ్రమ లోని కొన్ని ప్రత్యేకతలు కావచ్చు. ఆనాటి ప్రభుత్వాల 'దుష్ట' విధానాలు కావచ్చు. లేదా రెండూ కావచ్చు. మొదట్లో వచ్చిన పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు పలాయనం చిత్తగిస్తు న్నా కొత్తవారు ఎందుకు వస్తున్నారు? వ్యాపార దిగ్గజాలు ఈ రంగంలోకి అడుగు పెట్టడానికి అవిశ్రాంతంగా ప్రయత్నాలు కొనసాగిస్తు న్నాయి. ”**

### బడా పెట్టుబడిదారుల చర్యలు, పేరణ

టెలికం పరిశ్రమలోకి నిరంతరంగా భారతదేశ, విదేశీ పెట్టుబడిదారులు వస్తూ పోతూనే ఉన్నారు. గత ముప్పై ఏళ్లలో దాదాపు ప్రతి భారతీయ, విదేశీ బడా పరిశ్రమలు టెలికాం రంగంలోకి ప్రవేశించాయి. ఈ రంగం నుండి చాలా పరిశ్రమలు బయటకి వెళ్లాయి కూడా. 1991 నుండి ఐ ఎం ఎఫ్ కను సన్నలలో భారతదేశంలో నయా-ఉదారవాద విధానాలు అమలవడం మొదలయింది. నాలుగు మహానగరాలలో – ముంబై, ఢిల్లీ, కలకత్తా, చెన్నై – సెల్యూలర్ సేవలు మొదలయ్యాయి. 1995 ఆగస్టు నుండి ఆ మహా నగరాలలో ఇద్దరు ఆపరేటర్లు తమ కార్యకలాపాలు ప్రారంభించారు. అప్పటి నుండి గత 25 ఏళ్లలో ముప్పైకి పైగా కంపెనీలు రకరకాల సమూహాలుగా – టెలికాం లైసెన్సులను కైవసం చేసుకోడానికి రకరకాల కార్పొరేట్ కలయికలు – ఏర్పడ్డాయి. అయితే చాలావరకు వెనక్కు తగ్గాయి. ఒక్క భారతి ఎయిర్‌టెల్ మాత్రమే నిలదొక్కుకో గలిగింది. అప్పటికి ఎయిర్‌టెల్ పుష్ బటన్ ఫోన్స్ తయారు చేస్తూ ఉండింది. అది భారత బడా పెట్టుబడిదారులలో భాగం కాదు. 1997 కల్లా భారతదేశంలోని అతి పెద్ద వ్యాపార సంస్థలు – టాటాలు, ఆదిత్య బిర్లా, మోడీ, గోయెంకా, థాపర్, ఎస్కార్ట్స్, ఎస్సార్, మాక్స్ వగైరాలు– టెలికం రంగంలోకి ప్రవేశించాయి. అప్పుడున్న 23 సర్కిల్స్‌లోని 19 సర్కిల్స్‌లో టెలికాం సేవలు అందించడానికి వేలంలో లైసెన్సులు చేజిక్కించుకున్నాయి. విదేశాలలో వ్యాపారాలు చేస్తున్న హిందుజాలు, ఆ తరువాత రిలయన్స్, వీడియోకాన్ సంస్థలు 1990 లలో ఇక్కడ వ్యాపారాలు మొదలు పెట్టాయి. భారతదేశ వ్యాపార సంస్థలన్నిటికీ విదేశీ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. అలా ప్రపంచ టెలికాం కార్పొరేట్లు దేశీయ మార్కెట్లోకి అడుగు పెట్టారు. ఉదాహరణకి ఏ టి అండ్ టి ,ఎన్ టి టి (జపాన్ ) ఫ్రాన్స్ టెలికం, టెలినార్, స్విస్ కోమ్, బెల్, హచిన్‌సన్ వాంపో, తెల్స్ట్రా, సింగ్ టెల్, టెలికం మలేసియా వంటివి 1990ల చివరి భాగంలో దేశీయ సంస్థలతో కలిసి వ్యాపారాలు చేసుకోడానికి సిద్ధపడ్డాయి. విదేశీ కంపెనీలన్నిటిలోను వొడాఫోన్ మాత్రమే నిలబడి తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. అయితే అది మొదలు పెట్టినప్పుడు భాగస్వామ్యం గల ఆర్ పి జి తో ఇపుడు కలిసిలేదు.

టెలికాం రంగంలోకి అడుగు పెట్టినవారిలో చాలామంది విఫలం అవడానికి ప్రధాన కారణం టెలికాం పరిశ్రమలోని కొన్ని ప్రత్యేకతలు కావచ్చు. ఆనాటి ప్రభుత్వాల 'దుష్ట' విధానాలు కావచ్చు. లేదా రెండూ కావచ్చు. మొదట్లో వచ్చిన పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు పలాయనం చిత్తగిస్తున్నా కొత్తవారు ఎందుకు వస్తున్నారు? వ్యాపార దిగ్గజాలు ఈ రంగంలోకి అడుగు పెట్టడానికి అవిశ్రాంతంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఇందుకు కొన్ని ఉదాహరణలు చెప్పుకోవచ్చు.

### ప్రభుత్వ ఆస్తులు కైవసం చేసుకుని తక్షణ లాభాలు పొందగలమన్న ఆశ

1990లలో టెలికాం రంగం పెట్టుబడి ఆధారిత రంగంగా ఉండేది. ఈ రంగంలో ఎప్పటికప్పుడు సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతూ ఉండేది. యాంత్రీకరణలో వెనకబడిన, సాంకేతిక పరిజ్ఞానం లేని భారతదేశం లాంటి చోట పనిచేయాలంటే మదుపరులు దీర్ఘకాల పెట్టుబడులు పెట్టడానికి, సమర్ధవంతంగా పోటీలో నిలబడడానికి సిద్ధంగా ఉండాలి. కానీ ఏ ఒక్క ప్రైవేటురంగ పరిశ్రమ కూడా ఇటువంటి శైశవ దశలో ఉన్న కీలక రంగానికి అవసరమైన పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా లేదు. ప్రభుత్వానికి, విదేశీ పెట్టుబడిదారులకు మధ్య మధ్యవర్తులుగా ఉండి, లైసెన్సులు పొందాలన్న ఆరాటం మాత్రమే వారిలో కనిపించింది. వారికున్న అనేక సంస్థలకి టెలికాం రంగాన్ని ఒక అదనపు సంస్థగా చేసుకోవాలని, తద్వారా అనూహ్య లాభాలు సొంతం చేసుకోవాలనే తాపత్రయం మాత్రమే భారతదేశ పెట్టుబడిదారులలో కనిపించింది. వారి వాటాలు కొనడానికి తగిన దేశీయ, లేదా విదేశీ సంస్థలు అందుబాటులోకి రాగానే అనేక సంస్థలు ఈ రంగం నుండి తప్పుకున్నాయి. దీనికి తోడుగా ఆనాడు నయా–ఉదారవాద విధానాలు తీవ్రంగా అమలవుతున్న నేపథ్యంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సునాయాసంగా ఈ రంగంలోకి ప్రవేశించగలిగింది. లైసెన్సులు తీసుకున్న 23 సంస్థలకి ఆచరణీయమైన ప్రణాళికలు లేకపోవడం ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నది. ఈ సంస్థలలో కనీసం ఎనిమిది సంస్థలు విపరీతమైన నష్టాలు మూటకట్టుకున్నాయి. కనీసం అవి తాము చెల్లించిన లైసెన్స్ ఫీజు కూడా సంపాదించుకోలేక పోయాయి. ప్రభుత్వం లైసెన్సు ఫీజుగా పెద్ద మొత్తం వసూలు చేయడం అన్యాయమని ఫిర్యాదు చేశాయి. వీరంతా భారతదేశంలోని అతి పెద్ద వ్యాపార సంస్థల అధిపతులు. ప్రపంచ దిగ్గజ టెలికం వ్యాపారులతో కలిసి వారు బరిలోకి దిగారు. ఈ సంస్థలు నష్టాలను సాకుగా చూపి లైసెన్స్ ఫీజు చెల్లించడం మానేశాయి. ఫీజు డిమాండ్ చేస్తే ప్రభుత్వం అన్యాయంగా తమ వద్ద వసూలు చేస్తోందని పిర్యాదులు చేయడం మొదలెట్టాయి. 1998లో ఈ పరిశ్రమ నెలకి రూ నాలుగు వేలకోట్ల నష్టాలు (లాభాల నుండి తరుగుదల తీసేసిన తరువాత, వడ్డీలు, పన్నులు చెల్లించిన తరువాత) చవిచూస్తున్నట్టు గగ్గోలు పెట్టాయి. ప్రభుత్వం వారికి రాయితీలు కల్పించాలని – లైసెన్సుల కాలం పొడిగించాలని, వసూళ్లు కొంత కాలం నిలిపేయాలని– డిమాండ్

> "మొదటి నుండి స్పెక్ట్రమ్ కేటాయింపులలో జరిగిన తప్పుల కారణంగా అవి వార్తలలోకి ఎక్కాయి - ఏమీ తెలియని వారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారు, సరైన అవగాహన లేని వారు లైసెన్సులలో ఎక్కువ వాటా పొందగలిగారు. వారి తాహతుకు మించి ఆ లైసెన్సులు పొడిగించుకుంటూ పోయారు. దానితో తీవ్రమైన నిరసనలు వ్యక్తమైనాయి. అంతులేని కోర్టు కేసులలో చిక్కుకోవడం జరిగింది."

చేశాయి. ఇవన్నీ 'దేశ ప్రయోజనాలు' అనే సాకును చూపాయి. ఒక అధికారి బిజినెస్ స్టాండర్డ్‌తో," మనం ఈ రంగాన్ని విదేశీయుల హస్తగతం చేశాం. బాగా అభివృద్ధి చెందిన దేశాలలో సహితం ఇలా జరగలేదు. టెలికాం రంగం దేశరక్షణలో అత్యంత కీలకమైనది. అది మన ఆధీనంలోనే ఉండాలి" అన్నారు. కార్యకలాపాలు మొదలైన అతి కొద్దికాలంలోనే దేశీయ ప్రైవేటు సంస్థలు తమ వాటాలను అమ్మేసాయి. లేదా కొనే వారి కోసం అర్రులు చాచాయి. ఉదాహరణకి ఎస్సార్ గ్రూప్‌కి చెందిన రుయాస్, మాక్స్ ఇండియాకి చెందిన అనలిజిత్ సింగ్, లేదా మోడీకార్ప్‌కి చెందిన బి.కె మోడీ లు అప్పటికే సెల్యూలర్ వ్యాపారంలో తమ వాటాలలో అత్యధిక శాతం అమ్మేసారు.

హచిన్‌సన్ వాంపోయానే చూద్దాం. ఇది హాంకాంగ్‌లో అతిపెద్ద పెట్టుబడి సంస్థ. ఇది 1998లో ముంబై సెల్యూలర్ కార్యనిర్వాకుని నుండి 68.6 శాతం వాటాలు కొనుగోలు చేయడం ద్వారా సొంతం చేసుకుంది. అంతకు ముందు వారికి 49 శాతం వాటాలు మాత్రం ఉండేవి. హచిన్‌సన్ ప్రత్యక్షంగా 49శాతం వాటాలు కొనుగోలు చేసి (అది విదేశీ పెట్టుబడిదారుల పరిమితి) మరో 49 శాతం టెలికాం ఇన్వెస్ట్‌మెంట్ ఇండియాలో పెట్టుబడి పెట్టాలని ప్రణాళిక రచించుకుంది. టెలికాం ఇన్వెస్ట్‌మెంట్ ఇండియాకి హుచ్ మాక్స్‌లో 40 శాతం పెట్టుబడి ఉంది. కోటక్ మహేంద్రకి టెలికాం ఇన్వెస్ట్‌మెంట్ ఇండియాలో 51శాతం వాటాలు ఉన్నాయి. హుచ్ మాక్స్‌లో మిగిలిన 11 శాతం మాక్స్ ఇండియావి, దానిని ప్రమోట్ చేసిన అంజిత్ సింగ్‌వి. అదే విధంగా స్విస్సుకం స్టెర్లింగ్ సెల్యూలర్ నుండి, అమెరికన్ ఇంటర్నేషనల్ గ్రూప్ మోదీకం నెట్‌వర్క్ నుండి అధిక మొత్తాలలో వాటాలు కొన్నాయి. ఇదే వరుసలో అనేక కంపెనీలు ఉన్నాయి. "కంపెనీలన్నింటి కోరిక ఒకటే-ధరలు పెంచి ప్రైవేటు సంస్థల లాభాలు పెంచాలి" అని ఒక సెల్యూలర్ కంపెనీ అధికారి చెప్పాడు. టెలికాం రంగంలో ప్రైవేటు పెట్టుబడులకు అనుమతులు ఇవ్వడానికి భారతదేశం సిద్ధపడిందన్న వార్త వెలువడగానే అదృశ్య అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు కుయుక్తులు ప్రారంభించాయి. ఉదాహరణకి 1997లో హాంగ్‌కాంగ్ వెంచర్, డిస్టాకం కమ్యూనికేషన్స్ భారతదేశ సెల్యూలార్ సేవా రంగంలో ''ప్రధాన భూమిక'' నిర్వహించాలని భావించి, హచ్ మాక్స్, మోడీ టెల్ స్ట్రా , మోడీ కామ్ నెట్ వర్క్లలో పెట్టుబడులు పెట్టింది. అదే సమయంలో అమెరికన్ ఇంటర్నేషనల్ గ్రూప్ టాటా టెలి సర్వీసెస్, టాటా కమ్యూనికేషన్స్, బి పి ఎల్ మొబైల్, మోడీకం నెట్‌వర్క్లలో పెట్టుబడులు పెట్టింది. అంటే టెలికాం రంగం ప్రైవేటీకరణకు తలుపులు తెరిచిన తొలి రోజుల్లో ప్రైవేటు కంపెనీలు అనేక జిమ్మిక్కులు చేశాయి. కంపెనీలు ఒకదానితో ఒకటి విలీనం అయిపోవడం, పేర్లు మార్చేసు కోవడం, లైసెన్సులు అమ్మేసుకోవడం వగైరా. ఇవేవి పనిచేయకపోతే మంచి లాభాలు వచ్చే సమయం చూసి వాటాలు అమ్మేసుకునే వారు. కోశిక, ఆర్ పి జి, ఉష మార్టిన్, స్పైస్-మోడీ తెలుస్త్ర, స్కై సెల్, ఏస్కోటెల్, జె టి మొబైల్, ఫేస్కేల్‌లను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఈ లావాదేవీలలో పెద్ద మొత్తాలలో లాభాలు ఆర్జించే వారు. ఈ మధ్యే బిజినెస్ స్టాండర్డ్‌లో వెలువడిన "ది స్మార్ట్ బాయ్స్ టు హిట్ జాక్‌పాట్" అనే వ్యాసంలో ఎస్సార్‌కి చెందిన రుయాస్, బి పి ఎల్ కి చెందిన చంద్రశేఖర్, (ప్రస్తుతం అయన మోడీ క్యాబినెట్‌లో మంత్రి). ఏస్కోర్స్‌కి చెందిన నందన్, శ్యాం గ్రూప్‌కి చెందిన బి కే మోడీ పేర్లు ఉన్నాయి. ఆసిన్ ఘోష్ వంటి సి ఇ ఒ లు కూడా ఇందులో ఉన్నారు.

### స్పెక్ట్రమ్ లైసెన్సులను రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చిన వైనం

టెలికాం రంగంలోకి కార్పొరేట్లు మూకుమ్మడిగా రావడానికి ప్రధాన కారణం స్పెక్ట్రమ్ వంటి సహజ వనరు కేంద్ర బిందువుగా ఉండడం. టెలికం సిగ్నళ్లు విద్యుదయస్కాంత తరంగాలు. ఇవి కొన్ని దారులలో మాత్రమే ప్రయాణించగలవు. ఈ బ్యాండ్ విడ్త్‌లోకి సేవలు అందుబాటులోకి తేవాల్సి ఉంటుంది. స్పెక్ట్రమ్ ద్వారా ఈ తరంగాలు ప్రయాణించగలవు. స్పెక్ట్రమ్ లేకుండా మొబైళ్ళు పనిచేయలేవు. ఇది ఒక సహజ వనరు. దీనిని తయారు చేయడం సాధ్యపడదు. ఇది కూడా పరిమిత మైన స్థాయిలోనే లభ్యం అవుతుంది. అది కూడా ప్రభుత్వాల ద్వారానే పొందగలుగుతారు. అందువలన ఇది ఈ పరిశ్రమలో లాభదాయకమైన వనరు. అయితే లాభం సంపాదించాలంటే దీనికి మంచి ధర చెల్లించే వారుండాలి. భారతదేశంలో స్పెక్ట్రమ్ ధర బాగా పలకడానికి కారణం ఇక్కడ టెలిఫోన్ వినియోగదారులు విపరీతంగా పెరుగుతుండడం. కొత్త కొత్త సేవలు అందుబాటులోకి వస్తుండడం. కొత్త సాంకేతిక పరిజ్ఞానం వలన 2జి నుండి 5జి కి అతి తొందరగా మారిపోయింది. అందువలనే స్పెక్ట్రమ్ అమ్మకాలపై మీడియాలో అంత పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి. పన్నులలాగే ప్రభుత్వానికి స్పెక్ట్రమ్ ఛార్జీలు చెల్లించాలి. అందువలన స్వేచ్ఛా మార్కెట్లో స్పెక్ట్రమ్ విలువ దాని డిమాండ్‌ను బట్టి నిర్ణయించబడాలి. స్పెక్ట్రమ్‌ని అమ్మేది ఒక్కరే. కొనేవాళ్ళు కూడా కొద్దిమందే ఉంటారు. సరైన ధర చెల్లించేవారిని అమ్మకందారుడు కనుగొన వలసి ఉంటుంది. అందువలనే అనేకమంది మధ్యవర్తులు, నిపుణులు చేరతారు. వారి స్వప్రయోజనాలు నెరవేర్చుకుంటారు. స్పెక్ట్రమ్‌ని అతి చౌక ధరకు దక్కించుకుని సరైన సమయం చూసి సట్టా వ్యాపారాల ద్వారా అత్యధిక లాభాలు ఆర్జించే వీలయినప్పుడు అమ్ముకుంటారు.

మొదటి నుండి స్పెక్ట్రమ్ కేటాయింపులలో జరిగిన తప్పుల కారణంగా అవి వార్తలలోకి ఎక్కాయి - ఏమీ తెలియని వారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారు, సరైన అవగాహన లేని వారు లైసెన్సులలో ఎక్కువ వాటా పొందగలిగారు. వారి తాహతుకు మించి ఆ లైసెన్సులు పొడిగించుకుంటూ పోయారు. దానితో తీవ్రమైన నిరసనలు వ్యక్తమైనాయి. అంతులేని కోర్టు కేసులలో చిక్కుకోవడం జరిగింది. స్పెక్ట్రమ్‌ను దక్కించుకోవటంలో రెండు రకాల కారణాలు కనిపిస్తాయి. మొదటిది, టెలికాం రంగంలో పెట్టుబడులు పెడితే స్వల్పకాలంలో అత్యధిక లాభాలొస్తాయన్న ఆశ. రెండు, ఈ లాభాల

పంట కూడా సమఉజ్జి సంస్థల పోటీలో సాధించినది కాదు. లైసెన్స్ పొందడంలో లాఘవాన్ని ప్రదర్శించడం, ఆ తరువాత రేటు బాగా వచ్చినప్పుడు సమయం చూసుకుని దానిని అమ్మేయడం.

ఇది 2జి స్పెక్ట్రమ్ అమ్మకాలలో స్పష్టంగా కనపడుతుంది. 2008లో స్పెక్ట్రమ్ కేటాయింపులు దేశం మొత్తం దృష్టిని ఆకర్షించింది. 2010లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ దేశ ఖజానాకి 1.76 లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. పదిహేనేళ్ల తరువాత కూడా టెలికం రంగంలో ఇది కళ్ళు చెదిరే మొత్తమే. మొదట దరఖాస్తు చేసుకున్నవారికి మొదటి ప్రాధాన్యత పద్ధతిలో 2001 ఖరీదుకు 2008లో 122 మందికి స్పెక్ట్రమ్ లైసెన్సులు మంజూరు చేశారు. ఇది దారుణం. ఎందుకంటే 2001లో కేవలం 40 లక్షల మంది వాడకందారులు మాత్రమే ఉన్నారు. కానీ 2008కి ఆ సంఖ్య డెబ్బై ఐదు రెట్లు పెరిగింది. స్పెక్ట్రమ్ కేటాయింపులు చేసే నాటికి వినియోగదారులు 30 కోట్లమంది అయ్యారు. ఇదీ ధరల భాగోతం. కొందరికి మేలు చేసేందుకు మొదట దరఖాస్తు చేసుకున్న వారికి మొదట కేటాయింపులు చేస్తామన్న నిర్ణయాన్ని ఏకపక్షంగా తీసుకున్నారని, నిబంధనలను తుంగలో తొక్కారని, గడువు తేదీని పొడిగించడం వగైరాలలో అనైతిక చర్యలకు ఒడిగట్టారని కాగ్ దుయ్యబట్టింది. టెలికాం శాఖ నిబంధనల ప్రకారం కేటాయింపులు పొందిన 122 మందిలో 85 మంది అర్హులు కారు. ఇంకా విచిత్రం, అత్యధిక లైసెన్సులు పొందిన వారు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకునే వారు. తాము చేస్తున్న సట్టా వ్యాపారాల కొనసాగింపుగా వారు ఈ వ్యాపారంలో చేరారు. భారతదేశంలో తగినంత మార్కెట్ లేదని, ధరలు అధికంగా ఉన్నాయని ఫిర్యాదులు చేసారు. బహుశా ప్రభుత్వం వారిని తగిన విధంగా ఆదుకుంటుందని భావించి ఉండవచ్చు.

> **"ఆ రోజు దేశంలోనే అతిపెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీ యునిటెక్. ఇది రూ. 1651 కోట్లతో 22 లైసెన్సులు కొంది. అయితే రెండు నెలల కాల వ్యవధిలోనే దాని వాటాలో 60శాతం టెలినార్‌కి రూ 6.2 వేలకోట్లకు అమ్మేసింది. అంటే 600 శాతం లాభం సంపాదించింది. అలాగే స్వాన్ టెలికం మరో రియల్ ఎస్టేట్ కంపెనీ. ఇది తన వాటాలో 45 శాతం కొన్న వెంటనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన ఎతిసలాత్‌కి రూ. 4,200 కోట్ల రూపాయలకు అమ్మేసింది."**

ఉదాహరణకి ఆ రోజు దేశంలోనే అతిపెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీ యునిటెక్. ఇది రూ. 1651 కోట్లతో 22 లైసెన్సులు కొంది. అయితే రెండు నెలల కాల వ్యవధిలోనే దాని వాటాలో 60శాతం టెలినార్‌కి రూ 6.2 వేలకోట్లకు అమ్మేసింది. అంటే 600 శాతం లాభం సంపాదించింది. అలాగే స్వాన్ టెలికం మరో రియల్ ఎస్టేట్ కంపెనీ. ఇది తన వాటాలో 45 శాతం కొన్న వెంటనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన ఎతిసలాత్‌కి రూ. 4,200 కోట్ల రూపాయలకు అమ్మేసింది – అది కొన్న ధర రూ. 1,537 కోట్ల రూపాయలు. శ్యామ్ టెలికం కూడా రష్యాకి చెందిన సిస్టమాకి భారీ లాభాలతో అమ్మింది. అంతేకాదు. స్వాన్, లూప్, డాట్కం వంటి సంస్థలు లైసెన్సులు చేజిక్కించుకుని, వాటిని బి పి ఎల్, రిలయన్స్, వీడియోకాన్ వంటి బడా సంస్థలకి అమ్మేసాయి. అందువలన కొన్ని ప్రాంతాలలో స్పెక్ట్రమ్ ఏకంగా 12 కంపెనీలకు అమ్మడం జరిగింది. ఇది లాభదాయకం కాదు. ఒకే ప్రాంతంలో అంత మార్కెట్ ఉండదు. పైగా ఈ రంగం పెట్టుబడి ప్రాధాన్యత కలిగిన రంగం. ఇందులో టెలికం సేవలు అందించడానికి తగిన విషయ పరిజ్ఞానం ఉండాలి. అందువలన అశాస్త్రీయ ధరల యుద్ధాలు, కొంతమంది మార్కెట్ నుండి బయటికి వెళ్లిపోవడం జరిగాయి. దేశంలో చెలరేగిన దుమారం వలన 2008లో జరిగిన కేటాయింపులను 2012లో సుప్రీం కోర్టు నిలిపివేసింది. మళ్లీ తాజాగా కేటాయింపులు చేయాలని ఆదేశించింది. అప్పటికే అనేక మంది విపరీతమైన లాభాలు గడించేశారు. కొత్తగా మదుపు పెట్టినవారు విపరీతంగా నష్టపోయారు. నష్టాలతో ధరను నిర్ణయించు కోవాల్సి వచ్చింది. బతికి బట్టకట్టలేకపోయారు. 2010లో స్పెక్ట్రమ్ లైసెన్స్‌ని కైవసం చేసుకున్న టెలికం దిగ్గజం రిలయన్స్ జియో కథ కూడా దాదాపు ఇటువంటిదే. అయితే కొంత తేడా ఉంది. అందులో రెండు అంశాలు ప్రధానమైనవి. ఒకటి, ఐ బి ఎస్ పి ఎల్ అనే అతి చిన్న బ్రాడ్ బ్యాండ్ సేవలు అందించే సంస్థ రిలయన్స్ తరపున స్పెక్ట్రమ్ కోసం దరఖాస్తు చేసుకుంది. రెండు, అది అంతర్జాల సేవలు అందించడానికి లైసెన్స్ తీసుకుంది. ఆ తరువాతి కాలంలో దానిని పూర్తిగా మొబైల్ సేవలకు వినియోగించడానికి మార్చుకుంది. బహుశా ఇటువంటి జిమ్మిక్కుల వలన మొదట్లో ఇతర కంపెనీల దృష్టిలో రిలయన్స్ పడకుండా, అదాటుగా మార్కెట్లోకి ప్రవేశించగలిగింది. ఐ బి ఎస్ పి ఎల్ దరఖాస్తు చేసుకునే నాటికి దాని చెల్లించిన పెట్టుబడి కేవలం రూ. 2.51 కోట్లు. నికర విలువ రూ. 2.49 కోట్లు. కేవలం ఒకే ఒక లైన్ వినియోగ దారుని నుండి రూ. 15 లక్షలు సంపాదిం చింది. అయినప్పటికీ ఐ బి ఎస్ పి ఎల్ వేలంలో పాల్గొనడానికి అర్హత సంపాదించింది. బ్యాంకు గ్యారంటీ రూపంలో కట్టాల్సిన రూ. 252 కోట్లు దాని నికర విలువకి వంద రెట్లు ఎక్కువ. అయినప్పటికీ – సమకూర్చుకోగలిగింది. మరీ ముఖ్యంగా ఐ బి ఎస్ పి ఎల్ బిడ్లు గెలవడమే కాదు. 20 ఎం ఎచ్ ఓ 4 జి స్పెక్ట్రమ్‌ని 22 టెలికం సర్కిల్స్‌కి సాధించుకోగలిగింది. విడ్త్ ధర రూ. 12848 కోట్లు. అంటే దాని నికర విలువకి 500 రెట్లు అధికం. అదేరోజు బిడ్లు ముగిసే సమయానికి, తన వాటాదారుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి అధీకృత పెట్టుబడిని రెండు వేల రెట్లు పెంచుకుంది. అంటే, రూ. మూడు కోట నుండి 600 కోట్లకి పెంచుకుంది. అందులో 75 శాతా వాటాలను రిలయన్స్‌కి ఇచ్చింది. తననుతాను రిలయన్స్‌కి సబ్సిడీగా మార్చుకుంది. వారం తిరగకుండా ఐ బి ఎస్ పి ఎల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కాస్త పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారింది. రిలయన్స్ జియో ఇంఫొకామ్ లిమిటెడ్ అయింది.

2012లో ప్రభుత్వం అంతర్జాల సేవలు అందించేవారిని వాయిస్ సేవలు అందించే పూర్తికాలం సంస్థలుగా గుర్తిస్తూ ఒక ఉమ్మడి లైసెన్స్ విధానానికి రూపకల్పన చేసింది. ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్న తొలి సంస్థ రిలయన్స్. తన ఐ ఎస్ పి లైసెన్స్‌ని ఉమ్మడి లైసెన్స్ విధానానికి అధికారికంగా మార్చుకుని, 2013 అక్టోబర్ నాటికల్లా వాయిస్ సేవలు అందించే సంస్థగా మారింది. దీనికి అవసరమైన చెల్లింపులు కూడా చేసింది. మొదట్లో ప్రభుత్వం బ్రాడ్ బ్యాండ్ అంతర్జాల సేవలకు 4జి లైసెన్స్‌లను, వాయిస్ సేవలకు

> "గత మూడు దశాబ్దాలుగా స్వల్ప కాల మతలబులు, వరుసగా కొనసాగుతున్న కొత్త వారి చేరికలు, నిష్క్రమణల తరువాత ఈనాడు భారతదేశంలో ఈ రంగంలో మూడు ప్రైవేటు సంస్థలు స్థిరపడి, భారతదేశంలోని విస్తార మైన మార్కెట్‌ను తమ గుప్పెట్లో పెట్టుకున్నాయి. ఈ గుత్తాధిపత్యానికి చేరడానికి అవి అవలంభించిన పద్ధతులు ప్రత్యేకమైనవి."

2జి/3జి వినియోగించాలని భావించింది. కానీ ఉమ్మడి లైసెన్స్ విధానాన్ని ఆసరా చేసుకుని రిలయన్స్ అడుగుపెట్టింది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వాయిస్ సర్వీసెస్ డేటా పాకెట్స్ ద్వారా అందించి పోటీదారులతో కొత్త ఆటకి రిల యెన్స్ తెరలేపింది. ఏ విధంగా చూసుకున్నా, రిలయన్స్ ఈ రకంగా ముందుకుపోవడాన్ని ఐ బి ఎస్ పి ఎల్ అనుమతించి ఉండకూడదు. 2013 కాగ్ ముసాయిదా నివేదిక రిలయన్స్‌ను వ్యతిరేకించింది. అందుకు సంబంధించిన ప్రభుత్వ శాఖలను కఠినంగా ఆక్షేపించింది. దీని వలన ఖజానాకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని అంచనా వేసింది. అయితే పార్లమెంటు ముందు ప్రవేశపెట్టిన నివేదికలో దీనిని నీరుగార్చింది.

ఇదివరకే చెప్పుకున్నట్టు ఆక్షేపణీయమైన ఈ కేసులు అరుదైనవి మాత్రం కావు. గత మూడు దశాబ్దాలలో నిరంతరంగా జరుగుతున్న కథలే. గుహ తాకుర్తా వీటి గురించి పరిశోధనలు చేసి, వివరమైన కథనాలను రాశారు. అవి ఎన్ని ఉన్నాయంటే వాటిని చర్చించడం కాదు కదా, కనీసం వివరాలు అందించడానికి కూడా ఇక్కడ స్థలం సరిపోదు. ఈ విధానాల వలన భారత ప్రభుత్వ ఖజానాకు లక్షల కోట్ల రూపాయల నష్టం చేకూరింది. అందులో కొన్ని, 1. ధరలను యధేచ్ఛగా నిర్ణయించడం 2. ఒక లైసెన్స్ నుండి వేరొక లైసెన్స్‌కు తరలిపోవడానికి అనుమతించడం 3. పార్టీలను వారి వాటాలను అమ్ముకోడానికి అనుమతించడం, తద్వారా లైసెన్స్ విధానానికి అర్థం లేకుండా చేయడం 4.ఈ కొత్త సేవలందించే ఆపరేటర్‌లకి బి ఎస్ ఎన్ ఎల్ మౌలిక సదుపాయాలను – వివిధ ప్రాంతాలకు యథేచ్ఛగా సేవలందించేందుకు – వినియోగించుకొనే అవకాశం కల్పించడం, వారి అంతర్జాల సేవలు మొదలు కాకముందే, కొత్తగా ఈ రంగంలో లైసెన్స్ పొందిన వారికి సబ్ స్క్రైబర్స్‌ని చేర్చుకోడానికి, వారికి సేవలు అందించడానికి అనుమతి ఇవ్వడం, వారి లైసెన్సులను అమ్ముకునేందుకు వీలు కల్పించడం 5.స్పెక్ట్రమ్‌ని పంచుకోడానికి, కలుపుకోడానికి (పూలింగ్), అమ్ముకోడానికి అనుమతించడం 6. అంతకంటే ఘోరంగా చెల్లించిన దానికి రెట్టింపు స్పెక్ట్రమ్‌ని కేటాయించడం 7. గుట్టుచప్పుడు కాకుండా బిడ్డింగ్‌లు జరపడం, వగైరాలు. వీటి వలన వ్యవస్థలో నిలకడగా ఉండే సంస్థలు బాగా తగ్గిపోయాయి. పైగా నూతన ఆర్థిక విధానాలు అమలుకావడం మొదలైన తరువాత అంతకు ముందున్న నియమ నిబంధనలు అసంబద్ధ మయ్యాయి. మొత్తం పనంతా ఒక ప్రహస నంగా మారింది.

### చివరకు మిగిలింది గుత్తపెట్టుబడి

గత మూడు దశాబ్దాలుగా స్వల్ప కాల మతలబులు, వరుసగా కొనసాగుతున్న కొత్త వారి చేరికలు, నిష్క్రమణల తరువాత ఈనాడు భారతదేశంలో ఈ రంగంలో మూడు ప్రైవేటు సంస్థలు స్థిరపడి, భారతదేశంలోని విస్తార మైన మార్కెట్‌ను తమ గుప్పెట్లో పెట్టుకున్నాయి. ఈ గుత్తాధిపత్యానికి చేరడానికి అవి అవలంభించిన పద్ధతులు ప్రత్యేకమైనవి. మొదటిది, అందులో రెండు సంస్థలు ఇతర సంస్థలలో చాలా వాటిని తమలో విలీనం చేసుకోవడం. రెండు, మౌలిక ధరను విపరీతంగా తగ్గించి, ప్రధానంగా కొత్తవారు అడుగుపెట్టడానికి వీలు లేకుండా చేసి, మార్కెట్లో ఆధిపత్యాన్ని సాధించడం. ఇది అత్యంత దారుణమైన ధరల యుద్ధనికి తెరలేపింది. ఈ కుత్తుకలు కోసుకునే ధరల దాడులకు చాలా సంస్థలు బలయ్యాయి. కొన్ని ఉదాహరణలు చూద్దాం. వొడాఫోన్ నే తీసుకుందాం. పైకి చూడడానికి ప్రపంచ టెలికం కార్పొరేషన్‌కి ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు కనిపించే ఈ సంస్థ భారతదేశంలోని బడా పెట్టుబడిదారుడైన ఆదిత్య బిర్లాకి చెందినది. 1990ల మధ్య ఇది అమెరికాలోని ఏ టి అండ్ టి తో కలిసి, 30 కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడితో దేశంలోనే అతి పెద్ద సెల్యూలార్ అంతర్జాల సంస్థగా అవతరించింది. గుజరాత్, మహారాష్ట్ర గోవాలలో అతి కొద్ది రోజులలోనే తన మార్కెట్‌ని విస్తరించుకుంది. అయితే కొద్ది సంవత్సరాలలోనే టాటా టెలికం ఆపరేటర్స్‌తో విలీనం అయింది. 2022 కి టాటాలది రెండో అతిపెద్ద వ్యాపార సంస్థ. 2000–01 లో వొడాఫోన్ భారతదేశంలోని అత్యధిక కార్యకలాపాలు గల విజయవంతమైన రెండు సంస్థలను తనలో విలీనం చేసుకుంది. 2002లో ఒక కొత్త పేరు ఐడియాతో పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంది. కొద్ది రోజులలోనే మొదట ఏ టి అండ్ టి, ఆ తరువాత టాటాలు తమ వాటాలను బిర్లాలకు అమ్ముకున్నారు. ఇప్పుడు అతి పెద్ద సంస్థగా ఉన్న జియో 2016లో మార్కెట్లోకి రాగానే మార్కెట్‌లో మరిన్ని విలీనాలు జరిగాయి. మొదట్లో ఐడియా, స్పైస్ అనే టెలికం సంస్థను కొనింది. ఆ తరువాత 2018 లో ఐడియా, వొడాఫోన్ ఇండియా కలిసి భారతదేశంలోనే అతి పెద్ద టెలికాం సంస్థగా పేరు తెచ్చుకున్నాయి. ఆ నాటికి అవి రెండు, మూడు స్థానాలలో ఉన్న సంస్థలు. 39 కోట్లమంది వాడకందారులు ఉన్న సంస్థ. కానీ ఆశ్చర్యకరంగా ఇంతపెద్ద సంస్థ కూడా తన లోపాలు సరిచేసుకునే ప్రయత్నాలు చేయలేదు. 2021కి కంపెనీ నష్టాలలో కూరుకుపోయింది. 2021 కి రూ 44,000 కోట్ల రూపాయల నష్టాలు మూటగట్టుకుంది. మూడేళ్ళ సంచిత నష్టాలు లక్షా ముప్పై మూడువేల కోట్ల రూపాయలు. పైగా వోడాఫోన్ ఐడియా కి రూ 1,90,000 కోట్ల నష్టాలు ఉన్నట్టు గణాంకాలలో ఉంది. అందులో ప్రభుత్వానికి చెల్లించవలసిన రూ. 1,86,000 కోట్ల లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ బకాయిలు కూడా ఉన్నాయి.

వొడాఫోన్–ఐడియా అంత నాటకీయం గా కాకపోయినా భారతి ఎయిర్‌టెల్ కూడా భారతదేశంలో అడుగుపెట్టిన నాటి నుండి మార్కెట్‌ను విస్తృత పరుచుకుంటూనే ఉంది. కనీసంగా 9 చిన్న సంస్థలను విలీనం చేసుకుంది. ప్రస్తుతానికి భారతదేశంలో రెండో పెద్ద టెలికాం సంస్థ ఇది.

టెలికాం పరిశ్రమలో పెట్టుబడి అధికంగా కావాలి. సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు త్వర త్వరగా మార్పు చెందే

రంగం. అదే సమయంలో అదనపు వినియోగదారులకు అదనపు ఖర్చులు పెట్టాల్సి వచ్చే రంగం కూడా. ఇక్కడ లాభాలు ఆర్జించాలంటే వినియోగదారుల సంఖ్య అధికంగా ఉండాలి. అప్పుడే కంపెనీ తక్కువ ధరకి సేవలు అందించగలుగుతుంది. దానివల్లనే మార్కెట్‌లో వాటా పెంచుకోవ డానికి ధరలు తగ్గించవలసిన పరిస్థితులు ఏర్పడతాయి. భారతదేశంలో పేద ప్రజలు ఎక్కువగా ఉన్నందువలన ధరలను తగ్గించ కుండా మార్కెట్‌ను వశపరచుకోవడం సాధ్యపడదు. అందువలన మార్కెట్‌ను స్వాధీన పరచుకోడానికి ఒకరికంటే ఒకరు ధరలు తగ్గించుకుంటూ పోటీ పడవలసి వచ్చింది. రెండు తరాలలో రిలయన్స్ పూర్తి విరుద్ధ విధానాలు అనుసరించిన మరో ఉదాహరణను పరిశీలిద్దాం.

> **“ రిలయన్స్ జియో ఆరేళ్ళ తరువాత టెలికాం రంగంలోకి అడ్డదారులలో అట్టహాసంగా ప్రవేశించింది. 18,000 నగరాలకు, పట్టణాలకు, గ్రామాలకు వ్యాపించిన సంస్థగా చెప్పకుంది. అసాధారణ వ్యూహరచన చేసుకుని, రిలయన్స్ జియో 4జి సేవలను 2016 మేలో పరీక్షకు పెట్టింది. ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఉచితంగా సిమ్ కార్డులు పంచింది. కాలక్రమంలో ఉచిత సిమ్ కార్డులు ఇవ్వడాన్ని తగ్గించింది. ”**

2000లలో రిలయన్స్ టెలికం పరిశ్రమలో ప్రవేశించిన నాటికి అది ఉమ్మడి సంస్థ. దానికి అత్యుత్తమ నెట్‌వర్క్ ఉండేది. తన గుత్త సంస్థ అయిన చమురు పరిశ్రమ నుండి పెట్టుబడులను తీసుకొచ్చి ఇందులో పెట్టింది. భారతదేశవ్యాప్తంగా ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంది. 2,00,000 కిలోమీటర్ల మేర ఫైబర్ కేబుల్స్ నిర్మించింది. రిలయన్స్ 2003 జులైలో “మాన్సూన్ హంగామా “ పేరిట రూ 501 లకే మొబైల్ ఫోన్ ఇచ్చింది. అప్పటికి అదే రకం మొబైల్ ధర మార్కెట్‌లో రూ.2000 ఉండేది. దానికి తోడు అదనంగా ఫ్రీ ఇన్ కమింగ్ కాల్స్ కూడా ఇచ్చింది. దీని వలన ఆ సంస్థ మార్కెట్లో అత్యధిక భాగాన్ని కైవసం చేసుకోగలిగినా సంస్థకి మాత్రం నష్టాలు వచ్చాయి. రూ 4,500 కోట్ల నష్టాలను 2006లో మాఫీ చేయాల్సి వచ్చింది. ఈ ధరల యుద్ధం మూలంగా మాట్లాడే కాల్ ధర నిమిషానికి 40 పైసలకు తగ్గింది. అప్పుడు మార్కెట్లో నిమిషం మాట్లాడాలంటే రూ. 2 చెల్లించవలసి వచ్చేది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ అదే వ్యూహాన్ని 2006-07 లలో మళ్ళీ ప్రయోగించాలని భావించింది. కానీ ఆ సమయానికి అన్నద మ్ముల మధ్య ఆస్తి పంపకాలు జరిగిపోయాయి. పెట్రోలియం అన్న ముకేశ్ అంబానీకి వెళ్ళింది. ఫలితంగా 2010లో రూ1.17 లక్షల కోట్లతో టెలికాం రంగంలో రెండో అతి పెద్ద సంస్థగా ఉన్న రిలయన్స్ విలువ 2019 కల్లా దిగజారి రూ. 21,000 విలువ గల రిలయన్స్ కమ్యూనికేషన్స్‌గా మారింది. 2019 ఆర్ కామ్ దివాళా ప్రకటించింది. రూ 50,000 కోట్ల అప్పులు, కేవలం రూ. 18,000 కోట్ల ఆస్తులు ఉన్నట్టు చూపుకుంది.

పైన చెప్పుకున్నట్టు రిలయన్స్ జియో ఆరేళ్ళ తరువాత టెలికాం రంగంలోకి అడ్డదారులలో అట్టహాసంగా ప్రవేశించింది. “ కేవలం ఒకేఒక టెలికాం నెట్‌వర్క్ గల, ప్రపంచంలోనే అతి పెద్ద 4 జి సేవలు అందించే సంస్థ” అని ప్రకటించుకుంది. 18,000 నగరాలకు, పట్టణాలకు, గ్రామాలకు వ్యాపించిన సంస్థగా చెప్పుకుంది. అసాధారణ వ్యూహరచన చేసుకుని, రిలయన్స్ జియో 4జి సేవలను 2016 మేలో పరీక్షకు పెట్టింది. ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఉచితంగా సిమ్ కార్డులు పంచింది. కాలక్రమంలో ఉచిత సిమ్ కార్డులు ఇవ్వడాన్ని తగ్గించింది. అప్పటికే కంపెనీకి 25 నుండి 30 లక్షల మంది వినియోగదారులు ఉన్నారు. అప్పటికి కూడా అధికారికంగా కంపెనీ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించలేదు. 2016 సెప్టెంబర్‌లో కంపెనీ “స్వాగత ఆఫర్” అంటూ ఉచిత వాయిస్ అండ్ డేటా సేవలు ప్రకటించింది. ఆ తరువాత “కొత్త సంవత్సర శుభాకాంక్షలు” అంటూ 2016 డిసెంబర్‌లో ఈ అఫర్‌లను మరో రెండు నెలలు పొడిగించింది. 2017 ఫిబ్రవరి మాసంలో సి ఇ ఒ ముఖేష్ అంబానీ జియో వినియోగదారులు 10 కోట్లు దాటినట్టు ప్రకటించారు కేవలం 170 రోజుల్లోనే ఇది జరిగింది.

దీనిపై ఇతర పోటీదారులు ఒక్కొక్కరుగా, ఉమ్మడిగా కూడా పదేపదే పిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఈ రకమైన ధరల కోత సంస్థలను చంపేస్తుందని సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ హెచ్చరించింది, ఫిర్యాదు చేసింది. కానీ నియంత్రణ చేయాల్సిన సంస్థలన్నీ ఒకరి పై ఒకరు బాధ్యతలు నెట్టేసుకున్నారు గాని చేతలు శూన్యం. చివరికి సంస్థలన్నీ న్యాయసలహాను కోరాయి. 2017 జనవరిలో అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గి, “ ప్రచారం చేసేటప్పుడు ఇచ్చిన ఆఫర్లు వివక్ష చూపకూడదన్న రెగ్యులేటర్ల నిబంధనల పరిధిలోకి రావని తేల్చి” చెప్పాడు. అందువలన ఉచితాలు కొనసాగుతూనే ఉన్నాయి. వాటిలో చివరిది “వేసవి విడ్డూరాలు” అనే పేరు మీద వినియోగదారులకు మరో మూడు నెలలు ఉచిత సేవలు –2017 జూన్ వరకు– అందించే అవకాశం ఇచ్చింది. అయితే జులైలో మొదలయే వాయిస్, డేటా సేవలకు ముందే చెల్లించాలి. ఆఖరికి టెలికాం రెగ్యులేటరి అథారిటి నిద్రమత్తు వీడింది. “మూడు నెలల ఉచిత సేవలను నిలుపు చేయమని జియోని ఆదేశించింది.” టెలికం పరిశ్రమ రక్తాన్ని పీల్చేసే, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే పనిని ఆపడానికి టెలికామ్ విభాగం కార్యదర్శి జె ఎస్ దీపక్ చాలా కష్టపడవలసి వచ్చింది. అయన మాటల్లో, ‘‘రిలయన్స్ ఉచితంగా డేటా ఇవ్వడం వలన, ఇటువంటి సేవలు అందించే ఇతరుల ఆదాయాలు గండి పడడం వలన, ప్రభుత్వానికి రావలసిన రూ 68,500 కోట్ల మేరకు లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ చార్జీలకు గండి పడింది. ప్రభుత్వ బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న ఖాతాదారులపైనా కూడా దీని ప్రభావం పెద్ద ఎత్తున పడింది. ఈ వార్తలు బయటకు పొక్కిన వారం లోపు టెలికాం విభాగం నుండి దీపక్‌ను బదిలీ చేశారు. 2016-17 లలో జియో అందించిన ఉచిత సేవలు, అంతకు ముందు “2జి స్కామ్” కి పాల్పడి బయటపడడం, వగైరాలు చవకగా ప్రజానీకానికి టెలికాం సేవలు అందించడంలో భాగమని” కొందరు సమర్థిస్తున్నారు.

2జి స్కామ్ బయటపడ్డ కాలంలో, అప్పటి కమ్యూనికేషన్స్ మంత్రి కపిల్ సిబాల్ ప్రభుత్వాన్ని తన తర్కంతో సమర్థించారు. 2017 మే లో టెలికం విభాగం అదనపు కార్యదర్శి, ఎన్ శివశైలం, “లైసెన్స్ ల ద్వారా రావాల్సిన సొమ్ము రాకపోవడాన్ని (జియో విడుదల తరువాత)’’ వినియోగదారుల

> **“ పోటీ ముగ్గురికి పరిమితమైన తరువాత, ఇక పోటీ అనేది లేకుండాపోయింది. ఈ మూడు కంపెనీలు ఒకదానితో ఒకటి సహరించుకోవడం, వారి ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకోడానికి కలిసి వ్యవహరించటం మొదలుపెట్టాయి. దీనినే జోసెఫ్ షుమ్ పీటర్ “గౌరవ సహకార” విధానం అన్నారు. అంటే ఒకరినొకరు కాపాడుకుంటూ, సహకరించుకుంటూ తమ ఉమ్మడి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్ళేవన్న మాట. ”**

చేతిలోని ఆదాయంగా “పరిగణించాలని అన్నట్టు వైర్ పత్రిక ప్రకటించింది. జియో మార్కెట్లోకి ప్రవేశించినప్పటి నుండి టెలికాం సేవలు భారతదేశంలో ప్రపంచం లో ఏ దేశంలో లేనంత తక్కువ స్థాయిలో ఉన్నాయి. అయితే ఇది చాలామంది ఆపరేటర్లు పరిశ్రమ నుండి తప్పుకోవడానికో లేదా అమ్ముకోవడానికో (అనిల్ అంబానీ సోదరుడితో సహా) దారి తీసింది. జియో 2,000 నుండి 2,500 కోట్ల రూపాయలతో ఆధునిక టెలికాం నెట్‌వర్క్ రూపొందించి, జియో సిమ్ తీసుకున్న, సబ్ స్క్రైబ్ చేసిన వారికి ఉచిత సేవలు అందించింది. ఆ సేవలను మరో ఏడాదికి పొడిగించింది. అప్పటికి పోటీ అన్నది మార్కెట్ నుండి తుడిచిపెట్టుకపోయింది.

**భారతదేశంలో టెలికం పరిశ్రమ : దేశవ్యాప్తంగా గుత్త ద్రవ్య పెట్టుబడి పట్టు సాధించడమే అసలైన తర్కం**

టెలికం రంగం విస్తరించడానికి ప్రైవేటీకరించడం కారణమని ప్రచార మాధ్యమాలు చెబుతున్నాయి. మార్కెట్ శక్తుల వల్లనే ధరలు తగ్గాయని ప్రచారం చేస్తున్నారు. కాని అందులోని వాస్తవాలను పైన గమనించాం. స్పెక్ట్రమ్ ఆస్తులు కొల్లగొట్టడం, లైసెన్సులు పొందడంలో గిమ్మిక్కులు చేయడం వలన పరిశ్రమలో కొందరు మొత్తం పరిశ్రమపై పట్టు సాధించగలిగారు. అయితే ఇలా పట్టు సాధించడం వలన ఎంత వృధా జరుగుతుందో, గుత్త ద్రవ్య పెట్టుబడి పరాన్నజీవిగా ఎలా మనుగడ సాగిస్తుందో ఇప్పుడు పరిశీలిద్దాం.

**ద్రవ్యీకరణ**

ఎయిర్‌టెల్‌నే ఉదాహరణగా తీసుకుందాం. 2002లో భారతి ఎయిర్‌టెల్ వాటా ధర రూ. 12 ఉండేది. 2022 కి దాని ధర రూ.760/- చేరింది. అంటే ఇరవై ఏళ్లలో అరవై రెట్లకన్నా ఎక్కువ పెరిగింది. ఈ పరిశ్రమ ప్రధాన ప్రమోటర్, మొదటి తరం యజమాని సునీల్ మిట్టల్ ఇప్పుడు భారతదేశంలో అత్యంత ధనవంతుడు. అతని ఆస్తులు దాదాపు 1500 కోట్ల డాలర్లు. అక్రమాలకు పాల్పడటంలో ద్రవ్యాన్ని నేర్పుగా వినియోగించటం ద్వారా ఎలా సంపద పోగుచేసుకోవచ్చో తెలుసుకోడానికి ఇదో ఉదాహరణ. ఈ సంగతి 2015లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలో వివరంగా ఉంది. స్పెక్ట్రమ్‌ను కాజేయడం, లెక్కలలో గిమ్మిక్కులు చేయడమే కాక కార్పొరేట్‌ల పునర్నిర్మాణం ద్వారా రూ. 44,000 కోట్ల ద్రవ్య ఆస్తులు ఎలా దక్కించుకున్నరో, 2006-10 మధ్య కాలంలో ఒక సంస్థ నుండి మరోసంస్థకు బదలాయించటం ద్వారా ఎలా ఆస్తులు పోగేసుకున్నారో ఈ నివేదిక తెలియచేస్తుంది. ఎయిర్‌టెల్ తనకి చెందిన చాల విభాగాలను మూసేసి, అనుబంధ సంస్థలను తెరిచింది. వాటికి పుస్తకాలలోని విలువకు ఆస్తులను బదలాయించింది. ఈ అనుబంధ సంస్థలు ఏర్పడిన తరువాత అవి తమ ఆస్తులను తిరిగి మార్కెట్ ధరలకు విలువకట్టాయి. ఆ తరువాత అనుబంధ సంస్థలను మళ్ళీ ప్రధాన సంస్థలో కలిపేసుకున్నారు. ఆ రకంగా “సంపద సృష్టి” జరిగింది.

బడా ద్రవ్య పెట్టుబడి ఈనాడు అతి పెద్ద సంస్థగా ఉన్న రిలయన్స్ జియో పై ఏ రకంగా ఆసక్తి కనపరుస్తున్నదో గుర్తించాం. జియో అసలు కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ 2019లో జియో ప్లాట్‌ఫార్మ్ అనే మధ్యంతర హోల్డింగ్ కంపెనీని రూపొందించింది. దీని లక్ష్యం జియో టెలికం, ఇతర డిజిటల్ సంస్థలను ఒక సమూహంగా ఉంచి, టెలికం వ్యవస్థపై ఆధిపత్యం సంపాదించడం. 2020 ఏప్రిల్ - జూన్ మధ్యకాలంలో భారతదేశం అంతా కోవిడ్‌తో కొట్టుమిట్టాడుతుంటే, లాక్‌డౌన్ అమలవుతుంటే, జియో ప్లాట్‌ఫార్మ్‌లోని ఒక అంతర్జాతీయ ద్రవ్యసంస్థ క్రమపద్ధతిలో, విడతల వారీగా 11 సార్లు ఇందులో మదుపు పెట్టింది. తన అధీనంలో ఉన్న వాటాలలో అయిదో వంతు వాటాలను అమ్మకానికి పెట్టి, రూ లక్షా పదివేల కోట్లు పొందగలిగింది. అంటే “ఆశ్చర్య చకితులను” చేసే విధంగా 165 రెట్ల లాభాలను సంపాదించింది - వడ్డీలు, పన్నులతో కలిపి. ఫేస్ బుక్ (ఇప్పుడది మెటా),10 శాతం -570 కోట్ల డాలర్లు- గూగుల్ 450 కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టాయి. పెట్టుబడులు పెట్టినవారిలో మైక్రోసాఫ్ట్, అమెరికా మదుపు కంపెనీ కె కె ఆర్, అబుదాబికి చెందిన ముబాదాలా, ది సౌదీ సావరిన్ ఫండ్, ఇతర అనేక ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయి. వారంతా పెట్టుబడులు పెట్టక ముందు రిలయన్స్ గ్రూప్ అప్పుల్లో మునిగి ఉండేది. కానీ 30-32 జియో ప్లాట్‌ఫార్మ్‌లోని వాటాలు కొద్ది నెలల తేడాలో అమ్మిన తరువాత, అంతర్జాతీయ బడా ద్రవ్య సంస్థల నుండి 2,000-2,200 కోట్ల డాలర్లు సంపాదించుకోగలిగింది.

**గుత్తాధిపత్యం**

పోటీ ముగ్గురికి పరిమితమైన తరువాత, ఇక పోటీ అనేది లేకుండాపోయింది. ఈ మూడు కంపెనీలు ఒకదానితో ఒకటి సహరించుకోవడం, వారి ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకోడానికి కలిసి వ్యవహరించటం మొదలుపెట్టాయి. దీనినే జోసెఫ్ షుమ్ పీటర్ “గౌరవ సహకార” విధానం అన్నారు. రెండో ప్రపంచయుద్ధ కాలంలో అమెరికా మార్కెట్‌ని మూడు బడా కంపెనీలు తమ అధీనంలో పెట్టుకున్నాయి. - అంటే ఒకరినొకరు కాపాడుకుంటూ, సహకరించుకుంటూ తమ ఉమ్మడి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్ళేవన్న మాట. ఉదాహరణకి 2013లో రిలయన్స్, ఎయిర్‌టెల్, టెలికం మౌలిక సదుపాయాలను - ఆప్టికల్స్ ఫైబర్ నెట్‌వర్క్, కేబుల్ నెట్‌వర్క్, టవర్లు, అంతర్జాతీయ బ్రాడ్‌బ్యాండ్ సేవలు - ఉపయోగించు కోవాలని భావించాయి. 2019లో ధరలు నిర్ణయించడంలో వారి మధ్య “సహకారం” మరింత స్పష్టంగా కనిపించింది - మూడు సంస్థలు కలిసి ధరలు పెంచేయి. అందులో చేతులు కలిపింది ఆ ముగ్గురేకాక, ప్రభుత్వంలోని పై అధికారుల ఆశీస్సులు, అండదండలు కూడా ఉన్నాయని భోగట్టా. ప్రైవేటు కంపెనీలు మూడు దశాబ్దాల కాలంలో ఈ రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన చరిత్ర ఇదీ!

**(అనువాదం: కె ఉషారాణి)**

# యజుర్వేద, అధర్వ వేద కాలానికి మారిన సామాజిక స్థితిగతులు

(2వ పేజీ తరువాయి)

మూడు రాజ్యాలు కాశి, విదేహా, కోసల ప్రస్తావన కూడా ఉన్నది. కాశీని పాలించిన అజాతశత్రు అన్న పాలకుడి గురించి బృహదారణ్యక, కౌషీతకి ఉపనిషత్తుల ద్వారా మనకు తెలుస్తున్నది. అలానే విదేహకు చెందిన ముగ్గురు రాజుల పేర్లు మాధవ అనే రాజు పేరును శతపథ బ్రాహ్మణం, "నమీసాప్య "అనే రాజు పేరును పంచవింశతి బ్రాహ్మణం, జనక రాజును బృహదారణ్యక ఉపనిషత్తు ప్రస్తావిస్తున్నాయి. కోసల రాజ్యం తూర్పు ఉత్తరప్రదేశ్లో ఉన్నట్లు శతపథ బ్రాహ్మణం చెబుతుంది.

గంగా యమునా పరివాహక ప్రాంతం దట్టమైన అడవులతో నిండి ఉండేది. ఈ దశలో ఆర్యులు కొత్తగా విస్తరించిన ప్రాంతంలో అడవులను వ్యవసాయ యోగ్యం చేసిన పద్ధతి కూడా యజుర్వేద సాహిత్యం వర్ణించింది. ఆ పద్ధతి ఏమంటే అడవులను దహనం చేయటం. అడవులను తొలగించటానికి నిప్పు వినియోగం అవశ్యకృంచేసింది. అడవులను శుభ్రం చేసే కార్యం అగ్ని ద్వారా జరిగినట్లుగా శతపథ బ్రాహ్మణం 1-4-1-10లో ఇలా చెప్పబడింది. మాధవుడు అనే విధేహ రాజు, రాహుగనుడు అనే గౌతమ గోత్రీకుడ యిన బ్రాహ్మణుడు తన వెంట రాగా అగ్నిదేవుడు సరస్వతీ నదికి తూర్పు దిక్కుగా ఉన్న అడవిని కాల్చుకుంటూ పోయాడని ఉన్నది. "సదానీరం" అనే నదికి తూర్పున ఉన్న భాగం ఒకప్పుడు చాలా తేమగా, బురదగా ఉన్న అడవితో నిండి ఉండేదట. ఎందుకంటే అప్పటికి అగ్ని దానిని రుచి చూడలేదు కాబట్టి. అయితే ఇప్పుడు బ్రాహ్మణులు క్రతువుల ద్వారా ఆ అడవిని అగ్నికి రుచి చూపించారు. కాబట్టి ఆ ప్రాంతం వ్యవసాయ యోగ్యమైనదట.

మహాభారతంలో పాండవులు కృష్ణుడు సాయంతో యమునానదీ తీరంలో ఉన్న ఖాండవవనాన్ని అగ్నికి అర్పించి తమ రాజధాని అయిన ఇంద్రప్రస్థం నిర్మించిన కథ కూడా ఇలాంటి చారిత్రక పరిణామాన్ని సూచిస్తుంది.

వృక్షాలు అన్నీ కాలిపోగా మిగిలిపోయిన మోదులను తొలగించడానికి ఉపయోగపడటానికి ఇనుప గొడ్డలి అత్యంత అవసరం. నూరు కొమ్మలున్న చెట్టును నరకగలదంటూ గొడ్డలిని శుక్లయజుర్వేదం (వాజసనేయ 5-43) స్తుతించింది. కర్రబిగించే రంధ్రం లేని ఇనుప గొడ్డలి "అత్రంజిఖేరా" లో లభించింది. ఇది క్రీస్తుపూర్వం 700 ప్రాంతానిది అని నిర్ధారించారు. క్రీస్తుపూర్వం 800-400 కాలానికి చెందిన కర్ర బిగించిన గొడ్డలి మధుర సమీపంలో "నోహ్" వద్ద లభ్యమైనది. ఒక వేళ కర్ర బిగించిన గొడ్డలి నిజంగానే కడపటి వైదిక యుగంలో వాడుకలోనికి వచ్చిఉన్నట్లయితే అది చెట్లను నరకటంలో ఎంతో సహాయకారిగా ఉండేది. దట్టమైన అడవులను నరికి వ్యవసాయ యోగ్యం చేయటానికి బలమైన ఇనుప పనిముట్లు విస్తారంగా కావాలి. యజుర్వేద కాలానికి ఇనుము వాడకం తెలుసు కానీ, ఇనుము దొరికే గనులు ఉత్తరభారతంలో లేవు. అలాంటి ఇనుప గనులు బీహార్లో ఉన్నాయి. బీహార్ ఇనుప గనులను చేజిక్కించుకునేంత వరకూ దట్టమైన అడవులను చదును చేసి వ్యవసాయ యోగ్యం చేయడం సాధ్యం కాదు. ఆ పని క్రీస్తు పూర్వం 600 తరువాత జరిగింది. అందుకే ఇనుము గనులు విస్తారంగా ఉన్న" మగధ" మొట్ట మొదటి రాజ్యం అయింది. అడవులను దహనం చేయడం ద్వారా వ్యవసాయయోగ్యం చేసి ఇనుము సహాయంతో బరువైన నాగళ్ళను తయారు చేసుకొని ఎడ్లను నాగళ్లకు కట్టి వ్యవసాయం చేసి పలురకాల పంటలు పండించారు.

(శుక్లయజుర్వేదం), వాజసనేయ సంహిత ఓ డజనుకు పైగా పంటల జాబితా ఇస్తుంది. అవి 1. వరి, 2. యవలు, 3. మినుములు, 4. నువ్వులు, 5. పెసలు, 6. ఉలవలు, 7. కొర్రలు, 8. వరిగలు, 9. చామలు, 10. అడవి బియ్యం, 11. గోధుమలు, 12. మసూరములు. అలానే అధర్వవేదం కూడా వరి, యవలు, మినుములు ,నువ్వులు వంటి వాటిని గురించి ప్రస్తావిస్తుంది. దీనిలో ఒక మంత్రం ద్వారా (1-34) చెరకు (ఇక్షు) సాగవుతున్నట్లు చెబుతుంది. రుగ్వేద ప్రజలకు వరి గోధుమలు గురించి తెలియవు. ఇవి రెండు సింధు నాగరికతలో పండించినవే. అడవి బియ్యం లాంటివి మినహా పైన పేర్కొన్న 12 రకాల పంటలలో తొమ్మిది రుగ్వేద కాలం కన్నా ముందున్న సింధు నాగరిక ప్రజలు పండించారు. పురాతత్వ శాస్త్రం దీనిని ధ్రువీకరించింది కూడా. అంతేకాదు వాటితోపాటు సజ్జలు, జొన్నలు, రాగులు కూడా సింధు నాగరికులు పండించారు. అయితే వీటి గురించి యజుర్వేదంలో ప్రస్తావన లేదు.

సేద్యానికి, రవాణాకు, నాగలితో దున్నటానికి, బండి లాగటానికి ఎద్దుల మందల ఆవశ్యకత ఎంతో ఉన్నది. అలాగే బావుల నుండి నీటిని తోడడానికి, తద్వారా పంటలు పండించడానికి ఈ ఎద్దులు ఉపయోగపడేవి. కనుకనే "ఈ భూతలం పైన ఉన్న ప్రతి ఒక్కదానిని ఆవు,ఎద్దు పోషిస్తున్నాయి "అని శతపథ బ్రాహ్మణం 3-1-2-21 చెబుతున్నది. కనుక ఆవు, ఎద్దు మాంసాన్ని తిన రాదన్న ఆంక్షలు పెట్టారు. కానీ అదే గ్రంథంలో ఉపనిషత్ కారుడైన యజ్ఞవల్క్యుడి ప్రకటన ఇలా ఉంది."నేను దాన్ని తింటాను. అయితే అది లేత గా ఉంటేనే తింటాను"అని అంటాడు. ఈ ప్రకటనను బట్టి ఆవు, ఎద్దు మాంసం తినకూడదని పెట్టినఆంక్షలు ఏమి పని చేయలేదని అర్థం అవుతున్నది.

గంగా నది పరివాహక ప్రదేశంలోని అడవులలో ఏనుగుల గురించి అధర్వవేదము లోను, అలాగే యజుర్వేదం (వాజసనేయ 30-11) లోను ప్రస్తావనలున్నాయి. హస్తిపాలు అంటే "మావటి"ని ప్రస్తావించింది. దీని ప్రకారం ఆ నాటికి ఏనుగులను మచ్చిక చేసుకోవడం మొదలైంది అని భావించవచ్చు. యజుర్వేదం, వాజసనేయ సంహిత (18-10-14) లో లోహాల గురించి ప్రస్తా వించింది. అవి బంగారం, కంచు, ఇనుము ,రాగి ,సీసం ,తగరం. అధర్వ వేదం సహితం (11-3-7-8) ఇనుము ,రాగి, తగరం, బంగారం లను ప్రస్తావించింది. అదేవిధంగా సీసముగురించిన (12-2-1-19) ప్రస్తావన కూడా ఉంది. ఇతర గ్రంథాలు వెండిని గురించి ప్రస్తావించాయి. ఇవన్నీ సింధూ నాగరికతలో తెలిసిన లోహాలే. ఇనుము తప్ప. అయితే ఇప్పుడు అంటే యజుర్వేద కాలంలోఅదనంగా ఇనుము తోడు కలిసింది.

వాజసనేయ సంహితలో (30-14) కంచు లేదా రాగిని కరిగించే (అయస్తాప) లోహ కారుడి ప్రస్తావన కనవడుతుంది. కుమ్మరం విషయాన్ని(వా జసనేయ 16-27) లో చూస్తాం. నేత కారులు, నేత వృత్తుల ప్రస్తావన చాలానే ఉన్నది. ఉన్ని దారం (పూర్ణ సూత్ర) గురించి పదేపదే ప్రస్తావనలు కనిపిస్తాయి. కానీ ప్రత్తి నూలుకు సంబంధించిన ప్రస్తావనలు లేవు. సింధు నాగరిక ప్రజలు ప్రత్తిని పండించి వడికిన నూలుతో తయారు చేసిన వస్త్రాలను ధరించేవారు. నూలు వడకటం ముఖ్యంగా ఆడవారి పని." ఉన్ని దారము ఆడవారి పని"అని శతపథ బ్రాహ్మణం (12-7-2-10) చెబుతోంది. బహిష్టు అయిన స్త్రీ "వడికిన లేక నేసిన" వస్త్రాన్ని ఉతకాలనీ (3-1-2-19) లో

చెబుతున్నది. ఏ విధంగా ఇద్దరు యువతులు (రాత్రి పగలు) దారాన్ని (తంత్ర) సిద్ధం చేసి పడుగు ,పేకలను మార్చి మార్చి అల్లుతున్నది, ఏ విధంగా పురుషుడు బట్టను నేస్తున్న ది అధర్వ వేదం (10-7-42-43) చెప్తున్నది. ఈ రకమైన నేత ఉత్పత్తిలో స్త్రీలు ప్రముఖ పాత్ర వహించేవారు. అల్లికపని (పెషాస్కరి), రంగులద్దే (రజయిత్రి) స్త్రీల గురించి పురుష మేధసూక్తం చెబుతుంది. ఈ కాలంలో చేతివృత్తులు గణనీయంగా అభివృద్ధి చెందాయి. ఈ వృత్తుల తో పాటు ధనస్సులు తయారీదారులు, తాళ్లు పేనేవారు, వింటి నారిని తయారుచేసేవారు, బాణాల తయారీ, తోళ్లు పదును చేయటం, వెదురును చీల్చే స్త్రీలు, వాడి అయినవస్తువులు తయారుచేసే ఆడువారు, లేపనాలు తయారు చేసే మహిళలు, కత్తులు తయారు చేసే మహిళ, దుంగలు మోయటం, నిప్పును మండించటం, ఆవులు కాయటం, వేటాడటం వంటి వాటితో పాటు, మత్స్యకారుడు, స్వర్ణకారుడు, వ్యాపారి, వైద్యుడు, జ్యోతిష్యుడు వంటి వారిని కూడా వాజసనేయ సాహిత-30 లో ప్రస్తావించబడ్డాయి. డబ్బుకు మారుగా నిష్కం అంటే బంగారం మార్పిడి చేసేవారు. ఆనాటికి ఇంకా పట్టణాల జాడలేదు. పురం అన్న పదాన్ని ఎక్కడ ఉపయోగించినా అది చుట్టూ కర్రలతో దడి లేదా గోడ ఉన్న జనావాసం మినహా మరేమీ కాదు.

**చాతుర్వర్ణ వ్యవస్థ**

రుగ్వేద కాలంలో వృత్తుల మీద ఆధార పడ్డ సామాజిక వ్యవస్థను చూశాము. అప్పటికీ వర్ణ వ్యవస్థ బలంగా వేళ్లానుకోలేదు. ఋగ్వేదం చివరి కాలంలో ఈ వర్ణ వ్యవస్థ పొడసూపినట్లు పదో మండలంలోని పురుష సూక్తం ద్వారా అర్థమవుతుంది. కానీ యజుర్వేద కాలానికి మాత్రం ఎటువంటి సందేహాలకు ఆస్కారం లేకుండా వర్ణ వ్యవస్థ నిర్మాణం జరిగింది. దాని వివరాలన్నీ యజుర్వేదం వివరిస్తుంది. సమాజం బ్రాహ్మణ,క్షత్రియ, వైశ్య ,శూద్రులు గా విభజితం అయింది.(శుక్లయజుర్వేదం, వాజసనేయ -31). అధర్వ వేదం (19-6).

బ్రాహ్మణులు వారి జన్మ రీత్యా బ్రాహ్మణ్య గుర్తింపు పొందారు. వారికున్న మరో పేరు బ్రాహ్మణ అంటే బ్రహ్మ వంశీకులు. (బ్రహ్మకు దాయాదులు) గా చెప్పబడింది. వారి పని వేదాధ్యయనం, వైదిక క్రతువుల కర్మకాండల నిర్వహణ, అధ్యాపన లాంటివి బ్రాహ్మణుల వృత్తి ధర్మంగా ప్రకటించబడింది. (శతపథ బ్రాహ్మణం 11-5-7-1). క్రతువులను, కర్మకాండలనునిర్వహించినందుకు ప్రతిఫలంగా కానుకలు లేదా దక్షిణలు గ్రహించు వానిగాను(ఆదాయి), నైవేద్యములు స్వీకరించు వానిగాను (అపాయి) వర్ణించబడింది. ఐతరేయ బ్రాహ్మణం (7-29-2).

తరువాతి వారు క్షత్రియులు." క్షిత్ "అనే ధాతువు నుండి వచ్చింది.అంటే రక్షించుట." క్షత్ర" అంటే శక్తి లేక అధికారం. ఇది పాలకవర్గానికి వాడబడిన పదం. రాజు అంటే ప్రకాశించు లేదా నడిపించు అనే అర్థాన్ని ఇచ్చే పదం నుండి వచ్చింది. ఇతిహాసాలలో "రాజు" అన్న పదం లిసంతోష పరుచు"అనే మరో మూల పదము నుండి తీసుకోబడినట్లు చెప్పారు. ఏది ఏమైనా నా క్షత్రియుడు లేదా యోధుడు అనేది పాలకుడు అనే అర్థాన్నేసూచిస్తున్నది. ఎవరైతే అధికారాన్ని చేపట్టారో వారిని సూచిస్తూ అతనిని క్షత్రియుడిగా పరిగణించబడతాడు. విలువిద్యలో ప్రావీణ్యం కలిగి ఉండి, రథం పై నుండి పోరాడే వారిని యోధులు గాను, రాజన్యులు అంటే ఆ వర్గంలో శ్రేష్టులు అని శతపథ బ్రాహ్మణం 13-1-9-2 చెబుతోంది. మానవులైన రాజులకు దైవ లక్షణాలు ఆపాదించబడినాయి. దేవతలకు మనుషులకు మధ్యవర్తిగా భావించబడిన పురోహితులు రాజుకు దైవత్వం సిద్ధించ టానికి ప్రత్యేక యజ్ఞాలు చేసేవారు. నా విష్ణుః పృథివీ పతిః అంటే రాజు దైవాంశ సంభూతుడని రాజు ని మించిన దేవుడు లేదు అని అన్నారు.

మరొక వర్ణం వైశ్యులు. ఇది విష్ అనే ధాతువు నుండి వైశ్య అనే పదం వచ్చిందని ఇదివరకే చూశాం. వైశ్యులు సాధారణ ప్రజలు, కర్షకులు. ఐతరేయ బ్రాహ్మణం ప్రకారం (12-29) వారు మరొకరికి (అనస్య ) బలి లేదా

# మౌర్యుల అనంతర కాలంలో సమాజం - సంస్కృతి

**(14వ పేజీ తరువాయి)**

మిళిందపన్హ గ్రంథంలో ఉన్నాయి. దాసి, దాసుడు, భాటకుడు, కర్మకారి వంటి పేర్లు బానిసలకు సంబంధించినవే.

**సామాజిక జీవితం**

పట్టణాల్లో చేతివృత్తులవారు ఎక్కువగా జీవించేవారు. దాదాపు 75 రకాల చేతివృత్తులను మిళిందపన్హగ్రంథం పేర్కొంది. రాజగృహ పట్టణంలో 36 రకాల చేతివృత్తుల వారు ఉన్నట్టు మహావాస్తు గ్రంథం ప్రస్తావించింది. ఒకే వృత్తి చేసేవారంతా ఒక శ్రేణి గా పరిగణించబడేవారు. యూరప్ లో ఉండిన చేతివృత్తుల గిల్డుల మాదిరిగా ఇవి ఉండేవి. శ్రేణికి ప్రత్యేకమైన కట్టుబాట్లు ఉండేవి. నేత, కుండలు చేయడం, నీటిని తోడే చక్రాలను తయారు చేయడం, గానుగ ఆడించడం, పిండి తయారు చేయడం, తములపాకులను ఏరి కట్టలు కట్టడం, రాళ్ళు చెక్కడం వంటి వృత్తులు అనేకం ఉండేవి.

ఈ చేతివృత్తుల శ్రేణులకు పై స్థాయిలో వర్తకుల గోష్టులు ఉండేవి. ఈ గోష్టులు వర్తకాన్ని నిర్వహించడంతోబాటు బ్యాంకర్లు గా కూడా పని చేసేవి. ఇటువంటి శ్రేణుల ప్రస్తావన భట్టిప్రోలు ప్రాంతంలో లభించిన శాసనాలలో ఉంది.

చేతివృత్తులకు చెందిన శ్రమజీవులకు పైన మరో దొంతర కూడా ఉండేది. వారిని నాగరికులు అని పేర్కొన్నారు. వీళ్ళు ప్రధానంగా ధనవంతులు. ఏ పనీ చేయకుండా తీరుబాటుగా ఉంటూ కాలక్షేపం చేసేవాళ్ళు ఈ కోవలోకి వస్తారు. కానుకల రూపంలో ధనాన్ని, విలువైన వస్తువులను స్వీకరించిన బ్రాహ్మణులు, యుద్ధాలలో ఇతరులను కొల్లగొట్టి సంపదను స్వాధీనం చేసుకున్న క్షత్రియులు, వ్యాపారంలో లాభాలు సంపాదించిన వైశ్యులు ఈ దొంతరలో ఉంటారు. అన్ని సౌఖ్యాలనూ అనుభవిస్తూ, కవిత్వాన్ని. సంగీతాన్ని ఆస్వాదిస్తూ, వేశ్యావాటికలను సందర్శిస్తూ ఈ నాగరికులు జీవించేవారు.

బౌద్ధ, జైన ఆరామాలకు విరాళాల రూపంలో తమ సంపదను ఇచ్చి సన్యాసం స్వీకరించిన స్త్రీ, పురుషులు చాలామంది ఉన్నారు. అమరావతి ప్రాంతంలో ఆ విధంగా ఆరామాలకు కానుకలు ఇచ్చిన వారు 200 మందికి పైగా ఉన్నట్టు ఆధారాలు ఉన్నాయి.

ఇక గ్రామాలలో అందరికన్నా పైన గ్రామాధిపతి ఉండేవాడు. ఆ తర్వాత భూమిమీద అధికారం ఉన్న కుటుంబాల పెద్దలు ఉంటారు. ఆ తర్వాత నాగళ్ళ యజమానులు వస్తారు. ఈ తరగతుల వద్ద కొంత సంపద పోగుబడివుండేది.

ఈ ఆధిపత్య తరగతులకింద సాధారణ గ్రామస్తులు ఉండేవారు. గ్రామస్తులు, దాసులు, దాసీలు, కూలికి పని చేసేవారు, సేవకులు – ఈ మాదిరిగా గ్రామాలలోని శ్రమజీవులను మిళిందపన్హలో వర్గీకరించారు. ఈ వర్గీకరణ కుల వ్యవస్థ చట్రంలోకి ఏవిధంగా ఇమిడి వుండేదో మనకు తెలియదు. ఈ తరగతులలో వెలివేయబడిన వారు కూడా ఉన్నదీ లేనిదీ తెలియదు. (చూ. మ్యాప్1.1 ) ❋

పన్ను లేదా కప్పం కట్టాలి. ఈ వైశ్యులు బ్రాహ్మణులు నిర్వహించే యజ్ఞం లో భాగస్వాములు అవ్వటం గాని, యజ్ఞశాల లోకి ప్రవేశించే హక్కు గాని లేదు. శతపథ బ్రాహ్మణం (3–1–1–9–10). వీరి స్థానం బ్రాహ్మణ,క్షత్రియుల తరగతి కన్నా దిగువ స్థానమే.

అందరికన్నా అట్టడుగు స్థానం సూద్రులది. ఋగ్వేదంలో ఆర్య, దస్యు, దాస అనేవి అనే పదాలు ఎక్కువగా కనపడతాయి. కానీ యజుర్వేద కాలం నాటికి ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయి దస్యు, దాస స్థానంలో ఆర్య శూద్ర ప్రస్తావనలు ఆక్రమించాయి. (వాజసనేయ సంహిత14–30,20–17,16–2). మొత్తం మీద బ్రాహ్మణులు, రాజన్యులు, వైశ్యులు సమాజంలోని ఆర్య విభాగంలో ఉండగా, శూద్రులు ఆర్యతర భాగంలో అట్టడుగు స్థానంలో ఉంచారు. ఆ మూడు వర్ణాలను ద్విజులు అన్నారు. అంటే రెండోసారి జన్మను పొందినవారు అని అర్థం. అది యజ్ఞోపవీతం అంటే ఉపనయనంచేసుకుంటే ఆ అర్హత వారికి లభిస్తుంది. ఆ అర్హత ఆ మూడు వర్ణాలకు మాత్రమే ఉన్నది. శూద్రులకు ఆ హక్కునిరాకరించబడినది. అందువలన శూద్రులు ఒకే జన్మను కలిగి ఉంటారు.

శూద్రులను ఆర్య సమాజం లో భాగంగా అంగీకరించినప్పటికీ వారికి ఎటువంటి హక్కులు లేవు. ఐతరేయ బ్రాహ్మణం 7–29–4 ప్రకారం మిగిలిన వారికి అంటే పై మూడు వర్ణాలకు సేవ చేయటానికి మాత్రమే (అన్యస్య(ప్రేష్య)జన్మించారు. వీరిని ఇష్టానుసారం చంపటానికి అర్హులు (యధా కామ వధ్య), వారికి ఆవుల సంపద ఉన్నప్పటికీ వారి స్థానం మార బోదు అని పంచవింశతి బ్రాహ్మణం 6–1–11 పేర్కొంటున్నది. అంటే ఈ సూద్రులు పై మూడు వర్ణాలకు ఉమ్మడి భృత్యులే. అంటే ఉమ్మడి సేవకులే. యజ్ఞం లో భాగంగా అగ్ని ప్రదక్షణ చేసేటప్పుడు పురోహితులు ఒక చివరన, రాజన్యులు మరొక చివరన ఉండి, సూద్ర, వైశ్య జనాన్ని లోబర్చుకోవడం కోసం మధ్యలో ఉండేలాగా చూడాలని ఐతరేయబ్రాహ్మణం పేర్కొంటుంది. పవిత్రుడైన గురువు"శూద్రులతో సంబంధాన్ని, ఉచ్ఛిష్టాన్ని ఇవ్వటం మానుకోవటమే కాక, స్త్రీని, శూద్రుడను తదితరులను కూడా చూడరాదని చెప్తుంది (14–1–31).

ఇక శూద్ర స్త్రీలు, దాసీలు, స్త్రీ బానిసలు, పురుష బానిసలు అనే పేరుతో అధర్వ వేదం లో కనిపిస్తారు. స్త్రీల స్థానం ఆనాడు మరింత అధోగతి పాలయింది. స్త్రీలకు"కాముకి", "స్వైరిణి"అన్న అవమానకరమైన పదాలు వాడారు. (అధర్వ వేదం 5–22–6–7). ఆడవాళ్లను"శూద్రుడు, కుక్క, కృష్ణ పక్షి"తో సమానంగా ను, వీరు మూర్తిభవించిన "అసత్యం"గాను శతపథ బ్రాహ్మణం 15–1–1–31 పేర్కొంటుంది. వారిని ఆశుచితో కూడిన వారిగా చెప్పబడింది. దాసీలు రోలు రోకలి తో పనిచేస్తూ (అధర్వ వేదం (12–3–13), ఆవుపేడను పొగేయ్యాలి. (12–4–9). వాజసనేయ సంహితలో పురుష సూక్తం లో వెదురు చీల్చడం, వాడి అయిన వస్తువులు తయారు చేయటం, అల్లికలు, బట్టలు ఉతకటం, రంగులు అద్దటం, లేపనాలు తయారు చేయటం లాంటి వృత్తులను ఆడవారే చేసేవారు. ఆడవారు చేసే పనిని తిరస్కార భావంతో చూసేవారు. ఇలాంటి పనులు చేసే ఆడువారిని దెయ్యాలకు భూతాలకు బలివ్వడానికి తగిన వారని, రంగులద్దే వారిని ఇంద్రియ సుఖాలకు బలి ఇవ్వాలని అన్నారు. సమాజంలో సంపన్నులైన వారిలో బహుభార్యత్వం ఉన్నది. రాజుకు ఉండే నలుగురు భార్యలను గురించి శతపథ బ్రాహ్మణం 13–2–6–7 ప్రస్తావిస్తూ పలువురు భార్యలు ఉండటం ఒక సామాజిక ఘనత అని పేర్కొంటుంది.

స్త్రీలను లైంగికంగా దోచుకునే ప్రధాన సాధనాలలో ఒకటి శుక్ల యజుర్వేదంలో (వాజసనేయ 30–5) దర్శనమిస్తుంది. విషయేచ్చను(కామము) సంతృప్తి పరిచేందుకై ఉద్దేశించిన వ్యభిచార వృత్తికి లాంచనప్రాయమైన గుర్తింపు లభించింది. పలుచోట్ల పనిచేసిన దాస స్త్రీ లైంగిక వాంఛలకు ఎలా గురైందీ చాందోగ్యోపనిషత్ 4–4–1–4 లోని సత్యకామ జాబాలి కథ తెలియజేస్తుంది.

కృష్ణ యజుర్వేదం ప్రకారం ఆనాటి ప్రజలకు 28 నక్షత్రాల పేర్లు తెలుసు. అయితే సూర్య, చంద్ర చంద్ర గ్రహణాలు ఎలా ఏర్పడతాయో వారికి అంతు పట్టినట్లు లేదు. రాక్షసుడైన రాహువు, కేతువు కారణం అని భావించారు. వైద్యానికి సంబంధించి మానవ శరీరంలో వివిధ అవయవాలను అధర్వవేదము 10–2,1–15 వివరిస్తుంది. శతపథ బ్రాహ్మణం 12–2,4–13–14 మనుష్యునికి వెన్నెముకలోని పూసల సంఖ్యను 26 అని కచ్చితంగా వివరించింది. రోగాలకు సంబంధించి, చికిత్సలు చేయటానికి మొక్కలు, వనమూలికలను వినియోగించారు. అదే సమయంలో మంత్రాలతో రోగాలు నయమవుతాయని ఎక్కువగా భావించేవారు.

యజుర్వేద కాలానికి యజ్ఞ కర్మకాండ చాలా ఎక్కువగా ఉండేది. యజ్ఞాలలో బలులు అనూహ్యంగా పెరిగిపోయాయి. బలి ఇవ్వని జంతువు గాని, పక్షి గాని లేదంటే అతిశయోక్తి కాదు. ఒక్కొక్క యజ్ఞం కొన్ని రోజుల తరబడి సాగేది. అతిథిని ఆ కాలంలో "గో ఘ్న"అంటే గోమాంసం ఆరగించేవాడు అని పిలిచేవారు. యజ్ఞం నిర్వహించిన పురోహితులకు ఇచ్చిన దక్షిణ లను బట్టి ఈ కర్మకాండ ఎంత పెద్ద ఎత్తున సాగిందో ఊహించవచ్చు. అంగ రాజు"ఉదమయ ఆత్రేయ"అనే బ్రాహ్మణుడికి పదివేల స్త్రీ బానిసలను, పదివేల ఏనుగులను ఇచ్చాడని ఐతరేయ బ్రాహ్మణం చెబుతుంది. అదే బ్రాహ్మణంలో రాజుకి పట్టాభిషేకం చేసిన బ్రాహ్మణుడికి బండారం, పశువులు వేల సంఖ్యలో ఇవ్వాలని ఉంది. ఉపనిషత్తుల్లో జనక మహారాజు యజ్ఞవల్క్యుడు కి 10,000 గోవులను బహుమానంగా ఇస్తాడు. అయితే ఈ సాహిత్యాన్ని అంతా తయారు చేసింది బ్రాహ్మణులే కాబట్టి ఇందులో అతిశయోక్తి ఉన్నది అనుకున్నా, ఎక్కువ మొత్తాల్లో దక్షిణలు ఇచ్చినట్లుగా మాత్రం తెలుస్తున్నది. పురోహితులకు ఆవులు వాటితోపాటు బట్టలను, గుర్రాలను కూడా దక్షిణగా ఇచ్చేవారు. కొన్ని సందర్భాలలో రాజ్యంలో కొంత భాగాన్ని కూడా దక్షిణగా ఇవ్వమని అడిగేవారు. అశ్వమేధయాగం చేసినప్పుడు నాలుగు దిక్కుల లోనూ పురోహితులకు భూ దానం చేయాలని"శతపథ బ్రాహ్మణం" చెబుతోంది. ఇదే జరిగితే రాజుకు ఏం మిగులుతుంది? సాధ్యమైనంత భూమిని గుంజు కోవాలి అన్న పురోహితుల కోరికకు ఇది దర్పణం పడుతుంది.

రుగ్వేదంలోని అధిదేవత లైన ఇంద్రుడు, అగ్ని ఈ కాలంలో తమ ప్రాబల్యాన్ని కోల్పోయారు. యజుర్వేదకాలంలో సృష్టికర్త అయిన "ప్రజాపతి"కి అత్యున్నత స్థానం ఇవ్వబడింది. ఋగ్వేదంలో అప్రధాన దేవతలుగా భావించబడిన రుద్రుడు, విష్ణువుకు మలివేద యుగంలో ప్రాధాన్యత పెరిగింది. రుద్రుడు పశువుల దేవతగా ఆరాధించబడ్డాడు. రుగ్వేద కాలంలో సగం సంచార జీవనులుగా ఉన్నవారు ఇప్పుడు స్థిర నివాసం ఏర్పరుచుకుని ఉండటం చేత"విష్ణువు"వారికి రక్షకుడుగా పూజింప బడ్డాడు. దీనికితోడు దైవత్వానికి చిహ్నాలుగా కొన్ని వస్తువులను పూజించడం కూడా మలివేద యుగంలో ప్రారంభమయింది. ఋగ్వేద కాలంలో ప్రకృతి శక్తులకు మానవీయ రూపకల్పన చేసుకుని ఆరాధించే స్థానంలో ఇప్పుడు విగ్రహారాధన లక్షణాలు కూడా మొదలయ్యాయి.

❉

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 19, issue: 2 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ప్రపంచ నిరక్షరాశ్యుల్లో మూడో వంతు మంది భారత్‌లోనే




ప్రపంచ నిరక్షరాశ్యుల్లో మూడో వంతు మంది ఇంకా చెప్పాలంటే 35 శాతం మంది భారత దేశంలోనే ఉన్నారని యునెస్కో నివేదిక అయిదేళ్ల క్రితం వెల్లడించింది. ఇప్పటికీ ఈ పరిస్థితిలో మార్పులేదు. అయితే మన దేశంలోని కేరళ రాష్ట్రం మాత్రం దాదాపు అభివృద్ధి చెందిన దేశాల స్థాయిలో అక్షరాశ్యతను సాధించింది. ఉత్తర ప్రదేశ్ అతి తక్కువ అక్షరాశ్యతగల రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది.

ప్రపంచ జనాభా 800 కోట్లలో ఇప్పటికీ 77.3 కోట్ల మంది నిరక్ష రాశ్యులు. ఈ నిరక్ష రాశ్యుల్లో 27 కోట్ల మంది భారత దేశంలోనే నివసిస్తున్నారు. మొత్తం ప్రపంచ నిరక్షరాశ్యుల్లో మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నది. మొత్తం ప్రపంచంలో అక్షరాశ్యులు 86.9 శాతం ఉండగా పురుషుల్లో 90 శాతం, మహిళల్లో 82.7 శాతం అక్షరాశ్యత ఉంది. ఈ శాతాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో అక్షరాశ్యత శాతం 99.2 శాతం ఉండగా భారత్‌తో సహా దక్షిణసియాలో 7.2 శాతం ఉంది. సహారా ఎడారి దిగవన గల ఆఫ్రికా దేశాల్లో అత్యంత తక్కువ అక్షరాశ్యత 64 శాతం ఉంది. దక్షిణాసియాలో మొత్తం 78.1 కోట్ల మంది నిరక్షరాశ్యులుండగా వారిలో 77.3 కోట్ల మంది భారత దేశంలోనే ఉండడం విశేషం.

భారత దేశంతోపాటు లేక దాని తరువాత విముక్తి సాధించిన సోషలిస్టు దేశాలు అక్షరాశ్యత విషయంలో ఎంతో ముందంజలో ఉన్నాయ. సోషలిస్టు ఉత్తర కొరియా తమ దేశంలోని 100 శాతం ప్రజలకు విద్య నందించి ప్రపంచ ర్యాంకింగులో 5వ స్థానంలో నిలిచింది. భారత దేశం 73.23 అక్షరాశ్యతతో ప్రపంచంలోని సుమారు 200 దేశాల్లో 169వ స్థానంలో నిలవగా పొరుగున ఉన్న శ్రీలంక మన కన్నా మెరుగ్గా 92.61 శాతం అక్షరాశ్యతతో 125వ స్థానంలో నిలిచింది. ఇక మిగిలిన దక్షిణాసియా దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్, పాకిస్థాన్‌లు మనకన్నా అక్షరాశ్యతలో వెనుకబడి ఉన్నాయి.

ప్రపంచ అగ్ర దేశంగా పిలవబడుతున్న అమెరికా 99 శాతం అక్షరాశ్యతతో 51వ స్థానంలో నిలిచింది. ఉత్తర కొరియా తరువాత ఇతర సోషలిస్టు దేశాలైన  క్యూబా 99.71 శాతం అక్షరాశ్యతతో 21 స్థానంలోనూ, చైనా 96.36 శాతం అక్షరాశ్యతతో 87వ స్థానంలోనూ, వియత్నాం 94.51 శాతంతో 113వ స్థానంలోనూ ఉన్నాయి. సోషలిస్టు తరహా ఆర్థిక, సామాజిక విధానాలు ప్రవేశపెట్టిన వెనిజులా 95.4 శాతం అక్షరాశ్యతతో 100 స్థానంలో ఉంది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా** | **పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..........................................

వీధి ..........................................

గ్రామం ..........................................

మండలం లేదా పట్టణం ..........................................

జిల్లా ..........................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.